


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 120 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : హైదరాబాద్ గురువారం 12 మార్చి 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 120 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : HYDERABAD THU 12 MARCH 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Hyderabad, Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur



## మార్చి నుంచే రైతు భరోసా..

### ఖాతాల్లోకి మొత్తం రూ.9 వేల కోట్లు: మంత్రి వివేక్ వెంకటస్వామి

- చెన్నూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రమాణస్వీకార కార్యక్రమానికి హాజరు
- తమది రైతు పక్షపాతి ప్రభుత్వమని వెల్లడి

మిగతా 2లో

## ఇరాన్‌తో యుద్ధం త్వరలో ముగుస్తుంది.. నేనెప్పుడు అనుకుంటే అప్పుడే ఆగిపోతుంది

- ఇరాన్‌లో లక్ష్యాలను ఛేదించామన్న ట్రంప్
- ఇరాన్ వద్ద ఇంకా ఏమీ మిగలలేదని వ్యాఖ్య
- యాక్సియోస్ ఇంటర్వ్యూలో ఆసక్తికర వ్యాఖ్యలు




**హైదరాబాద్ పెన్ పవర్:**అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన చేశారు. నేను ఎప్పుడు అనుకుంటే అప్పుడు యుద్ధం ఆగుతుందని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌లో అన్ని లక్ష్యాలను ఛేదించామని ఆయన వెల్లడించారు. ఇరాన్ వద్ద ఇంకా ఏమీ మిగలలేదని అన్నారు. ఇరాన్‌తో

మిగతా 2లో

## లోక్‌సభ స్పీకర్‌కు ఊరట.. వీగిపోయిన అవిశ్వాస తీర్మానం

- లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానం తిరస్కరణ
- మూజువాణి ఓటుతో వీగిపోయిన ప్రతిపక్షాల తీర్మానం
- చర్చలో రాహుల్ గాంధీపై అమిత్ షా తీవ్ర విమర్శలు
- ఛైర్‌లో కూర్చోకుండా కొత్త సంప్రదాయానికి తెరతీసిన ఓం బిర్లా
- స్పీకర్‌ను ఇరుకున పెట్టాలనుకున్న విపక్షాల వ్యూహం విఫలం

మిగతా 2లో



# తెలంగాణ నూతన గవర్నర్‌గా శివ్ ప్రతాప్ శుక్లా ప్రమాణ స్వీకారం

## తెలుగులో ప్రమాణం చేసి అందరినీ ఆశ్చర్యపరిచిన శుక్లా

- ప్రమాణం చేయించిన హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్
- కార్యక్రమానికి హాజరైన సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు, ఉన్నతాధికారులు
- ఈ నెల 16 నుంచి ప్రారంభమయ్యే బడ్జెట్ సమావేశాల్లో గవర్నర్ ప్రసంగం




**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణ రాష్ట్ర నూతన గవర్నర్‌గా శివ్ ప్రతాప్ శుక్లా బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ ఆయనతో ప్రమాణం చేయించారు. అయితే, ఉత్తరప్రదేశ్‌కు చెందిన శుక్లా అనూహ్యంగా తెలుగులో ప్రమాణం చేసి అక్కడున్న వారందరినీ ఆశ్చర్యపరిచారు. ఈయన తెలంగాణకు నాల్గవ గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, పలువురు మంత్రులు హాజరయ్యారు. వీరితో పాటు హిమాచల్ ప్రదేశ్ మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, డీజీపీ బి.శివధర్ రెడ్డి తదితర ఉన్నతాధికారులు కూడా పాల్గొన్నారు.ప్రమాణ స్వీకారం అనంతరం గవర్నర్ శుక్లాకు ముఖ్యమంత్రి, ఇతర ప్రముఖులు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. కాగా, ఈ నెల 16వ తేదీ నుంచి రాష్ట్ర బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో అదే రోజున ఉభయ సభలను ఉద్దేశించి

మిగతా 2లో

# కడియం, దానంలకు స్పీకర్ క్లీన్ చిట్

- కడియం, దానంలపై దాఖలైన అనర్హత పిటిషన్లను కొట్టివేసిన స్పీకర్
- పార్టీ మారినట్టు సరైన ఆధారాలు లేవన్న స్పీకర్
- తాజా తీర్పుతో మొత్తం 10 మంది ఎమ్మెల్యేలకు క్లీన్ చిట్



**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ రాజకీయాల్లో గత కొంతకాలంగా ఉత్కంఠ రేపుతున్న ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్ల వ్యవహారానికి స్పీకర్ గడ్డం ప్రసాద్ తెరదించారు. అధికార కాంగ్రెస్ పార్టీలో చేరారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరిలపై దాఖలైన అనర్హత పిటిషన్లను ఆయన కొట్టివేస్తూ, వీరికి క్లీన్ చిట్ ఇచ్చారు. వీరిద్దరూ అధికారికంగా పార్టీ మారినట్లు సరైన ఆధారాలు లేవని, ఈ కారణంగా వారిపై అనర్హత వేటు వేయలేమని స్పీకర్ తన తీర్పులో స్పష్టం చేశారు.ఈ అంశంపై (గురువారం) సుప్రీంకోర్టులో విచారణ జరగాల్సి ఉంది. కోర్టు విచారణకు ముందు రోజు ఈ వ్యవహారంపై స్పీకర్ తన విచారణను

మిగతా 2లో

## దీక్ష విరమించిన తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత

- వెలుగుమట్ల బాధితులకు ప్రభుత్వం నుంచి హామీ రావడంతో దీక్ష విరమణ
- సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో దీక్ష విరమించిన కవిత, విశారదన్ మహరాజ్
- నిమ్మరసం ఇచ్చి విరమింపజేసిన బీసీ కమిషన్ మాజీ ఛైర్మన్

మిగతా 2లో



## వెలుగుమట్ల బాధితులకు ఇండ్ల పట్టాలు.. డిసెంబర్ 9న గృహప్రవేశం

**హైదరాబాద్ పెన్ పవర్:**ఇందిరమ్మ ప్రభుత్వం అంటే ప్రజా ప్రభుత్వ మని అన్నారు డిప్యూటీ సీఎం భట్టి విక్రమా ర్క. బుధవారం (మార్చి 11) వెలుగుమట్ల బాధితులకు ఇందిరమ్మ ఇండ్ల పట్టాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న

మిగతా 2లో



## దానం, కడియంలకు క్లీన్ చిట్ ఇవ్వడంపై కేటీఆర్ ఫైర్

- ఇది ప్రజాస్వామ్యంపై బహిరంగ దాడి అన్న కేటీఆర్
- కాంగ్రెస్ పార్టీ తరపున ఎంపీగా పోటీ చేసిన వ్యక్తికి క్లీన్ చిట్ ఇచ్చారని మండిపాటు
- ప్రజాస్వామ్య విలువలు ఎక్కడున్నాయని ప్రశ్న


మిగతా 2లో




## ఇరాన్, అమెరికా యుద్ధాన్ని కాంగ్రెస్ పార్టీ రాజకీయానికి ఉపయోగించుకుంటోంది నరేంద్రమోదీ ఆగ్రహం

- ప్రవాస భారతీయుల పరిస్థితి దిగజారేలా కాంగ్రెస్ బాధ్యతారాహిత్య ప్రకటనలు చేస్తోందని ఆగ్రహం
- గల్ఫ్‌లోని పరిస్థితుల కారణంగా మన ఆందోళన సహజమేనన్న ప్రధానమంత్రి
- లక్షలాది మంది భారతీయులు అక్కడ పని చేస్తున్నారన్న మోదీ
- గల్ఫ్ దేశాల్లో ఉన్న భారతీయులను ఒంటరిగా వదలం అన్న నరేంద్ర మోదీ

మిగతా 2లో







## వంట గ్యాస్, పెట్రోల్, డీజిల్ సంక్షోభం...

### కేంద్రం కీలక ప్రకటన

మిగతా 2లో





- వంట గ్యాస్‌పై ప్రజల్లో ఆందోళన అవసరం లేదన్న కేంద్రం
- ఎల్పీజీ ఉత్పత్తిని 25 శాతం పెంచాలని చమురు కంపెనీలను ఆదేశం
- ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా చమురు దిగుమతి అవుతోందన్న కేంద్రం

**హైదరాబాద్ పెన్ పవర్:**పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధం నేపథ్యంలో దేశవ్యాప్తంగా వంట గ్యాస్‌పై ప్రజల్లో ఆందోళన నెలకొంది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. బుకింగ్ చేసిన రెండున్నర రోజుల్లో వంట గ్యాస్ సిలిండర్ డెలివరీ అవుతుందని తెలిపింది. ఎల్పీజీ ఉత్పత్తిని 25 శాతం పెంచాలని చమురు కంపెనీలను ఇప్పటికే ఆదేశించినట్లు వెల్లడించింది. పెట్రోల్, డీజిల్, ముడి చమురు, వంట గ్యాస్ సరఫరా విషయంలో ఆందోళన అవసరం లేదని తెలిపింది.

# దీక్ష విరమించిన తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత

ఖమ్మం జిల్లా వెలుగుమట్ల బాధితులకు న్యాయం చేయాలని కోరుతూ తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత నిరవధిక దీక్షకు దిగిన విషయం తెలిసిందే. ప్రభుత్వం నుంచి వెలుగుమట్ల బాధితులకు హామీ వచ్చిన నేపథ్యంలో ఆమె తన దీక్షను సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో విరమించారు. కవితతో పాటు ధర్మ సమాజ్ పార్టీ అధినేత విశారదన్ మహారాజ్ కూడా దీక్షను విరమించారు. జాతీయ బీసీ కమిషన్ మాజీ ఛైర్మన్ జస్టిస్ ఈశ్వరయ్య వారికి నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింప జేశారు. వెలుగుమట్ల బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ కవిత ఖమ్మంలో సోమవారం రాత్రి నిరవధిక దీక్షను చేపట్టారు. పోలీసులు ఆమెను అడ్డుకుని హైదరాబాద్‌కు తరలించగా, నగరంలో ఆమె దీక్షను కొనసాగించారు. వెలుగుమట్ల భూదాన్ భూమిలో అర్హులకు ఇళ్ల స్థలాలు, ఇందిరమ్మ ఇళ్ల పట్టాలను ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క పంపిణీ చేశారు. వెలుగుమట్ల పేదలకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. 412 మందిని అధికారికంగా గుర్తించి, పట్టాలు ఇచ్చి న్యాయం చేస్తున్నామని అన్నారు. పట్టాలు పొందిన వారు రేపటి నుంచి తమ ఇళ్ల నిర్మాణం ప్రారంభించాలని కూడా ధైర్యం చెప్పారు. వెలుగుమట్ల అంశంపై ప్రభుత్వం స్పందించడంతో కవిత దీక్ష విరమించారు.

దీక్ష విరమణ సందర్భంగా కవిత మాట్లాడుతూ, తమ పోరాటం ఆగలేదని, కేవలం విరామం మాత్రమే అన్నారు. వెలుగుమట్ల బాధితులకు పూర్తి న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని అన్నారు. మన ఆందోళనలు, వెలుగుమట్ల ఆడపడుచుల నిరసనలతో ప్రభుత్వం దిగి వచ్చిందని అన్నారు.




## ప్రపంచాన్ని వణికిస్తున్న చమురు భయాలు

ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో చమురు కీలక స్థానం కలిగిన వనరు. ఆధునిక పారిశ్రామిక వ్యవస్థలన్నీ ఇంధనంపై ఆధారపడి నడుస్తున్నాయి. అందువల్ల ప్రపంచంలో ఎక్కడైనా యుద్ధం, రాజకీయ ఉద్రిక్తతలు లేదా అంతర్జాతీయ సంబంధాల్లో మార్పులు చోటుచేసుకున్నప్పుడు మొదట ప్రభావం చూపే రంగం చమురు మార్కెట్. చరిత్రను పరిశీలిస్తే యుద్ధాలు మరియు చమురు ధరల మధ్య గాఢమైన సంబంధం కనిపిస్తుంది. ముఖ్యంగా 1973 చమురు సంక్షోభం ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు పెద్ద దెబ్బగా నిలిచింది. ఆ సంఘటన తరువాత ప్రపంచం చమురు రాజకీయాలను మరింత జాగ్రత్తగా పరిశీలించడం ప్రారంభించింది. ప్రస్తుతం పశ్చిమ ఆసియా ప్రాంతంలో మళ్లీ ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో చమురు ధరల పెరుగుదలపై ప్రపంచవ్యాప్తంగా ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. 1973లో జరిగిన అరబ్ ఇజ్రాయిల్ యుద్ధం అనంతరం ఏర్పడిన చమురు సంక్షోభం ఆధునిక ప్రపంచ చరిత్రలో కీలక మలుపుగా నిలిచింది. 1973 అక్టోబర్ నెలలో ప్రారంభమైన ఈ సంఘటనకు మూలం అరబ్ దేశాలు మరియు ఇజ్రాయిల్ మధ్య ఉన్న దీర్ఘకాలిక వైరం. అక్టోబర్ 6న ఈజిప్ట్ మరియు సిరియా సంయుక్తంగా ఇజ్రాయిల్‌పై దాడి చేయడంతో యుద్ధం ప్రారంభమైంది. ఈ యుద్ధాన్ని ప్రపంచం "యోమ్ కిప్పూర్ యుద్ధం"గా కూడా పిలుస్తుంది. ఈ పోరాటంలో అమెరికా ఇజ్రాయిల్‌కు బహిరంగ మద్దతు ప్రకటించింది. దీనికి ప్రతిగా అరబ్ దేశాలు అమెరికా మరియు పాశ్చాత్య దేశాలపై ఆర్థిక ఒత్తిడి తేవాలని నిర్ణయించాయి. ఈ సందర్భంలో చమురు ఉత్పత్తి దేశాల సమాఖ్య అయిన ాఖఇఅ కీలక నిర్ణయం తీసుకుంది. అమెరికా, పాశ్చాత్య దేశాలకు చమురు సరఫరాను తగ్గిస్తూ ఆంక్షలు విధించింది. ఈ నిర్ణయం ప్రపంచ మార్కెట్‌ను కుదిపేసింది. అప్పటివరకు ఒక బ్యారెల్ చమురు ధర సుమారు 3 డాలర్ల పరిధిలో ఉండగా కొన్ని నెలల్లోనే అది 12 డాలర్లకు పైగా పెరిగింది. ధరలు నాలుగు రెట్లు పెరగడం ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు పెద్ద షాక్‌గా మారింది.

ఈ సంక్షోభం కారణంగా అమెరికా మరియు యూరప్ దేశాల్లో ఇంధన కొరత తీవ్రంగా కనిపించింది. పెట్రోల్ బంకుల వద్ద పొడవైన క్యూలు కనిపించాయి. అనేక దేశాల్లో ప్రభుత్వం ఇంధన వినియోగాన్ని పరిమితం చేయాల్సి వచ్చింది. కొన్ని దేశాల్లో వారానికి కొన్ని రోజులు మాత్రమే వాహనాలు నడపాలని ఆంక్షలు విధించారు. పరిశ్రమల ఉత్పత్తి తగ్గిపోయింది. రవాణా ఖర్చులు పెరిగాయి. ఫలితంగా ద్రవ్యోల్బణం పెరిగి ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక మాంద్యం నెలకొంది. ఈ సంఘటన ప్రపంచ దేశాలకు ఒక పెద్ద పాఠంగా మారింది. చమురు సరఫరా కొన్ని దేశాల చేతుల్లో ఉండటం ఎంత ప్రమాదకరమో అప్పుడే స్పష్టమైంది. అందుకే తరువాతి కాలంలో అమెరికా, యూరప్ దేశాలు ప్రత్యామ్నాయ ఇంధన వనరులపై దృష్టి పెట్టాయి. అణుశక్తి, సహజవాయువు, పునరుత్పాదక ఇంధన వనరులపై పరిశోధనలు వేగం పుంజుకున్నాయి. అయినప్పటికీ ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ఇప్పటికీ చమురు మీదే ఎక్కువగా ఆధారపడి ఉంది. చమురు ధరల పెరుగుదల చరిత్రలో 1973 తర్వాత కూడా పలుమార్లు చోటుచేసుకుంది. 1979లో ఇరాన్ విప్లవం సమయంలో మరోసారి చమురు ధరలు భారీగా పెరిగాయి. అప్పట్లో ఇరాన్‌లో రాజకీయ అస్థిరత కారణంగా చమురు ఉత్పత్తి తగ్గిపోయింది. ఫలితంగా ప్రపంచ మార్కెట్లో కొరత ఏర్పడి ధరలు మళ్లీ పెరిగాయి. తరువాత 1990లో ఇరాక్ కువైట్‌పై దాడి చేసినప్పుడు కూడా చమురు మార్కెట్ కుదేలైంది. 2003లో ఇరాక్ యుద్ధం, 2011లో అరబ్ స్ప్రింగ్ ఉద్యమాలు కూడా చమురు ధరలపై ప్రభావం చూపాయి. ప్రస్తుతం పశ్చిమ ఆసియా ప్రాంతంలో మళ్లీ ఉద్రిక్తతలు పెరుగుతున్నాయి. ముఖ్యంగా ఎతీజీని మరియు ఎబతీజీవశ్రీ మధ్య పెరుగుతున్న విభేదాలు అంతర్జాతీయ రాజకీయాలను కలవరపెడుతున్నాయి. ఈ పరిణామాల్లో జనితిబివట ాబిజీబివబ కూడా ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా పాత్ర పోషిస్తోంది. ఈ మూడు దేశాల మధ్య ఉద్రిక్తతలు పెరిగితే పశ్చిమ ఆసియాలో యుద్ధ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. పశ్చిమ ఆసియా ప్రాంతం ప్రపంచ చమురు నిల్వలలో అత్యధిక వాటా కలిగిన ప్రాంతం. ఈ ప్రాంతం నుంచి ప్రపంచ మార్కెట్‌కు పెద్ద మొత్తంలో చమురు సరఫరా జరుగుతుంది. అందువల్ల అక్కడ యుద్ధం లేదా రాజకీయ సంక్షోభం తలెత్తితే వెంటనే చమురు ధరలు పెరిగిపోతాయి. ముఖ్యంగా హోర్ముజ్ సముద్ర మార్గం ద్వారా ప్రపంచ చమురు సరఫరాలో గణనీయమైన భాగం రవాణా అవుతుంది. ఆ మార్గం ప్రమాదంలో పడితే ప్రపంచ మార్కెట్‌లో భారీ అస్థిరత తలెత్తుతుంది.

ఇలాంటి పరిస్థితుల్లో చమురు ధరల పెరుగుదల మొదట ప్రభావం చూపేది ఇంధన ధరలపైనే. పెట్రోల్, డీజిల్ ధరలు పెరగడంతో రవాణా ఖర్చులు పెరుగుతాయి. ట్రక్కులు, బస్సులు, రైళ్లు వంటి రవాణా వ్యవస్థల ఖర్చులు పెరగడం వల్ల వస్తువుల ధరలు కూడా పెరుగుతాయి. వ్యవసాయ రంగం కూడా దీనికి మినహాయింపు కాదు. ట్రాక్టర్లు, పంపుసెట్లు, ఎరువుల తయారీ అన్నీ ఇంధనంపై ఆధారపడి ఉంటాయి. అందువల్ల రైతులకు ఉత్పత్తి వ్యయం పెరుగుతుంది. భారతదేశం వంటి దేశాలకు ఈ పరిస్థితి మరింత క్లిష్టంగా ఉంటుంది. ఎందుకంటే భారత్ తన అవసరాలకు కావలసిన చమురులో ఎక్కువ భాగాన్ని విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటుంది. అంతర్జాతీయ మార్కెట్లో ధరలు పెరిగితే దేశీయ మార్కెట్లో కూడా పెట్రోల్, డీజిల్ ధరలు పెరగడం సహజం. ఇది ప్రభుత్వ ఆర్థిక వ్యవస్థపై కూడా ఒత్తిడి పెంచుతుంది. సబ్సిడీలు పెరగడం లేదా పన్నుల తగ్గింపు వంటి చర్యలు తీసుకోవాల్సి వస్తుంది. ఇంధన ధరల పెరుగుదల సామాన్య ప్రజల జీవన విధానాన్ని కూడా ప్రభావితం చేస్తుంది. రవాణా ఖర్చులు పెరగడంతో కూరగాయలు, ధాన్యాలు, అవసర వస్తువుల ధరలు పెరుగుతాయి. విద్యుత్ ఉత్పత్తి ఖర్చులు పెరగడంతో విద్యుత్ చార్జీలు కూడా పెరిగే అవకాశముంది. ఈ పరిస్థితి మొత్తం ద్రవ్యోల్బణాన్ని పెంచుతుంది. ఇటీవలి కాలంలో వంటగ్యాస్ ధరల పెరుగుదల కూడా ప్రజలపై అదనపు భారం మోపుతోంది. ముఖ్యంగా కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల ధరలు పెరగడం హోటల్ రంగాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తోంది. రెస్టారెంట్లు, చిన్న హోటళ్లు, టీ దుకాణాలు వంటి వ్యాపారాలు ఎక్కువగా కమర్షియల్ సిలిండర్లపై ఆధారపడుతుంటాయి. ధరలు భారీగా పెరగడంతో వారి వ్యాపార ఖర్చులు కూడా పెరిగాయి. ఈ పరిస్థితిలో కొంతమంది వ్యాపారులు తమ వ్యాపారాన్ని కొనసాగించడం కష్టమై హోటళ్లను తాత్కాలికంగా మూసివేస్తున్నారు. మరికొందరు ధరలను పెంచడం ద్వారా నష్టాలను తగ్గించుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. అయితే దీనివల్ల వినియోగదారులపై భారం మరింత పెరుగుతోంది. సాధారణంగా ఒక ప్లేట్ భోజనం లేదా టీ ధర కూడా పెరగడం ప్రజల దైనందిన ఖర్చులను ప్రభావితం చేస్తోంది. చమురు ధరల పెరుగుదల ఒక దేశం లేదా ప్రాంతానికి మాత్రమే పరిమితం అయ్యే సమస్య కాదు. ఇది ప్రపంచవ్యాప్తంగా ప్రభావం చూపే ఆర్థిక సమస్య. అందువల్ల దీనికి పరిష్కారం కూడా అంతర్జాతీయ సహకారంతోనే సాధ్యమవుతుంది. ప్రత్యామ్నాయ ఇంధన వనరుల అభివృద్ధి, పునరుత్పాదక శక్తి వినియోగం, ఇంధన వినియోగంలో పొదుపు వంటి చర్యలు భవిష్యత్తులో కీలక పాత్ర పోషిస్తాయి. ప్రపంచ దేశాలు సౌరశక్తి, గాలిశక్తి, జలశక్తి వంటి పునరుత్పాదక ఇంధన వనరులపై ఎక్కువ దృష్టి పెట్టడం కూడా ఇదే కారణంతో. చమురు ఆధారిత ఆర్థిక వ్యవస్థ నుంచి బయటపడటం ద్వారా ఇలాంటి సంక్షోభాల ప్రభావాన్ని తగ్గించవచ్చని భావిస్తున్నారు. అయితే ఈ మార్పు ఒక్కరోజులో జరగదు. ఇంకా చాలా కాలం వరకు చమురు ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ప్రధాన ఇంధన వనరుగా కొనసాగుతుందనే అభిప్రాయం ఉంది.

చరిత్ర చెబుతున్న ఒక ముఖ్యమైన విషయం ఏమిటంటే యుద్ధాలు ఎప్పుడూ ఆర్థిక వ్యవస్థను కుదిపేస్తాయి. ముఖ్యంగా చమురు వంటి వ్యూహాత్మక వనరుల విషయంలో యుద్ధాల ప్రభావం మరింత తీవ్రంగా ఉంటుంది. 1973 చమురు సంక్షోభం దీనికి స్పష్టమైన ఉదాహరణ. ఆ సంఘటన ప్రపంచాన్ని ఇంధన రాజకీయాల గురించి కొత్తగా ఆలోచించేటట్లు చేసింది. ప్రస్తుతం కూడా పశ్చిమ ఆసియాలో ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రపంచం మళ్లీ అదే భయాలను ఎదుర్కొంటోంది. యుద్ధం మరింత విస్తరించినట్లయితే చమురు ధరలు భారీగా పెరిగే అవకాశం ఉంది. అది ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉంది. అందువల్ల శాంతి, దౌత్య చర్చలు, అంతర్జాతీయ సహకారం ద్వారా సమస్యలను పరిష్కరించడం మాత్రమే శాశ్వత మార్గం. యుద్ధం వల్ల కలిగే నష్టాలను చరిత్ర ఎన్నోసార్లు చూపించింది. ప్రపంచ దేశాలు గత అనుభవాలను గుర్తు చేసుకొని సమన్వయంతో ముందుకు సాగితేనే చమురు సంక్షోభాల నుంచి ప్రపంచం బయటపడగలదు.

## ఇరాన్‌తో యుద్ధం త్వరలో ముగుస్తుంది.. నేనెప్పుడు అనుకుంటే అప్పుడే ఆగిపోతుంది

- మొదటి పేజి తరువాయి

త్వరలో యుద్ధం ముగుస్తుందని వ్యాఖ్యానించారు. యాక్సియోస్‌తో ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ, నేను ఎప్పుడు యుద్ధం ముగియాలనుకుంటే అప్పుడే ముగుస్తుందని అన్నారు. తమ ఆపరేషన్‌లో ఇరాన్ లక్ష్యాలను అన్నింటిని ఛేదించామని అన్నారు. మరోవైపు, ఇజ్రాయెల్ రక్షణ మంత్రి ఇజ్రాయెల్ కాట్జ్ అంతకుముందు రోజు చేసిన వ్యాఖ్యలు విరుద్ధంగా ఉన్నాయి. అవసరమైనంత వరకు, తమ లక్ష్యాలను సాధించే వరకు యుద్ధం కొనసాగుతుందని కాట్జ్ తెలిపారు. ఈ ఆపరేషన్‌ను ఇంత సమయంలో ముగించాలనే కాలపరిమితి ఏదీలేదని తెలిపారు.

# దానం, కడియంలకు క్లీన్ చిట్ ఇవ్వడంపై కేటీఆర్ ఫైర్

ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై స్పీకర్ గడ్డం ప్రసాద్ ఇచ్చిన క్లీన్ చిట్ ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో కార్చిచ్చు రాజేసింది. దానం నాగేందర్, కడియం శ్రీహరిలపై దాఖలైన పిటిషన్లను స్పీకర్ కొట్టివేయడంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిని ప్రజాస్వామ్యంపై జరిగిన బహిరంగ దాడిగా కేటీఆర్ అభివర్ణించారు. కాంగ్రెస్ పార్టీ బీఫామ్ మీద ఎంపీగా పోటీ చేసిన వ్యక్తికే క్లీన్ చిట్ ఇవ్వడం అంటే ప్రజల తీర్పును అపహాస్యం చేయడమేనని ఆయన మండిపడ్డారు. అధికారంలో ఉన్నవారికి అనుకూలంగా రాజ్యాంగ వ్యవస్థలను

వాడుకుంటున్నారని, ప్రజాస్వామ్య విలువలు ఎక్కడ ఉన్నాయని ఆయన ప్రశ్నించారు. ఇది కేవలం ఒక తీర్పు కాదని, పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించే చర్య అని, ప్రజలు అన్నీ గమనిస్తున్నారని ఆయన హెచ్చరించారు.

# తెలంగాణ నూతన గవర్నర్‌గా శివ్ ప్రతాప్ శుక్లా ప్రమాణ స్వీకారం

- మొదటి పేజి తరువాయి

కొత్త గవర్నర్ ప్రసంగించనున్నారు. గతవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, హిమాచల్ ప్రదేశ్ గవర్నర్‌గా ఉన్న శుక్లాను తెలంగాణకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటివరకు తెలంగాణ గవర్నర్‌గా ఉన్న జిష్ణు దేవ్ వర్మను మహారాష్ట్రకు గవర్నర్‌గా నియమించారు. ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్‌కు చెందిన శివ్ ప్రతాప్ శుక్లా, విద్యార్థి దశ నుంచే ఏబీవీపీలో చురుకుగా పనిచేశారు. 1989లో తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచి, ఉత్తరప్రదేశ్ ప్రభుత్వంలో

పలు కీలక మంత్రిత్వ శాఖలు నిర్వహించారు. అనంతరం 2016లో రాజ్యసభకు ఎన్నికై, కేంద్రంలోని మోదీ ప్రభుత్వంలో ఆర్థిక శాఖ సహాయ మంత్రిగా కూడా సేవలు అందించారు. 2023 ఫిబ్రవరిలో హిమాచల్ ప్రదేశ్ గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టారు.

# మార్చి నుంచే రైతు భరోసా.. రైతుల ఖాతాల్లోకి మొత్తం రూ.9 వేల కోట్లు: మంత్రి వివేక్ వెంకటస్వామి

కోల్ బెల్ట్/కోటపల్లి: రైతు భరోసా నిధులు మార్చి నుంచే ఇవ్వనున్నట్లు కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి తెలిపారు. మొత్తం రైతుల ఖాతాల్లో రూ.9 వేల కోట్లు జమ చేస్తామని చెప్పారు. మంచిర్యాల జిల్లా చెన్నూరు వ్యవసాయ మార్కెట్ పాలకవర్గం ప్రమాణ స్వీకారానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. చైర్మన్ గా మహేశ్ ప్రసాద్ తివారీ, వైస్ చైర్మన్ పాపిరెడ్డి, మరికొందరు డైరెక్టర్లుగా ప్రమాణం చేశారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రెండు నెలల్లో మొత్తం రైతు భరోసా ఇవ్వనున్నట్లు వి వరించారు. మార్చి నెలలో రూ.4,500 కోట్లు, మిగితావి ఏప్రిల్ లో ఇస్తామన్నారు. ప్రజల ఆరోగ్యం కోసం సన్నబియ్యం పంపిణి చేస్తున్నా మని, సన్నవడ్లు పండించే 90 శాతం రైతులకు బోనస్ అందిస్తున్నట్లు తెలిపారు. రైతుల ప్రయో జనాల కోసం సర్కార్ కట్టుబడి పనిచేస్తుందన్నా రు. రైతుల సంక్షేమం కోసం నూతన కార్యవర్గం కృషిచేయాలన్నారు. ధాన్యం కొనుగోలుకు అవ సరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. డీసీఎంఎస్, ఐకేపీ సెంటర్ల నిర్వహణ సక్రమంగా జరిగేలా చూడాల్సిన బాధ్యత మార్కెట్ కమిటీదేనని చెప్పారు. కేంద్ర మాజీ మంత్రి కాకా వెంకట

స్వామి ప్రాణహిత-చేవేళ్ల ప్రాజెక్టు కోసం కృషి చేశారని, అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ప్రాజె క్టు కోసం రూ.11 వేల కోట్లను ఖర్చు చేసిందని చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రాణహిత - చేవేళ్ల ప్రాజెక్టుకు బదులు కాళేశ్వరం ప్రాజెక్టు తీసుకు వచ్చిందన్నారు. కమీషన్ల కోసమే కేసీఆర్ ప్రభుత్వం కట్టిన ప్రా జెక్టులో కాళేశ్వరం బ్యాక్వాటర్ వల్ల నియోజక వర్గ రైతుల పంటలు మునిగిపోయి నష్టపోయారన్నారు.

# వెలుగుమట్ల బాధితులకు ఇండ్ల పట్టాలు.. డిసెంబర్ 9న గృహప్రవేశం

- మొదటి పేజి తరువాయి

ఆయన.. పేద వర్గానికి ఇల్లు లేకుండా ఉండొద్దని క్యాబినేట్ నిర్ణయం తీసుకుందని అన్నారు. వెలుగుమట్లలో 412 మందిని అధికారికంగా గుర్తించామని తెలిపారు. ప్రతి పేద కుటుంబానికి ఆసరాగా నిలిచామన్నారు. బాధితులకు ఇంటి తో పాటుగా సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఎవరైనా డబ్బులు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వెలుగుమట్లలో ప్రభుత్వమే దగ్గర ఉండి భూమి పూజ చేయించి ఇండ్ల నిర్మాణం మొదలు పెడుతుందని తెలిపారు. పట్టాలు ఇచ్చి భూమి పూజా చేయాలని కలెక్టర్ ను ఆదేశించారు. డిసెంబర్ 9 న రాష్ట్ర ముఖ్యమంత్రిని ఖమ్మం ఆహ్వానించి గృహప్రవేశం చేయిస్తామని తెలిపారు. పేదల కోసం నిలబడి పని చేసే ప్రభుత్వాన్ని బద్నాం చేసే ప్రక్రియ ఖమ్మంలో కనిపిస్తుందన్నారు భట్టీ. ప్రతి పక్షానికి పేదలపై ప్రేమ లేదు.. పేదల నిస్సహాయతను అడ్డు పెట్టి రాజకీయం చేస్తున్నారని విమర్శించారు. వెలుగుమట్లలో సమాంతర రాజ్యం నడిచిందని.. అక్కడి ప్రజలను సంరక్షించే ప్రయత్నం చేస్తే అధికారుల పై దాడికి యత్నించారన్నారు. పేద వర్గాలు ఆత్మ గౌరవంగా బతికేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు భట్టీ. తప్పుడు రికార్డులు సృష్టించి కోర్టులను తప్పుదోవ పట్టించారని మండిపడ్డారు. అక్కడ చట్ట బద్దత చేయాలని నేటి ప్రభుత్వం నిర్ణయిస్తే.. ప్రభుత్వం పై బురద జల్లే ప్రయత్నాలు బీఆర్ఎస్ చేసిందని విమర్శించారు. పేద ప్రజల పక్షానా కాంగ్రెస్ ప్రభుత్వానికి కమిట్మెంట్ ఉందన్నారు. డబుల్ బెడ్ రూం లు ఇస్తామని గతంలో బీఆర్ఎస్ మోసం చేసిందని అన్నారు. బాధితులకు సొంతూర్లో ఉన్న వారికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేశామని తెలిపారు. పేదల నిస్సహాయతను అడ్డుపెట్టుకుని దోచుకున్న వారి పై కఠిన చర్యలు తీసుకుని డబ్బులు తిరిగి చెల్లిస్తామని చెప్పారు. మాఫియాలతో , బ్లాక్ మెయిలర్లతో భయపడాల్సిన అవసరం లేదన్నారు. వెలుగుమట్ల భూముల్లో విద్యా వ్యవస్థను ఏర్పాటు చేస్తామన్నారు డిప్యూటీ సీఎం. మిగతా 16 ఎకరాల్లో తెలంగాణ పబ్లిక్ స్కూల్ నిర్మిస్తామన్నారు. స్థలం మిగిలితే రెంటెడ్ బిల్డింగ్ లో ఉన్న వెల్ఫేర్ హస్టల్స్ నిర్మిస్తామని తెలిపారు. అదే విధంగా అక్కడ కమ్యునిటీ హాల్ నిర్మిస్తామన్నారు. ఇందిరమ్మ ఇండ్లు చూసి ఇతర రాష్ట్రాలు అసూయ పడేలా నిర్మిస్తామని హామీ ఇచ్చారు.

### గడిచిన నెలలో బాధితులు .. నేడు లబ్దిదారులు: పొంగులేటి

ఇండ్ల పట్టాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి.. గడిచిన నెలలో బాధితులు .. నేడు లబ్దిదారులుగా మారారని అన్నారు. నష్ట పోయిన ప్రతి వారిని ఈ ప్రభుత్వం ఆదుకుంటుందని తెలిపారు. ఇది పేద వర్గాల ఆశీస్సులతో ఏర్పడిన ప్రభుత్వం.. పేద వర్గాలకు అండగా ఉంటుందన్నారు. లబ్ధిదారులు జన్యున్ గా ఉంటే అందరికి ఇండ్లు ఇస్తామని హామీ ఇచ్చారు. 311 మందికి ఇండ్ల స్థలంతో పాటు ఇందిరమ్మ ఇండ్లు , 101 మందికి వారి సొంత స్థలం లో ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని చెప్పారు. వ్యక్తిగతంగా ఎంత దుమ్మెత్తి పోసినా మనసులో పెట్టుకోకుండా లబ్ది చేకూరిస్తామని చెప్పారు మంత్రి. దొరల పాలనలో పేదలకు అన్యాయం చేశారని విమర్శిస్తున్నారు. ప్రధాన ప్రతిపక్ష హోదాలో ఉన్న వారు మొసలి కన్నీరు కారుస్తున్నారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం లో వెలుగుమట్లలో ప్రజలు నరకాన్ని చూశారన్నారు. ఎన్నికలకు ముందు బీఆర్ఎస్ ప్రభుత్వం వెలుగుమట్ల కాలనీని కూల్చే ప్రయత్నం చేసింది.. పదేళ్లు రాజ్యంలో ఉన్న బీఆర్ఎస్ కు నాడు ఎందుకు బుద్ధి రాలేదు.? వెలుగుమట్లపై మాట్లాడేందుకు బీఆర్ఎస్ కు కనీస నైతిక హక్కు లేదని ధ్వజమెత్తారు.

### పేదలను నమ్మించి బోగస్ పట్టాలు:

పేదలను ముందు పెట్టి దళారులు దోపిడి చేశారన్నారు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు. 31.7 ఎకరాల భూమిలో బోగస్ హౌస్ సైట్ పట్టాలు ఇచ్చారని తెలిపారు. భూదాన్ ట్రస్ట్ సీసీఎల్ఎ కు బదాలయించినట్లు చెప్పారు. సీసీఎల్ఎ ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోమని చెప్పినట్లు గుర్తు చేశారు.

జిల్లా కలెక్టరేట్ కార్యాలయం పక్కన ఒక ప్రత్యేక ముఠా మేస్త్రుల రాజ్యం నడిచిందన్నారు. దగా కోరులను పట్టుకోవాలంటే అందరినీ బయటకు పంపాల్సి వచ్చిందని తెలిపారు. నిరుపేదలు మోస పోయిన చోటనే ఇండ్ల స్థలం ఇవ్వాలని నిర్ణయించామని తెలిపారు.

## కడియం, దానంలకు స్పీకర్ క్లీన్ చిట్

- మొదటి పేజి తరువాయి

ముగించి, తీర్పులను వెలువరించారు. దానం, కడియంలతో పాటు పార్టీ ఫిరాయింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న మొత్తం 10 మంది ఎమ్మెల్యేలకు స్పీకర్ క్లీన్ చిట్ ఇవ్వడం గమనార్హం. ఫిర్యాదుదారులు సమర్పించిన ఆధారాలు వారిని అనర్హులుగా ప్రకటించడానికి సరిపోవని స్పీకర్ తన తీర్పులో పేర్కొన్నారు. అయితే, స్పీకర్ నిర్ణయంపై ప్రతిపక్ష బీఆర్ఎస్ నేతలు ఎలా స్పందిస్తారనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

## వంట గ్యాస్, పెట్రోల్, డీజిల్ సంక్షోభం... కేంద్రం కీలక ప్రకటన

- మొదటి పేజి తరువాయి

కృత్రిమ కొరత సృష్టించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. దేశవ్యాప్తంగా ఇంధన సరఫరా సజావుగా సాగేలా చూడాలని సూచించింది. దేశీయ అవసరాలకు కావాల్సిన ముడి చమురులో 75 శాతానికి పైగా హోర్ముజ్ జలసంధికి సంబంధం లేని ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా దిగుమతి చేసుకుంటున్నట్లు తెలిపింది. బ్లాక్ మార్కెట్‌ను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర డీజీపీలు, చీఫ్ సెక్రటరీలను ఆదేశించింది. గ్లోబల్ షిప్పింగ్ మార్గాల్లో ఆటంకాలు ఉన్నప్పటికీ, భారత్‌కు ముడి చమురు దిగుమతులు నిరంతరాయంగా అందుతున్నాయని కేంద్ర పెట్రోలియం శాఖ జాయింట్ సెక్రటరీ సుజాత శర్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

భారత్‌కు చమురు తీసుకువచ్చే అదనపు కార్గో షిప్‌లు కూడా వస్తున్నాయని వెల్లడించారు. పశ్చిమాసియాలో యుద్ధం జరుగుతున్నప్పటికీ మన దేశంలో ఇంధన అవసరాలకు ఎలాంటి ఇబ్బంది లేదని, వినియోగదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు.

## లోక్‌సభ స్పీకర్‌కు ఊరట.. వీగిపోయిన అవిశ్వాస తీర్మానం

లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై ప్రతిపక్షాలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం వీగిపోయింది. సుమారు 13 గంటల పాటు జరిగిన సుదీర్ఘ చర్చ అనంతరం, తీవ్ర గందరగోళం మధ్య తాత్కాలిక స్పీకర్ జగదాంబికా పాల్ నిర్వహించిన మూజువాణి ఓటుతో ఈ తీర్మానాన్ని తిరస్కరించారు. అవిశ్వాసంపై హోంమంత్రి అమిత్ షా సమాధానం ఇస్తున్న సమయంలో ప్రతిపక్షాలు తీవ్ర నినాదాలతో సభను అడ్డుకోవడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. స్పీకర్ ఓం బిర్లా పక్షపాతంతో, ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ కాంగ్రెస్ ఎంపీ మహ్మద్ జావేద్ ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. దీనికి 118 మంది విపక్ష ఎంపీలు మద్దతు తెలిపారు. నిన్న చర్చను ప్రారంభించిన కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగోయ్, ఇది వ్యక్తిగతంగా బిర్లాను లక్ష్యం చేసుకోవడానికి కాదని, పార్లమెంట్ గౌరవాన్ని కాపాడటానికే అని పేర్కొన్నారు. దీనికి బదులిచ్చిన పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు, స్పీకర్ పనితీరును గట్టిగా సమర్థించారు. అయితే, చర్చకు సమాధానమిచ్చిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ప్రతిపక్షాల ఆరోపణలను తీవ్రంగా తిప్పికొట్టారు. స్పీకర్ స్థానం అత్యంత పవిత్రమైందని, ఆయన నిర్ణయాలను సుప్రీంకోర్టులో సైతం ప్రశ్నించలేమని స్పష్టం చేశారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో, నేటి కాంగ్రెస్ మిత్రపక్షాలైన సమాజ్‌వాదీ పార్టీ, కమ్యూనిస్టు పార్టీలే స్పీకర్లపై అవిశ్వాసం పెట్టాయని గుర్తుచేశారు. ఆ సమయంలో స్పీకర్లు చైర్‌లోనే కూర్చోగా, ఈసారి ఓం బిర్లా మాత్రం తీర్మానంపై నిర్ణయం వెలువడే వరకు చైర్‌లో కూర్చోకుండా కొత్త పార్లమెంటరీ సంప్రదాయానికి శ్రీకారం చుట్టారని ప్రశంసించారు. ఈ సందర్భంగా ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని అమిత్ షా లక్ష్యంగా చేసుకున్నారు. పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్నప్పుడు రాహుల్ తరచూ విదేశీ పర్యటనలకు వెళ్తారని, బడ్జెట్, మహిళా రిజర్వేషన్ బిల్లు వంటి కీలక చర్చల్లో పాల్గొనడానికి ఎందుకు ఇష్టపడరని ప్రశ్నించారు. "సమావేశాలు వచ్చినప్పుడల్లా ఆయన విదేశీ పర్యటనలు ప్లాన్ చేసుకుంటారు. మరి విదేశాల నుంచి ఇక్కడ మాట్లాడతారా?" అని ఆయన వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. మొత్తం మీద స్పీకర్‌ను ఇరుకున పెట్టాలనుకున్న ప్రతిపక్షాల వ్యూహం ఫలించలేదు. పైగా ప్రభుత్వ ఎదురుదాడితో ప్రతిపక్షాలే ఆత్మరక్షణలో పడినట్లు కనిపించింది. ఈ పరిణామం విపక్షాలకు రాజకీయంగా ఇబ్బందికరంగా మారింది.

## ఇరాన్, అమెరికా యుద్ధాన్ని కాంగ్రెస్ పార్టీ రాజకీయానికి ఉపయోగించుకుంటోంది

ఇరాన్, అమెరికా-ఇజ్రాయెల్ యుద్ధాన్ని కాంగ్రెస్ పార్టీ మన దేశంలో రాజకీయానికి ఉపయోగించుకుంటోందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆగ్రహం వ్యక్తం చేశారు. కేరళ పర్యటనలో ఉన్న ఆయన ఎర్నాకులంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ, పశ్చిమాసియా దేశాల్లోని ప్రవాస భారతీయుల పరిస్థితి మరింత దిగజారేలా రెచ్చగొట్టే, బాధ్యతారాహిత్య ప్రకటనలు చేస్తోందని కాంగ్రెస్‌పై విమర్శలు గుప్పించారు. గల్ఫ్‌లోని పరిస్థితుల కారణంగా మనం ఆందోళన చెందడం సహజమేనని, అక్కడ లక్షలాది మంది భారతీయులు పని చేస్తున్నారని గుర్తు చేశారు. కానీ ఇక్కడ అధికారంలో ఉన్నది బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే అని అందరూ గుర్తుంచుకోవాలని అన్నారు. మన పౌరులు విదేశాల్లో చిక్కుకున్నప్పుడల్లా వారి క్షేమం కోసం వనరులన్నీ ఉపయోగిస్తుంటామని అన్నారు. మన పౌరులను ఎప్పుడూ ఒంటరిగా వదిలేసేది లేదని స్పష్టం చేశారు.

ప్రస్తుతం పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో గల్ఫ్ దేశాల్లోని మన వారికి అవసరమైన సహాయం అందేలా ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామని వెల్లడించారు. అక్కడి మన దేశ రాయబార కార్యాలయాలు మన పౌరులకు 24 గంటలు అందుబాటులో ఉంటున్నాయని తెలిపారు. మన మిత్ర దేశాలు భారతీయులను జాగ్రత్తగా చూసుకుంటున్నట్లు తెలిపారు. ఇలాంటి సంక్షోభ సమయంలో కాంగ్రెస్ పార్టీ మాత్రం రాజకీయ లబ్ధి కోసం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ప్రజల్లో ఆందోళనలు రేకెత్తించేలా కాంగ్రెస్ పార్టీ మాట్లాడటం దురదృష్టకరమని అన్నారు. ఈ ప్రచారం కోసం వారు అవసరమైతే రీల్స్ కూడా చేస్తారేమోనని ఎద్దేవా చేశారు. ఆత్మనిర్భర్ భారత్‌ను నిర్మించేందుకు, మేకిన్ ఇండియాను బలోపేతం చేయడానికి పెట్రోలియం రంగాన్ని విస్తరించడం ఎంతో కీలకమని అన్నారు. ఈ యుద్ధం స్వావలంబన అవశ్యకతను మరోసారి నొక్కి చెప్పిందని అన్నారు.

# సంక్షోభం వేళ, గ్యాస్ బుకింగ్ పేరుతో సైబర్ మోసాల పట్ల జాగ్రత్తగా ఉండండి

- 'ఎక్స్' వేదికగా హెచ్చరించిన హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్
- గ్యాస్ కొరత ఉందన్న ఆందోళనను సైబర్ కేటుగాళ్లు అనుకూలంగా మార్చుకుంటున్నారన్న సజ్జనార్
- తక్షణమే సిలిండర్ డెలివరీ చేస్తామంటూ నకిలీ ప్రకటనలు వస్తున్నాయని హెచ్చరిక



హైదరాబాద్ పెన్ పవర్:గ్యాస్ బుకింగ్ పేరుతో మోసాలు చేసేవారి పట్ల జాగ్రత్తగా ఉండాలని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్ హెచ్చరించారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా ఈ కొత్త తరహా మోసాల పట్ల అప్రమత్తం చేశారు. వంట గ్యాస్ సిలిండర్ల కొరత ఉందన్న ఆందోళనను సైబర్ కేటుగాళ్లు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారని, గ్యాస్ బుకింగ్ కోసం

-5 లో

# పెన్ పవర్
## తెలంగాణ రౌండప్




ప్లకార్డులు పట్టుకుని వెన్నెలగడ్డలో కుటుంబాలతో నిరసన..

# వైన్ షాపుకి 'సై సై'..! ఆబ్జెక్షన్స్‌కి 'నై నై'..!

**ప్రజల క్షేమం కంటే..! ప్రభుత్వానికి ఆదాయమే ప్రధానమా..?..**

- బడులు--గుడుల నడుమ బార్‌కు లైసెన్స్ జారీపై స్థానికుల ఆగ్రహం దర్నా..!
- నిబంధనలు ఉల్లంఘించారంటూ ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు..
- షాపు నిర్వహించే అక్రమ షెడ్డుపై జీహెచ్‌ఎంసి కమిషనర్‌కు కంప్లైంట్..
- సుచిత్ర వెళ్ళేదారిలో ఇరుకైన రోడ్డుపై బార్‌తో ట్రాఫిక్ సమస్యలకు అవకాశం.!
- మరోవైపు బడులు, దేవాలయాలు, నివాసాలు..నిత్యం రద్దీగా ఉండే ప్రాంతం..
- ఆపై అనుమతుల్లేని అక్రమ షెడ్డులో నిబంధనలకు తిలోదకాలు..
- స్థానికుల అబ్జెక్షన్‌లను పట్టించుకో లేదని ఆరోపణలు..
- లైసెన్స్ రద్దు చేయాలని వెన్నెలగడ్డ ప్రజల డిమాండ్..

-4లో

అనుమతుల్లేని అక్రమ షెడ్డు ముందు మద్యం షాపు పెట్టొద్దని స్థానికుల దర్నా..



వెన్నెలగడ్డలో "మద్యం" సెగ పుట్టింది.. తెలంగాణ ప్రభుత్వం గతంలో కంటే..! ఈసారి మరిన్ని వైన్ షాపుల తోపాటు, "బార్ అండ్ రెస్టారెంట్"లను అదనంగా కేటాయించారు.. నిబంధనలు తుంగలో తొక్కి వైన్ షాపులకు లైసెన్స్‌లు జారీ చేస్తున్నట్టు స్థానికులు ఆరోపిస్తున్నారు..?స్థానికుల అబ్జెక్షన్‌ను పరిగణంలోకి తీసుకోకుండానే అనుమతులు మంజూరు చేయడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది...? "బార్ అండ్ రెస్టారెంట్" ఏర్పాటు చేయొద్దని స్థానికులు ఆందోళన చేసినా పట్టించుకునే అధికారులు లేరని, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యమే వహిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి.. స్థానికులు సంబంధిత అన్ని శాఖల అధికారులకు ఫిర్యాదు చేసినా అధికార యంత్రాంగానికి చలనం లేదని అసహనం వ్యక్తం చేస్తున్నారు..రోవైపు తెలంగాణ ప్రభుత్వం "ప్రజల సంక్షేమం కంటే- ఆదాయానికే ప్రథమ ప్రాధాన్యత ఇస్తుందని సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి..

మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, మార్చి 11:

## గల్ఫ్ దేశాల్లో ఉద్రిక్తతలు తెలంగాణ వాసుల పాలిట శాపంగా మారాయి

- యుద్ధ క్షేత్రంలో చిన్నపిల్లలు, సామాన్యులు ప్రాణాలు కోల్పోతున్నారని హరీశ్ ఆవేదన
- ఈ అశాంతి త్వరగా ముగిసిపోవాలని ఆకాంక్షించిన మాజీ మంత్రి
- యుద్ధం వల్ల నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయన్న హరీశ్

-5 లో



01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసీఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
'ఐదు రోజులకు'
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి'
93948 55244
షరతులు వర్తిస్తాయి

# తెలంగాణ మీడియా అక్రెడిటేషన్ కమిటీ..!

## సభ్యులుగా మారుతి సాగర్‌కు అవకాశం..!

- మీడియా అక్రెడిటేషన్ కమిటీ సభ్యుడిగా జై తెలంగాణ టీవీ సీఈఓ మారుతి సాగర్..!
- టీయూవీజే తరపున ప్రతిపాదన..సమాచార పౌర సంబంధాల శాఖ ఉత్తర్వులు జారీ..!
- జీవో 252తో తగ్గిన అక్రెడిటేషన్ కార్డుల సంఖ్య పెంపు కోసం పోరాటం..
- కేబుల్, డెస్క్ జర్నలిస్టులకు కూడా కార్డుల విస్తరణపై ప్రభుత్వంతో చర్చిస్తాం..
- జర్నలిస్టులకు న్యాయం జరగకపోతే టీయూవీజే ఆధ్వర్యంలో ఉద్యమ హెచ్చరిక.



హైదరాబాద్, పెన్ పవర్, మార్చి 11:
తెలంగాణ రాష్ట్ర మీడియా అక్రెడిటేషన్ కమిటీ సభ్యుడిగా తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయుడబ్ల్యుజే) తరపున జై తెలంగాణ టీవీ సీఈఓ ఆస్కాని మారుతి సాగర్‌ను నియమిస్తూ సమాచార, పౌర సంబంధాల శాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. జర్నలిస్ట్ సంఘాలు, ప్రెస్ క్లబ్ ప్రతినిధులను సభ్యులుగా తీసుకుంటూ ప్రభుత్వం తాజాగా కమిటీని పునర్వ్యవస్థీకరించింది.. ఈ సందర్భంగా మారుతి సాగర్ మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి జర్నలిస్ట్‌కు అక్రెడిటేషన్ కార్డు అందేలా కమిటీ సమావేశాల్లో అంశాన్ని బలంగా ప్రస్తావిస్తామని తెలిపారు. ముఖ్యంగా జీవో నెం. 252 ప్రకారం అక్రెడిటేషన్ కార్డుల సంఖ్య తగ్గిపోతున్న నేపథ్యంలో వాటిని పెంచే దిశగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ పెద్దలతో చర్చిస్తామని పేర్కొన్నారు.. అలాగే కేబుల్ జర్నలిస్టులకు రాష్ట్ర స్థాయిలో అక్రెడిటేషన్ కార్డులు జారీ చేసే అంశం, డెస్క్ జర్నలిస్టులకు ఎడిషన్‌ల వారీగా కార్డుల సంఖ్య పెంపు వంటి సమస్యలపై కూడా కమిటీ వేదికగా చర్చించి న్యాయం జరిగే వరకు తన వంతు కృషి చేస్తానని స్పష్టం చేశారు. ఈ సభ్యత్వానికి తన పేరును ప్రతిపాదించిన తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ రాష్ట్ర అధ్యక్షుడు అల్లం నారాయణకు మారుతి సాగర్ కృతజ్ఞతలు తెలిపారు. అక్రెడిటేషన్ కార్డుల పెంపు విషయంలో జర్నలిస్టులకు న్యాయం జరగకపోతే టీయూవీజే ఆధ్వర్యంలో ఉద్యమ కార్యాచరణ చేపడతామని హెచ్చరించారు.

# బీఆర్ఎస్‌లోనే ఉన్నాం కానీ నాయకత్వానికి దూరంగా ఉన్నాం

- స్పీకర్ క్లీన్‌చిట్ ఇచ్చిన అనంతరం మీడియాతో మాట్లాడిన కడియం శ్రీహరి
- బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వేసిన పిటిషన్ చట్టబద్ధం కాదన్న శ్రీహరి
- సభలో ఎప్పుడూ బీఆర్ఎస్ పార్టీకి వ్యతిరేకంగా వ్యవహరించలేదన్న శ్రీహరి



హైదరాబాద్ పెన్ పవర్:తాము బీఆర్ఎస్ పార్టీలోనే ఉన్నామని, కానీ ఆ పార్టీ నాయకత్వానికి దూరంగా ఉన్నామని స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. పార్టీ ఫిరాయింపులకు సంబంధించి స్పీకర్ తనకు క్లీన్ చిట్ ఇచ్చిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఈ తీర్పును స్వాగతిస్తున్నానని అన్నారు. తమకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వేసిన పిటిషన్ చట్టబద్ధం కాదని ఆయన పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీ తనకు ఇప్పటి వరకు ఎలాంటి నోటీసులు ఇవ్వలేదని వెల్లడించారు. అలాగే బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ ఎప్పుడూ ప్రజల ముందుకు

-5 లో

- పార్టీ ఫిరాయింపు వ్యవహారంలో దానంకు క్లీన్ చిట్
- తాను బీఆర్ఎస్ పార్టీకి వ్యతిరేకంగా ఎప్పుడూ పని చేయలేదన్న దానం
- పార్టీ విప్‌ను కూడా ఉల్లంఘించలేదని వ్యాఖ్య

-5 లో

# నేను అసలు కాంగ్రెస్ సభ్యత్వమే తీసుకోలేదు
## కేటీఆర్ వ్యాఖ్యలకు దానం కౌంటర్



హైదరాబాద్ పెన్ పవర్:ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై తెలంగాణ స్పీకర్ గడ్డం ప్రసాద్ ఇచ్చిన తీర్పు రాజకీయ దుమారం రేపుతున్న వేళ, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ తనపై వస్తున్న విమర్శలను తిప్పికొట్టారు. ముఖ్యంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై ఆయన తీవ్రస్థాయిలో మండిపడ్డారు. స్పీకర్ తనకు క్లీన్ చిట్ ఇవ్వడంపై స్పందిస్తూ, తాను ఎక్కడా నిబంధనలను ఉల్లంఘించలేదని స్పష్టం చేశారు."ముఖ్యమంత్రి పదవి పోయిందని కేసీఆర్ కంటే కేటీఆరే ఎక్కువగా ఇబ్బంది పడుతున్నారు. పదవి తమ ఆస్తి అని కొందరు భ్రమపడుతున్నారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి కావడాన్ని వారు జీర్ణించుకోలేకపోతున్నారు. ఎంత ప్రయత్నించినా సీఎంను డీమోరలైజ్ చేయడం వారి వల్ల కాదు" అని దానం ఎద్దేవా చేశారు. అసలు నిన్న జరిగిన బీఆర్ఎస్ ఎల్పీ సమావేశానికి తనను ఎందుకు పిలవలేదని ఆయన ప్రశ్నించారు.తాను కేవలం పార్లమెంట్ సభ్యుడిగా పోటీ చేశానని, ఎక్కడా అధికారికంగా కాంగ్రెస్ సభ్యత్వం




ప్లకార్డులు పట్టుకుని వెన్నెలగడ్డలో కుటుంబాలతో నిరసన..



అనుమతుల్లేని అక్రమ షెడ్డు ముందు మద్యం షాపు పెట్టొద్దని స్థానికుల దర్నా..

### స్థానిక ప్రజల ఆమోదం అవసరం లేదా..?

ఎన్ఓసి ఉన్నప్పటికీ..! ఒక ప్రాంతంలో మద్యం దుకాణం ఏర్పాటుపై స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేస్తే, ప్రజా ప్రయోజనాల దృష్ట్యా కలెక్టర్ లేదా ఎక్సైజ్ కమిషనర్ సంబంధిత లైసెన్స్‌ను నిలిపివేసే అధికారం కలిగి ఉంటారు.. "ఎన్‌వోసి" లేకుండా తప్పుడు నివేదికలతో లైసెన్స్ ఎలా ఇస్తారని..? వెన్నెలగడ్డ నివాసితులు ప్రశ్నిస్తున్నారు.. క్షేత్రస్థాయిలో ఉన్న వాస్తవాలను కప్పిపుచ్చి అధికారుల తప్పుడు నివేదికలు పంపిస్తే..! అది చట్టవిరుద్ధమని స్థానికులు వాదిస్తున్నారు. అందుకే, రెవెన్యూ, మున్సిపల్ అధికారులతో కలిపి సంయుక్త తనిఖీ నిర్వహించాలని, భవిష్యత్తులో అక్కడ తలెత్తే తీవ్రమైన ట్రాఫిక్ సమస్యను దృష్టిలో పెట్టుకొని చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.. అధికారులు స్పందించి, నివాసితుల ఫిర్యాదును పరిగణనలోకి తీసుకుని అధికారులు, లైసెన్స్ ప్రక్రియను నిలిపివేస్తారా..? లేక నిబంధనలను పక్కన పెట్టి, సిఫార్సులకు ప్రాధాన్యతిచ్చి ముందుకు సాగుతారా..? అనేది వేచి చూడాలి..

# వైన్ షాపుకి 'సై సై'..!

# ఆబ్జెక్షన్స్‌కి 'నై నై'..!


- బడులు--గుడుల నడుమ బార్‌కు లైసెన్స్ జారీపై స్థానికుల ఆగ్రహం దర్నా..!
- నిబంధనలు ఉల్లంఘించారంటూ ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు..
- షాపు నిర్వహించే అక్రమ షెడ్డుపై జీహెచ్ఎంసి కమిషనర్‌కు కంప్లైంట్..
- సుచిత్ర వెళ్ళేదారిలో ఇరుకైన రోడ్డుపై బార్‌తో ట్రాఫిక్ సమస్యలకు అవకాశం.!
- మరోవైపు బడులు, దేవాలయాలు, నివాసాలు..నిత్యం రద్దీగా ఉండే ప్రాంతం..
- ఆపై అనుమతుల్లేని అక్రమ షెడ్డులో నిబంధనలకు తిలోదకాలు..
- స్థానికుల అబ్జెక్షన్‌లను పట్టించుకో లేదని ఆరోపణలు..
- లైసెన్స్ రద్దు చేయాలని వెన్నెలగడ్డ ప్రజల డిమాండ్..

**వెన్నెలగడ్డలో "మద్యం" సెగ పుట్టింది.. తెలంగాణ ప్రభుత్వం గతంలో కంటే..! ఈసారి మరిన్ని వైన్ షాపుల తోపాటు, "బార్ అండ్ రెస్టారెంట్"లను అదనంగా కేటాయించారు.. నిబంధనలు తుంగలో తొక్కి వైన్ షాపులకు లైసెన్స్‌లు జారీ చేస్తున్నట్టు స్థానికులు ఆరోపిస్తున్నారు..?స్థానికుల అబ్జెక్షన్‌ను పరిగణంలోకి తీసుకోకుండానే అనుమతులు మంజూరు చేయడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది...? "బార్ అండ్ రెస్టారెంట్" ఏర్పాటు చేయొద్దని స్థానికులు ఆందోళన చేసినా పట్టించుకునే అధికారులు లేరని, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యమే వహిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి.. స్థానికులు సంబంధిత అన్ని శాఖల అధికారులకు ఫిర్యాదు చేసినా అధికార యంత్రాంగానికి చలనం లేదని అసహనం వ్యక్తం చేస్తున్నారు..రోవైపు తెలంగాణ ప్రభుత్వం "ప్రజల సంక్షేమం కంటే- ఆదాయానికే ప్రథమ ప్రాధాన్యత ఇస్తుందని సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి..**

**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, మార్చి 11:**

## ప్రజల క్షేమం కంటే..! ప్రభుత్వానికి ఆదాయమే ప్రధానమా..?..

సిఫార్సులు అమలు చేయడం..! పలుకుబడికి ప్రాధాన్యత ఇవ్వడం..! "నిబంధనలు తుంగలో తొక్కడం..! చట్టాలను కాల రాయడం..! కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో కొత్తేమి కాదు.. ఈ మొత్తం వ్యవహారంలో అధికార యంత్రాంగం కీలక పాత్రను పోషిస్తుండగా..! వెన్నంటి ప్రోత్సహించడంలో ప్రముఖ ప్రజాప్రతినిధి, అధికారపార్టీ (ఏదైనా) రాజకీయ నాయకులు అండగా ఉండనే ఉన్నారు.. ప్రజల శ్రేయస్సు కంటే.. ప్రభుత్వ ఆదాయానికి ప్రాముఖ్యత ఇస్తున్నారు.. తెలంగాణ రాష్ట్రాన్నే కాదు.. హైదరాబాద్ నగరంలోనూ గల్లీ గల్లీకో వైన్‌షాపు- అది కుదరక పోతే "బార్ అండ్ రెస్టారెంట్‌ల"కు విచ్చలవిడిగా ఇలా అనుమతులు మంజూరు చేస్తున్నారని పలువురి విమర్శలు.. మంగళవారం స్థానికులు నిర్వహించిన ఈ దర్నా వ్యవహారాన్ని బయటకు పొక్కకుండా కూడా కొన్ని దుష్టశక్తులు రంగంలోకి దిగి కొందరిని భయపెట్టో, ప్రలోభపెట్టో ఫిర్యాదులకు అడ్డు తగలడంలో "అధికార- విపక్ష" నేతలు ప్రయత్నించినట్లు సమాచారం..



**Letter to Municipal Commissioner**

To
The Municipal Commissioner,

GHMC, Hyderabad
Telangana

**Subject:** Objection to Proposed Wine Shop/Permit Establishment Near Educational Institutions and Temple at Vennelagadda – Request for Immediate Intervention

**Respected Sir,**

We, the residents of Vennelagadda under Quthbullapur Constituency, write to bring to your kind notice a matter of grave concern regarding the proposed establishment of a new wine shop/permit in our residential area, which is in gross violation of prescribed distance norms and poses serious threats to public safety and social harmony.

**Details of Violation**

The proposed location for this wine shop/permit is in direct violation of the Telangana Excise Act and Rules. The establishment is proposed at a location where:

- A private school is located at **less than 100 meters** from the proposed site
- A temple is situated at **less than 100 meters** from the proposed location
- A government school is at approximately **150 meters** from the site
- The location is on a **narrow road** that cannot support increased traffic and congestion

All these institutions fall well within the prohibited distance as mandated under Excise regulations for the licensing of wine shops/permits near educational and religious institutions.


**Community Concerns**

The residents of Vennelagadda are deeply concerned and opposed to this proposal for the following reasons:

- **Safety of Children:** The proximity to schools endangers the safety and security of hundreds of school-going children who pass through this route daily
- **Religious Sentiments:** The temple serves as a place of worship for the community, and a liquor outlet nearby would hurt religious sentiments and disturb the devotional atmosphere

Office of the Deputy Commissioner INWARD No. Date Circle CMC

మున్సిపల్ కమిషనర్‌కి స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు కాపి..



**Letter to Superintendent of Excise**

To
The Superintendent of Excise, Quthbullapur Circle
Telangana

**Subject:** Objection to Proposed Wine Shop/Permit Establishment Near Educational Institutions and Temple at Vennelagadda – Request for Immediate Intervention

**Respected Sir,**

We, the residents of Vennelagadda under Quthbullapur Constituency, write to bring to your kind notice a matter of grave concern regarding the proposed establishment of a new wine shop/permit in our residential area, which is in gross violation of prescribed distance norms and poses serious threats to public safety and social harmony.

**Details of Violation**

The proposed location for this wine shop/permit is in direct violation of the Telangana Excise Act and Rules. The establishment is proposed at a location where:

- A private school is located at **less than 100 meters** from the proposed site
- A temple is situated at **less than 100 meters** from the proposed location
- A government school is at approximately **150 meters** from the site
- The location is on a **narrow road** that cannot support increased traffic and congestion

All these institutions fall well within the prohibited distance as mandated under Excise regulations for the licensing of wine shops/permits near educational and religious institutions.

**Community Concerns**

The residents of Vennelagadda are deeply concerned and opposed to this proposal for the following reasons:

- **Safety of Children:** The proximity to schools endangers the safety and security of hundreds of school-going children who pass through this route daily
- **Religious Sentiments:** The temple serves as a place of worship for the community, and a liquor outlet nearby would hurt religious sentiments and disturb the devotional atmosphere
- **Traffic and Congestion:** The narrow road infrastructure cannot accommodate the additional vehicular traffic that a wine shop/permit would generate, creating severe safety hazards

Office of the District Prohibition & Excise Office Medchal-Malkajgiri District 09 MAR 2026

ఎక్సైజ్ సూపరింటెండెంట్ కుత్బుల్లాపూర్‌కి కంప్లైంట్..

## అక్రమ షెడ్డు..! ఇరుకైన రోడ్లు..! నిత్యం రద్దీ ప్రాంతం..!

విద్యార్థులు చదువుకునే బడులు.. భక్తులు కొలిచే గుడులకు అత్యంత సమీపంలోని మద్యం షాపులకు అనుమతులు ఎలా సాధ్యం..? వీటన్నింటికి తోడు, విలాసవంతమైన కుటుంబాలు నివసించే హైక్లాస్ ఏరియాగా సుచిత్ర వెళ్ళేదారి గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు.. నివాస ప్రాంతాల్లో నిబంధనలు తుంగలో తొక్కి వైన్ షాపులు ఏర్పాటు చేస్తున్న తీరుపై వెన్నెలగడ్డ ప్రజలు ఇప్పుడు సమరశంఖం పూరించారు..! అధికారుల కళ్లు గప్పి ఎన్ఓసి ఇచ్చారా..? లేక ప్రజల ఆవేదనను బేఖాతరు చేస్తున్నారా..? స్థానికుల ఆందోళనతో మద్యం బార్ అండ్ రెస్టారెంట్ ఏర్పాటుపై తలెత్తుతున్న విమర్శలు..

## ఎక్సైజ్ పరిశీలించిందా..? సిఫార్సులకే ప్రాధాన్యత ఇచ్చిందా..?

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం లోని వెన్నెలగడ్డ ప్రాంతం ఇప్పుడు ఒక పాలనా పరమైన వివాదానికి కేంద్రబిందువుగా మారింది.. నివాస ప్రాంతాల మధ్య, పాఠశాలలు, దేవాలయాలకు అతి సమీపంలో ఈ మద్యం దుకాణాన్ని ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనపై స్థానిక ప్రజలు భగ్గుమంటున్నారు. ఎక్సైజ్ అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన చేయకుండానే, నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు ఇస్తున్నారా..? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.. ఇప్పటికే తాటిచెట్లు లేకుండానే కల్లు సరఫరా అంటూ ప్రజలను మభ్యపెడుతున్న ఎక్సైజ్ అధికారులు.. ఇలాంటి తప్పుడు మద్యం విక్రయాల కేంద్రాలను ప్రోత్సహించడం పెద్దపనేమి కాదు.. అధికశాతం మద్యం విక్రయాలకు ఉన్నతాధికారుల ఆదేశాలతోనే "బెల్టుషాపులు" (అనధికారిక వైన్స్) నిర్వహిస్తున్న సంగతి కూడా అందరికి తెలిసిందే..

**నిబంధనలు చెప్పేదేంటి..? అధికారులు చేస్తుందేంటి..?**

సాధారణంగా ఒక మద్యం దుకాణానికి లైసెన్స్ ఇచ్చే ముందు ఎక్సైజ్ శాఖ కఠినమైన నిబంధనలను అనుసరించాలి. ఎన్‌వోసి (నో అబ్జెక్షన్ సర్టిఫికేట్) ఇచ్చే ప్రక్రియలో తెలంగాణ ఎక్సైజ్ చట్టం ప్రకారం, విద్యాసంస్థలు, ప్రార్థనా మందిరాలు ఆసుపత్రుల నుండి మద్యం దుకాణం కనీసం నిర్ణీత దూరంలో (సాధారణంగా 100 మీటర్లు లేదా అంతకంటే ఎక్కువ, మున్సిపల్ పరిమితులను బట్టి) ఉండాలి. ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ స్వయంగా స్థలాన్ని సందర్శించి, కొలతలు తీయాలి. పాఠశాల లేదా గుడి వాకిలి నుండి వైన్ షాప్ వాకిలి వరకు ఉన్న దూరాన్ని శాస్త్రీయంగా లెక్కించాలి. సదరు ప్రాంతంలో షాపు ఏర్పాటు వల్ల శాంతి భద్రతలకు విఘాతం కలుగుతుందా లేదా ట్రాఫిక్ సమస్యలు వస్తాయా అనే అంశంపై స్థానిక పోలీస్ (ఎస్‌హెచ్ఓ), మున్సిపల్ అధికారుల అభిప్రాయం తీసుకోవాలి..

సుచిత్ర రోడ్డులో బార్ అండ్ రెస్టారెంట్ వద్దని స్థానికుల ధర్నా..







దాదాపు 350 గజాల్లో నిర్మించే అక్రమ షెడ్డు ప్రాంతం.. గూగుల్ ఫోటో..

## స్థానికుల ఆందోళన.. అధికారులకు ఫిర్యాదు..

నిబంధనల ఉల్లంఘనపై స్థానికులు వెన్నెలగడ్డ నివాసితులు ఎక్సైజ్ సూపరింటెండెంట్‌తో పాటుగా వివిధ శాఖల అధికారులకు ఫిర్యాదు చేశారు. ప్రతిపాదిత మద్యం దుకాణం అనేక చట్టపరమైన నిబంధనలను అతిక్రమిస్తోందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఒక ప్రైవేట్ పాఠశాల ఈ స్థలానికి 100 మీటర్ల లోపే ఉందని. అదేవిధంగా 150 మీటర్ల దూరంలో ఒక ప్రభుత్వ పాఠశాల, 100 మీటర్ల లోపు ఒక దేవాలయం ఉండటంతో, భక్తుల మనోభావాలు దెబ్బతింటాయని అక్కడివారు ఆందోళన చెందుతున్నారు.. నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో, అత్యంత ఇరుకైన రోడ్డు పక్కన ఈ మద్యం దుకాణం ఎన్నో ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉంది.. వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుందని ఈ అంశాలను పరిగణలోకి తీసుకొని "బార్ అండ్ రెస్టారెంట్‌కు ఇచ్చిన లైసెన్సు ఎన్వోసీని రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నారు..

# పొంగులేటిని వెంటాడుతున్న గులాబీ దళం

**ఖమ్మం, మార్చి 11, పెన్ పవర్:**
తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ని గులాబీ పార్టీ నేతలు వెంబడిస్తున్నారు. వదల బొమ్మాలి అన్నట్టుగా ఆయన గురించి రకరకాల ఆరోపణలు చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తొలి రోజుల్లోనే శ్రీనివాసరెడ్డి కుమార్ రెడ్డి మీద ఆరోపణలు వచ్చాయి. ఆయన సింగపూర్ నుంచి నిషేధిత వస్తువులను దిగుమతి చేసుకున్నారని విమర్శలు వినిపించాయి. ఈ సంఘటన తర్వాత పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మీద గులాబీ పార్టీ తీవ్రంగా దృష్టి సారించింది. అప్పట్లో ఆయన కంపెనీల మీద ఐటి అధికారులు దాడులు చేసిన నేపథ్యంలో.. ఈ వ్యవహారాన్ని గులాబీ పార్టీ తీవ్రంగా ప్రచారం చేసింది. పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో ముసలం తెస్తున్నారని ఆరోపణలు చేసింది. సరిగ్గా దీపావళికి ముందు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గులాబీ పార్టీ నేతలను ఉద్దేశించి కీలక వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ రాష్ట్రంలో గులాబీ పార్టీ నేతల అక్రమాలకు సంబంధించి ఆటం బాంబులు పేలబోతున్నాయని హెచ్చరించారు. అయితే పొంగులేటి చేసిన వ్యాఖ్యలు తగ్గట్టుగా సంచలన వ్యవహారాలు ఏవీ వెలుగులోకి రాలేదు. ఇక ఇప్పుడు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కుటుంబ సభ్యులు నిర్వహిస్తున్న రాఘవ కన్స్ట్రక్షన్ కంపెనీకి సంబంధించి ఒక కీలక విషయాన్ని గులాబీ నేతలు బయటికి తీసుకొచ్చారు. రాజేంద్రనగర్ ప్రాంతంలో రాఘవ కన్స్ట్రక్షన్ కంపెనీ అక్రమంగా కంకర క్రషింగ్ చేపడుతోందని ఆరోపించారు. గులాబీ నేతలు దాసోజు శ్రవణ్, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, క్రిశాంక్ రాఘవ కన్స్ట్రక్షన్ కంపెనీ నిర్వహిస్తున్న క్రషర్ వద్దకు వెళ్లారు. కొండలను మొత్తం పొంగులేటి కంపెనీ పిండి చేస్తోందని మండిపడ్డారు. గులాబీ నేతల ఆరోపణల నేపథ్యంలో పొంగులేటి కుటుంబ సభ్యులు నిర్వహిస్తున్న రాఘవ కంపెనీ వివరణ ఇచ్చింది. తాము నిబంధనలకు వ్యతిరేకంగా ఏ పనీ చేయడం లేదని పేర్కొంది. అన్ని అనుమతులు తీసుకున్న తర్వాతే క్రషర్ నిర్వహిస్తున్నామని పేర్కొంది. గులాబీ నేతలు అడ్డగోలుగా విమర్శలు చేస్తున్నారని.. ఆ విమర్శలు మొత్తం సత్య దూరమని స్పష్టం చేసింది. అడ్డగోలుగా ఆరోపణలు చేస్తే లీగల్ నోటీసులు జారీ చేస్తామని పేర్కొంది.

02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## బీఆర్ఎస్‌లోనే ఉన్నాం కానీ నాయకత్వానికి దూరంగా ఉన్నాం

-3 పేజి తరువాయి
వచ్చి పార్టీ ఫిరాయింపుల గురించి మాట్లాడలేదని తెలిపారు. శాసన సభలో మేం ఎప్పుడూ బీఆర్ఎస్ పార్టీకి వ్యతిరేకంగా వ్యవహరించలేదని అన్నారు. బీఆర్ఎస్ పార్టీలోనే ఉన్నప్పటికీ, నాయకత్వానికి మాత్రమే దూరంగా ఉన్నట్లు తెలిపారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఇతర పార్టీల ఎమ్మెల్యేలను తీసుకున్నారని గుర్తు చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కంటే ఎక్కువగా కేసీఆర్ పార్టీ ఫిరాయింపులకు పాల్పడ్డారని ఆరోపించారు. ఫిరాయింపుల విషయంలో గతంలో తప్పు చేశానని కేసీఆర్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. గతంలో పార్టీ ఫిరాయింపులకు పాల్పడటంతో పాటు కొందరిని మంత్రులుగా కూడా చేశారని తెలిపారు. తాము పార్టీని ఫిరాయించింది నిజమే అయితే బీఆర్ఎస్ పార్టీ తమకు నోటీసులు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. పార్టీ పరంగా కూడా తమపై ఎందుకు పిటిషన్ వేయలేదని ప్రశ్నించారు. మా వేతనం నుంచి ప్రతి నెల రూ.5 వేలు బీఆర్ఎస్ పార్టీ కార్యాలయానికి జమ అవుతున్నాయని వెల్లడించారు.

## నేను అసలు కాంగ్రెస్ సభ్యత్వమే తీసుకోలేదు

-3 పేజి తరువాయి
తీసుకోలేదని దానం వెల్లడించారు. శాసనసభలో పార్టీ విప్‌ను ఎప్పుడూ ఉల్లంఘించలేదని, పార్టీకి వ్యతిరేకంగా పనిచేయలేదని గుర్తు చేశారు. ఒకవేళ స్పీకర్ తీర్పు తనకు వ్యతిరేకంగా వచ్చినా, యుద్ధ రంగం నుండి వచ్చిన వాడిలా ఉప ఎన్నికల్లో గెలిచి చూపేవాడినని ధీమా వ్యక్తం చేశారు. తాను సికింద్రాబాద్ ఎంపీగా ఓడిపోవడానికి బీఆర్ఎస్, బీజేపీల అపవిత్ర కలయికే కారణమని ఆయన ఆరోపించారు. ఒకవేళ తాను ఎంపీగా గెలిచి ఉంటే ఈ వివాదమే ఉండేది కాదన్నారు. ఖైరతాబాద్ ప్రజల సైనికుడిగా పనిచేస్తానని, రాబోయే గ్రేటర్ ఎన్నికల్లో ముఖ్యమంత్రి రేవంత్ ఆశించినట్టే ఫలితాలు ఉంటాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కేవలం వ్యక్తిగత స్వార్థం కోసమే ప్రతిపక్షాలు సీఎంపై బురద చల్లుతున్నాయని మండిపడ్డారు.

## సంక్షోభం వేళ, గ్యాస్ బుకింగ్ పేరుతో సైబర్ మోసాల పట్ల జాగ్రత్తగా ఉండండి

-3 పేజి తరువాయి
ఆన్‌లైన్‌లో వెతికే అమాయకులే లక్ష్యంగా కొత్త తరహా మోసాలకు తెరతీశారని తెలిపారు. తక్షణమే సిలిండర్ డెలివరీ చేస్తామంటూ, అదనపు సిలిండర్లు ఇస్తామంటూ సామాజిక మాధ్యమాల్లో నకిలీ ప్రకటనలు ఇస్తూ బురిడీ కొట్టిస్తున్నారని, వాట్సాప్, ఎస్సెమ్మెస్‌ల ద్వారా ఫేక్ వెబ్‌సైట్ లింకులను పంపిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని పేర్కొన్నారు. ముఖ్యంగా, ఆన్‌లైన్‌లో ముందుగా డబ్బులు చెల్లిస్తే గ్యారెంటీగా, అత్యవసరంగా గ్యాస్ సరఫరా చేస్తామని నమ్మబలికే సందేశాలు వస్తే అవి కచ్చితంగా సైబర్ మోసాలేనని గ్రహించాలని ప్రజలకు సూచించారు. ఇలాంటి అనుమానాస్పద లింకులను ఎట్టి పరిస్థితుల్లోనూ క్లిక్ చేయకూడదని సూచించారు. సిలిండర్ బుకింగ్ లేదా ఆన్‌లైన్ చెల్లింపుల కోసం గ్యాస్ కంపెనీల అధికారిక వెబ్‌సైట్లను లేదా అధీకృత గ్యాస్ ఏజెన్సీలను మాత్రమే ఆశ్రయించాలని అన్నారు. ఆకర్షణీయమైన ఆఫర్లు చూసి గుర్తుతెలియని వ్యక్తులకు మీ బ్యాంక్ ఖాతా వివరాలు, ఓటీపీ, యూపీఐ పిన్ వంటివి ఎట్టి పరిస్థితుల్లోనూ పంచుకోకూడదని సూచించారు. నకిలీ వెబ్‌సైట్లలో వివరాలు నమోదు చేయడం ద్వారా మీ వ్యక్తిగత, ఆర్థిక సమాచారం సైబర్ నేరగాళ్ల చేతికి చిక్కి బ్యాంక్ ఖాతాలు ఖాళీ అయ్యే ప్రమాదం ఉందని సజ్జనార్ పేర్కొన్నారు. ఒకవేళ ఎవరైనా ఇలాంటి సైబర్ మోసాలకు గురైతే ఏమాత్రం ఆలస్యం చేయకుండా తక్షణమే జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నెంబర్ 1930 కి కాల్ చేయాలని లేదా హ్ట్ట్ప్స్://ఎవ్వ్వ్.cybercrime.gov.in వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు.

## గల్ఫ్ దేశాల్లో ఉద్రిక్తతలు తెలంగాణ వాసుల పాలిట శాపంగా మారాయి: హరీశ్ రావు

**హైదరాబాద్ పెన్ పవర్:** గల్ఫ్ దేశాల్లో కొనసాగుతున్న ఉద్రిక్తతలు ప్రపంచ శాంతికి ముప్పుగా మారడమే కాకుండా, అక్కడున్న భారతీయులు, తెలంగాణ వాసుల పాలిట శాపంగా మారాయని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. సంగారెడ్డిలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, యుద్ధ క్షేత్రంలో నిరపరాధులైన చిన్నపిల్లలు, సామాన్య ప్రజలు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని అన్నారు. ఈ అశాంతి త్వరగా ముగిసి అంతటా శాంతి వెల్లివిరియాలని ఆయన ఆకాంక్షించారు. ముఖ్యంగా గల్ఫ్ దేశాల్లో జీవనోపాధి పొందుతున్న భారతీయులు, అందునా తెలంగాణ వాసులు ప్రస్తుత పరిస్థితుల్లో అనేక ఇబ్బందులు పడుతున్నారని హరీశ్ రావు గుర్తుచేశారు. యుద్ధం వల్ల నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయని, దీనివల్ల పేద, మధ్యతరగతి ప్రజల పరిస్థితి దయనీయంగా మారుతోందని పేర్కొన్నారు. కేవలం అంతర్జాతీయ పరిస్థితులే కాకుండా, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై కూడా ఆయన ఈ సందర్భంగా విమర్శలు గుప్పించారు. ముస్లిం సమాజానికి కాంగ్రెస్ ఇచ్చిన హామీలు కేవలం కాగితాలకే పరిమితమయ్యాయని హరీశ్‌రావు మండిపడ్డారు. ఇమామ్‌లు, మౌజన్‌లకు అందాల్సిన నెలసరి భత్యాలను ప్రభుత్వం చెల్లించకుండా ఎగ్గొడుతోందని ఆరోపించారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ముస్లిం పేదలకు రూ. 5 వేల ఆర్థిక సాయం అందించగా, కాంగ్రెస్ దానిని రూ. 10 వేలకు పెంచుతామని చెప్పి ఇప్పుడు మొహం చాటేసిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ సహా పలువురు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# 400 కోట్లతో 'గాంధీ సరోవర్' ప్రాజెక్టు

**హైదరాబాద్, మార్చి 11, పెన్ పవర్:**
మూసీ నది పునరుజ్జీవనంలో భాగంగా తెలంగాణ ప్రభుత్వం బాపూఘాట్ వద్ద రూ. 400 కోట్లతో 'గాంధీ సరోవర్' ప్రాజెక్టును చేపట్టిన సంగతి తెలిసిందే. తాజాగా ఈ ప్రాజెక్టు సంబంధించిన డీపీఆర్ రెడీ అయింది. 150 మీటర్ల ఎత్తులో గాంధీ విగ్రహం, మ్యూజియం, 'లండన్ ఐ' తరహాలో చరఖా రంగుల రాట్నం ఈ ప్రాజెక్టు ప్రధాన ఆకర్షణలు. మూసీ నదిపై 15 వంతెనలు, సైక్లింగ్ ట్రాక్‌లు, బోటింగ్, పర్యాటక హంగులను ఏర్పాటు చేస్తూ డీపీఆర్ సిద్ధం చేశారు. హైదరాబాద్ నగర నడిబొడ్డున ప్రవహించే మూసీ నదిని అందంగా తీర్చిదిద్దే దిశగా తెలంగాణ ప్రభుత్వం అడుగులు వేస్తోంది. మురుగు, వ్యర్థాలతో ప్రవహిస్తున్న మూసీ నదిని ప్రపంచ స్థాయి పర్యాటక, ఆర్థిక కేంద్రంగా మార్చటమే లక్షంగా సర్కార్ మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టును చేపట్టింది. ఈ చర్యలో భాగంగా.. బాపూఘాట్ వద్ద గాంధీ సరోవర్ ప్రాజెక్ట్‌ను సైతం చేపడుతోంది. ఈ మేరకు తాజాగా మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ డీపీఆర్‌ను సిద్ధం చేసింది. బాపూఘాట్ వద్ద 150 మీటర్ల ఎత్తులో గాంధీ విగ్రహం నిర్మాణం కానుంది. మూసీ నదికి రెండు వైపులా విశాలమైన రోడ్లు, నది పొడవునా ఆకట్టుకునే పార్కులు ఏర్పాటు కానున్నాయి. బాపూఘాట్ వద్ద ప్రభుత్వానికి 60 ఎకరాల భూమి భూమి ఉంది. ఇందులో 34 ఎకరాల విస్తీర్ణంలో రూ.400 కోట్లతో గాంధీ సరోవర్ ప్రాజెక్టు రాబోతుంది. 100 మీటర్ల ఎత్తు వరకు పలు అంతస్తుల్లో టవర్ కట్టి అందులో సమావేశ గదులు, మ్యూజియం, గాంధీ చరిత్రపై ప్రదర్శనశాల, కార్యాలయాలు ఏర్పాటు చేస్తారు. ఈ టవర్‌పై 35-50 మీటర్ల ఎత్తున గాంధీ విగ్రహం కొలువుదీరనుంది. గాంధీ విగ్రహం వెనుక లండన్ థేమ్స్ నది ఒడ్డున కనిపించే 'లండన్ ఐ'ను పోలిన రంగుల రాట్నం ఏర్పాటు చేయనున్నారు. గాంధీ స్మృతుల్లో ఒకటైన చరఖాను



తలపించేలా ఈ నిర్మాణం కనిపించనుంది. పక్కనున్న 98 ఎకరాల డిఫెన్స్ భూములను సేకరించే ప్రక్రియ ప్రస్తుతం పురోగతిలో ఉందని అధికారులు చెబుతున్నారు. మూసీలో నిత్యం మంచినీటిని ప్రవహింపజేయడంతోపాటుగా నదికి రెండు వైపులా ఉన్న పరీవాహక ప్రాంతాన్ని అద్భుతంగా తీర్చిదిద్దాలని సర్కార్ లక్ష్యంగా పెట్టుకుంది. హిమాయత్‌సాగర్, ఉస్మాన్ సాగర్ జంట జలాశయాల నుంచి గాంధీ సరోవర్ వరకు మొత్తంగా 15 వంతెనలు నిర్మిస్తారు. ఒకవైపు 100 అడుగుల రోడ్డు, మరోవైపు 80 అడుగుల రోడ్డు నిర్మించనున్నారు. దాంతో పాటుగా కాలిబాట, సైక్లింగ్ ట్రాక్, ఇతర సౌకర్యాలు కూడా కల్పిస్తారు. నదిలో పూడికను తొలగించి, అంచులను సరిచేసి కొన్ని ప్రాంతాల్లో పార్కులను అభివృద్ధి చేస్తారు. పిల్లల పార్కులు, హోటళ్లు, వేడుకలు నిర్వహించుకునేలా యాంఫీ థియేటర్లు ప్రాజెక్టులో భాగం కానున్నాయి. మూడు, నాలుగు చోట్ల చిన్నపాటి ఆనకట్టలనూ కూడా నిర్మిస్తారు. గాంధీ సరోవర్‌లో బోటింగ్ సదుపాయం కూడా ఉండనుంది.

# నైట్ ఇంజనీరింగ్ కాలేజీలకు అనుమతి

**హైదరాబాద్, మార్చి 11,పెన్ పవర్:**
తెలంగాణలో సాయంత్రం పూట బీటెక్ చదువులకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఈ నేపథ్యంలోనే రాష్ట్రంలో ఉన్న 12 ఇంజినీరింగ్ కాలేజీల్లో పలు రకాల బీటెక్ కోర్సులను సాయంత్రం పూట చెప్పనున్నారు. గతకొంతకాలంగా ఈ సాయంత్రం బీటెక్ కోర్సులకు సంబంధించిన ఫైల్ పెండింగ్‌లో ఉండగా.. తాజాగా తుది ఆమోదం లభించింది. ఈ విద్యా సంవత్సరం నుంచే అడ్మిషన్లు ఇచ్చేందుకు అనుమతినిచ్చింది. తెలంగాణ రాష్ట్రప్రభుత్వం కీలక నిర్ణయానికి ఆమోద ముద్ర వేసింది. రాష్ట్రంలో విద్యపై ప్రత్యేక దృష్టి పెట్టిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. విద్యా శాఖను తన వద్దే ఉంచుకున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే విద్యా శాఖకు సంబంధించికీలక నిర్ణయాలు తీసుకుంటున్నారు. తెలంగాణలో 12 ప్రైవేట్ ఇంజినీరింగ్ కాలేజీల్లో సాయంత్రం బీటెక్ కోర్సులను అందించే నిర్ణయానికి రేవంత్ రెడ్డి సర్కార్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. గత కొన్ని నెలలుగా ఈ సాయంత్రంఇంజినీరింగ్ కోర్సుల ఫైల్ ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉండగా.. తాజాగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆమోద ముద్ర వేశారు. ఈ నేపథ్యంలోనే తెలంగాణ విద్యా శాఖ జీఓ నంబర్ 30ని జారీ చేస్తూ ఉత్తర్వులువెలువరించింది. ఇక రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 12 కాలేజీల్లో ఈ ఈవెనింగ్ బీటెక్ కోర్సులు అందుబాటులోకి రానున్నాయి. ఒక్కో కాలేజీకి 1 నుంచి 5 కోర్సులు చెప్పేందుకు అనుమతులు మంజూరు చేశారు. ఇక ఒక్కోకోర్సులో తక్కువలో తక్కువగా 15 సీట్లు.. ఇక అత్యధికంగా 60 సీట్లకు అవకాశం కల్పించారు. ప్రస్తుత 2026-27 విద్యా సంవత్సరం నుంచే ఈ కాలేజీల్లో ప్రవేశాలు జరుపుకోవచ్చని ప్రభుత్వం స్పష్టం చేసింది. జాయింట్ ఎంట్రన్స్ టెస్ట్ పరీక్ష నిర్వహించి సీట్లను భర్తీ చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. పాలిటెక్నిక్ కోర్సులు పూర్తి చేసి.. కనీసం ఏడాది పాటు ఉద్యోగం చేసిన అనుభవం ఉన్నవారు ఈ బీటెక్‌కోర్సులో చేరొచ్చని అధికారులు వెల్లడించారు. ఒకవేళ ఇప్పటికే బీటెక్ కోర్సు పూర్తి చేసిన వారు ఎంటెక్ కోర్సుల్లో అడ్మిషన్లు పొందొచ్చు. ఇలా చేరిన వారికి సాయంత్రం వేళ తరగతులను నిర్వహించనున్నారు. ఈసాయంత్రం కోర్సులకు కూడా రెగ్యులర్ కోర్సులకు ఖరారు చేసిన ఫీజునే చెల్లించాల్సి ఉంటుంది. 2024లో జారీ చేసిన ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ఈసెట్ కన్వీనరే ఈ పరీక్షను నిర్వహించాల్సి ఉంటుంది. ఇందులోభాగంగానే రాష్ట్ర ఉన్నత విద్యామండలి కూడా ఈసెట్ కన్వీనర్, ఉస్మానియా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపల్ ఆచార్య చంద్రశేఖర్‌కు ఎంట్రన్స్ టెస్ట్ నిర్వహణ కోసం అవసరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వంఆదేశాలు జారీ చేసింది. మరోవైపు.. ఎంటెక్ సీట్ల భర్తీకి కూడా రాష్ట్ర ప్రభుత్వం జీఓ జారీ చేయగా.. అయితే వాటిని ఎలా భర్తీ చేస్తారు అనే దానిపై మాత్రం ఇంకా స్పష్టత లేదు. అయితే 3, 4 కాలేజీల్లోనే సాయంత్రం

**ఎంటెక్ కోర్సులకు అనుమతులు వచ్చాయి.**

సాయంత్రం బీటెక్ కోర్సులకు అనుమతి పొందిన కాలేజీలు
చైతన్య భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (సీబీఐటీ)
వల్లూరుపల్లి నాగేశ్వరరావు విజ్ఞాన జ్యోతి ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ (వీఎన్ఆర్ విజ్ఞాన జ్యోతి)
మాటూరి వెంకట సుబ్బారావు ఇంజినీరింగ్ కాలేజీ (ఎంవీఎస్ఆర్)
స్టాన్లీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ ఫర్ ఉమెన్ (స్టాన్లీ)
మెథడిస్ట్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ (మెథడిస్ట్)
మహాత్మాగాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంజీఐటీ)
మాతృశ్రీ ఇంజినీరింగ్ కాలేజీ అబ్దుల్ కలాం ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలాజికల్ సైన్సెస్ (భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వేపలగడ్డ)
జయప్రకాశ్ నారాయణ్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ (మహబూబ్‌నగర్)
అనుబోస్ ఇన్‌స్టిట్యూ ఆఫ్ టెక్నాలజీ (ఖమ్మం జిల్లా పాల్వంచ)
సిద్ధార్థ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ (రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం) సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కాలేజీ (మేడ్చల్ జిల్లా)

# మరింత విస్తరించనున్న ఐటీ కారిడార్

**హైదరాబాద్, మార్చి 11,పెన్ పవర్:**
హైదరాబాద్ నగరం దేశంలోనే ఐటీ క్యాపిటల్‌గా ఎదుగుతోంది. రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న అత్యాధునిక మౌలిక వసతులు, అనుకూలమైన వ్యాపార వాతావరణం కారణంగా ప్రపంచ ప్రఖ్యాత టెక్ దిగ్గజాలు తమ ప్రధానకార్యాలయాలను ఇక్కడ నెలకొల్పాయి. గూగుల్, మైక్రోసాఫ్ట్, అమెజాన్ వంటి సంస్థలు హైదరాబాద్ నగరాన్ని తమ కేంద్రంగా ఎంచుకున్నాయి. హైటెక్ సిటీ, గచ్చిబౌలి ప్రాంతాలలో విస్తరించిన ఈ ఐటీ కారిడార్‌లో లక్షలాదిమంది సాఫ్ట్‌వేర్ నిపుణులు ఉద్యోగాలు చేస్తున్నారు. నెట్‌ఫ్లిక్స్ వంటి మరికొన్ని అంతర్జాతీయ సంస్థలు నగరంలో పెట్టుబడులు పెట్టేందుకు రెడీ అవుతున్నాయి. రాజధాని హైదరాబాద్‌లో ఐటీ కారిడార్ పరిధినివిస్తరించేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రణాళికలను రూపొందించింది. ఇప్పటికే ఉన్న హైటెక్ సిటీ, గచ్చిబౌలి, మాదాపూర్, నానక్‌రాం గూడలతో పాటు రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్, గండిపేట మండలాల్లోని ప్రభుత్వ భూముల్లో మరిన్ని ఐటీ సంస్థలు, క్లస్టర్ల ఏర్పాటుకు సిద్ధమైంది. ఈ మేరకు కంపెనీల ఏర్పాటుకు అవసరమైన మౌళిక సదుపాయాలు కల్పించేందుకు టీజీఐఐసీ సన్నాహాలు చేస్తోంది. కొద్ది రోజుల క్రితం గచ్చిబౌలిసమీపంలో టీజీఐఐసీ ఆధీనంలోని ప్రభుత్వ భూములను వేలం వేయగా ఎకరా రూ.170 కోట్లకుపైగా అమ్ముడుపోయింది. దీంతో ఐటీ కారిడార్‌ను విస్తరించాలని అధికారులు నిర్ణయం తీసుకున్నారు. నగర శివారులోని ప్రభుత్వ భూములను సొంతం చేసుకునేందుకు కొందరు అక్రమార్కులు రికార్డులను మార్చేసినట్టు అధికారులు గుర్తించారు. హైదరాబాద్ నగరం చుట్టూ ఉన్న గ్రామాలు, వ్యవసాయ భూముల్లో 60 శాతం నిజాం నవాబుహయాంలో దానమిచ్చిన భూములే. నిజాం వారసులు లేకపోవడం, భూములకు సంబంధించిన వివరాలను రెవెన్యూ అధికారులు పక్కాగా క్రమపద్ధతిలో రూపొందించడంతో వీటిలో 90 శాతం ప్రభుత్వం తిరిగి స్వాధీనం చేసుకుంది. ఆయా భూములను సొంతం చేసుకునేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారు. నిజాం వారసుల నుంచి దానం పొందామని, వారు జీపీఏ ఇచ్చారంటూ నకిలీ పత్రాలు సృష్టించి కోర్టులను ఆశ్రయిస్తున్నారు. శేరిలింగంపల్లి మండలంలోని 3 గ్రామాల్లో 180 ఎకరాల ప్రభుత్వ భూములపై ప్రస్తుతం వివాదాలు కొనసాగుతున్నాయి. గండిపేట మండలంలోని 4 గ్రామాల్లో దాదాపు 200 ఎకరాల భూములపైప్రైవేటు వ్యక్తులు వివాదాలు సృష్టిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ భూములు, చెరువులను అక్రమార్కుల నుంచి రక్షించేందుకు అధికారులు డిజిటల్ సర్వేలు చేయిస్తున్నారు. త్వరలోనే ఆ భూములను స్వాధీనంచేసుకొని ఆయా ప్రాంతాల్లో ఐటీని విస్తరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

# నిజాం వ్యతిరేక పోరాట యోధుడు

**హైదరాబాద్ పెన్ పవర్:** మందుముల నరసింగరావు (మార్చి 17, 1896 – మార్చి 12, 1976) నిజాం విమోచన పోరాట యోధుడు, రాజకీయ నాయకుడు, పత్రికా రచయిత, న్యాయవాది, ఆంధ్ర జనసంఘ స్థాపకులు, సంఘ సంస్కర్త, పాలమూరు జిల్లాకు చెందిన సమరయోధుడు మందుముల నరసింగరావు మార్చి 17, 1896 న ప్రస్తుత రంగారెడ్డి జిల్లా చేవెళ్ళలో జన్మించారు. తలకొండపల్లి మండల కేంద్రానికి చెందిన నరసింగరావు న్యాయ శాస్త్రంలో పట్టభద్రులు అయినారు. పర్షియన్ భాషలో కూడా అయన గొప్ప పండితులు, పత్రికా రచయితగా పేరు పొందారు. 1921లో ఆంధ్ర జనసంఘాన్ని స్థాపించిన వారిలో ఒకడు. 1927లో న్యాయవాద వృత్తికి స్వస్తి చెప్పి పత్రికారచన, రాజకియాలు చేపట్టారు. 1927లో రయ్యత్ అనే ఉర్దూ వార్తాపత్రిక స్థాపించి సంపాదక బాధ్యతలు చేపట్టారు. మందుముల, సమర రంగంలో కూడా కీలకపాత్ర వహించి 1937లో ఇందూరు (నిజామాబాదు) లో జరిగిన 6వ ఆంధ్ర మహాసభకు అధ్యక్షత వహించారు. 1938–42 కాలంలో నిజాం లెజిస్లేటివ్ కౌన్సిల్ సభ్యులుగా ఉన్నారు. 1947లో జాయిన్ ఇండియా ఉద్యమంలో పాల్గొని అరెస్టు అయ్యారు. బాల్య వివాహాల రద్దుకు, వితంతు వివాహాలకు బాగా కృషి చేశారు. 1952లో కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ తరఫున హైదరాబాదు శాసనసభకు ఎన్నికయ్యారు. 1957–62 కాలంలో రాష్ట్ర మంత్రివర్గంలో పని చేశారు. నిజాం కాలంలోని దుష్పరిపాలనను వర్ణిస్తూ "50 సంవత్సరాల హైదరాబాదు" గ్రంథాన్ని స్వీయజీవిత చరిత్రగా రచించారు. టేకుమాల రంగారావు, మాడపాటి హనుమంత రావు, మిట్ట లక్ష్మీనరసయ్య, ఆదిరాజు వీరభద్రరావు, నడింపల్లి జానకి రామయ్య, బూర్గుల రామకృష్ణా రావు, బోయినపల్లి వెంకట రామారావు, కొమ్మవరపు సుబ్బారావు బూర్గుల నరసింహా రావు, డాక్టర్ పందింటి రామస్వామి నాయుడు తదితరులతో కలిసి 'ఆంధ్ర జనసంఘం'ను స్థాపించారు. హైదరాబాద్ సంస్థాన ఆధునిక చరిత్రలో రావి నారాయణరెడ్డి, ముఖ్దూం మొహియుద్దీన్ వంటివారు అతివాద వర్గం ప్రతినిధులు కాగా, బూర్గుల రామ కృష్ణారావు, మందుముల నరసింగ రావు, మాడపాటి హనుమంత రావు, మాదిరాజు రామకోటీశ్వర రావుతదితరులు మితవాదులు. భువనగిరిలో జరిగిన ఆంధ్రమహా సభలకు వివిధ గ్రామాల నుండి ఎడ్ల బండ్లపై వచ్చిన వారు...రావి నారాయణరెడ్డి, ఆరుట్ల రామచంద్రారెడ్డి, లక్ష్మీనరసింహారెడ్డి, మందుముల నరసింగరావు, బూర్గుల రామకృష్ణరావు లాంటి ప్రముఖులను ఎడ్ల బండ్ల మీద ఊరేగించారు. ఆయన బాల్య వివాహాల రద్దుకు, వితంతు వివాహాలకు బాగా కృషిచేశారు. 1952లో కల్వకుర్తి నియోజక వర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ తరఫున హైదరాబాదు శాసనసభకు ఎన్నికయ్యాడు. 1957–62 కాలంలో రాష్ట్ర మంత్రివర్గంలో పనిచేశాడు. నిజాం కాలంలోని దుష్పరిపాలనను వర్ణిస్తూ "50 సంవత్సరాల హైదరాబాదు" గ్రంథాన్ని స్వీయజీవిత చరిత్రగా రచించాడు. యాభై ఏళ్ల హైదరాబాదు నగర సమగ్రచరిత్ర ఈ గ్రంథం. హైదరాబాదు రాజకీయ సామాజిక జీవనంలో ప్రధానపాత్ర పోషించి, ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన తర్వాత ప్రజాస్వామ్య ప్రభుత్వంలో మంత్రిగా పనిచేసిన మందుముల నరసింగరావు కలం నుండి వెలువడిన రచన. ప్రత్యక్ష సాక్షిగా ఆయన కథనం. మందుముల నరసింగరావు కూతురు అనంతలక్ష్మిని బూర్గుల రామకృష్ణారావు రెండో వివాహం చేసుకున్నారు. సమర యోధుడిగా పేరుపొందిన మందుముల రామచంద్రారావు ఆయన సోదరుడు. మార్చి 12, 1976 న మందుముల మరణించారు.

# కేటీఆర్‌లో ఆ బాధ ఎక్కువైంది: దానం సెటైర్లు



**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు.. సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్‌పై ఆ పార్టీ తరఫున 2023లో ఎమ్మెల్యేగా విజయం దక్కించుకున్న ఖైరతాబాద్ నాయకుడు దానం నాగేందర్ తాజాగా కీలక వ్యాఖ్యలు చేశారు. 2023లో పార్టీ ఓడిపోయినందుకు కేటీఆర్ బాధపడలేదన్నారు. కానీ, 2018లో తనకు ముఖ్యమంత్రి పదవి దక్కలేదని మాత్రం కేటీఆర్ తెగ బాధపడ్డారని.. ఇప్పుడు ఆ బాధ మరింత పెరిగిందని విమర్శించారు. అందుకే.. తమపై కక్ష సాధింపు రాజకీయాలు చేస్తున్నారని దానం విమర్శించారు. తాజాగా స్పీకర్ ప్రసాద రావు.. అనర్హత పిటిషన్ల విషయంలో దానం, కడియం శ్రీహరిలకు క్లీన్ చిట్ ఇచ్చారు. ఈ వ్యవహారంపై మీడియాతో మాట్లాడిన దానం.. తాను పార్టీ మారానని ఎవరికైనా చెప్పానా? అని ప్రశ్నించారు. తాను ఇప్ప టికీ బీఆర్ఎస్‌లోనే ఉన్నానని.. ఆ పార్టీ సభ్యత్వమే కొనసాగుతోందన్నారు. అంతేకా దు.. పార్టీకార్యక్రమాలకు పిలిస్తే.. వెళ్తానని గతంలోనూ చెప్పాన న్నారు. కానీ, తనను ఏకార్యక్రమానికీ పిలవడం లేదని దానం వ్యాఖ్యానించారు. తాజాగా మంగళవారం బీఆర్ ఎస్ ఎల్పీ సమావే శం(బడ్జెట్ సమావేశాలకు ముందు బీఆర్ ఎస్ ఎమ్మెల్యేలతో నిర్వహించిన సమావేశం) నిర్వహించారని.. కానీ, తనను మాత్రం పిలవలేదని అన్నారు. తప్పు ఎవరు చేశారో.. ఎవరిపై నెపం నెడుతున్నారనో తెలుస్తూనే ఉందన్నారు. తాను పార్టీ మారలేద న్నారు. స్పీకర్ ఇచ్చిన నిర్ణయం తనను సంతోషానికి గురి చేసిందన్నారు.

**ఇది అప్రజాస్వామికం: కేటీఆర్..**

ఫిరాయింపు ఎమ్మెల్యేలపై స్పీకర్ ప్రసాదరావు తీసుకున్న నిర్ణయాన్ని కేటీఆర్ తీవ్రంగా తప్పుబట్టారు. ఇది అప్రజాస్వామిక నిర్ణయమన్నారు. అంతేకాదు.. ప్రజాస్వామ్య వ్యవస్థలను ఎలా నీరు గార్చొచ్చో.. ఈ నిర్ణయాలు నిరూపిస్తున్నాయన్నారు. స్పీకర్ స్థానంలో ఉండి నిష్పక్ష పాతంగా వ్యవహరించాల్సిన వారు.. ఇలా ఏకపక్షంగా, అధికార పార్టీకి అనుకూలంగా నిర్ణయం తీసుకోవడం దారుణమనివ్యాఖ్యానించారు. అన్ని విషయాలను ప్రజలు గమనిస్తున్నారని.. సరైన సమయంలో వారే సరైన నిర్ణయం తీసుకుంటారని వ్యాఖ్యానించారు

# రంజాన్ మాసం సహనం, దానం, సహోదర భావానికి ప్రతీక:

**బోయిన్ పల్లి ఇఫ్తార్ విందులో కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్**

**సికింద్రాబాద్ పెన్ పవర్:** నియోజకవర్గం లోని బోయిన్ పల్లి కడక్ పుర ప్రాంతం లోని నేతాజీ నగర్ లో సయ్యద్ అమీర్ గారి ఆధ్వర్యంలో గత 14 ఏళ్ళుగా నిర్వహిస్తున్న ఇఫ్తార్ విందుకు ముఖ్య అతిథిగా కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ మంగళవారం హాజరయ్యారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే ముస్లిం సోదరులకు ముందస్తు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే శ్రీగణేష్ మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసంలో ముస్లిం సోదరులు నిష్ఠగా ఉపవాస దీక్ష చేస్తారని, భారతదేశంలో సర్వ మతాలు సమానమేనని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ముస్లిం సోదర సోదరీమణులకు ప్రత్యేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తుందని, ఈ పవిత్ర దినాల ముఖ్య ఉద్దేశం అందరూ దాన, సహన, సహోదర భావ గుణాలతో ప్రవర్తించాలని చెప్పారు. ఇన్నేళ్ళుగా ఇఫ్తార్ విందులను ఏర్పాటు చేస్తున్న అమీర్ భాయ్ ని ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు.

ఈ ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే వెంట కంటోన్మెంట్ బోర్డు మాజీ వైస్ ప్రెసిడెంట్ జంపన ప్రతాప్, ముప్పిడి మధుకర్, మారుతి గౌడ్,బల్వంత్ రెడ్డి, అరుణ్ యాదవ్, ప్రభు గుప్త, హైదర్, రియాజుద్దీన్, సదానంద్ మరియు ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.



# మూసీలో పొంగుతున్న రాజకీయ కాలుష్యం



**హైదరాబాద్, మార్చి 11, పెన్ పవర్:**

హైదరాబాద్‌కు ఇప్పుడు కొత్త జ్వరం పట్టుకుంది. అదే.. 'మూసీ ఫీవర్'. నదిని శుద్ధి చేస్తామని ఒకరు అంటే, ఆ ప్రాజెక్టు వెనుక 'అతివృష్టి' (అవినీతి) ఉందని మరొకరు, అసలు తాము వస్తే మూసీని 'అమృతం'లా మార్చేవాళ్ళమని ఇంకొకరు.. మొత్తానికి మూసీ నీళ్ళ కంటే, మూసీపై జరుగుతున్న రాజకీయ కాలుష్యమే ఇప్పుడు సిటీలో హాట్ టాపిక్. మన రాజకీయ నాయకులకు ఏదైనా ప్రాజెక్టు అంటే మొదట గుర్తొచ్చేది 'విగ్రహం'. మూసీ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ. 5,000 కోట్లు దాటినా, ప్రతిపక్షాలకు మాత్రం అందులో కనిపించేది కేవలం ఒక విగ్రహం మాత్రమే! "అమ్మో! విగ్రహానికి వంద కోట్లా?" అంటూ ఒక వర్గం గగ్గోలు పెడుతుంటే, అటువైపు ప్రభుత్వం ఏమో "మేము చేసేది నది ప్రక్షాళన, విగ్రహం ఒక్కటే కాదు" అని వివరణ ఇచ్చుకోలేక పడుతున్న పాట్లు చూస్తుంటే.. అసలు ప్రాజెక్టు దేనికో, అది దేనికో అర్థం కాక సామాన్యుడు తల పట్టుకుంటున్నాడు. సీఎం రేవంత్ రెడ్డి గారి ఉద్దేశం చూస్తుంటే, హైదరాబాద్‌ను లండన్ థేమ్స్ నది రేంజ్‌లోకి తీసుకెళ్లాలని ఉంది. "సబర్మతిని అభివృద్ధి చేయొచ్చు, యమునను బాగు చేయొచ్చు.. మరి మన మూసీని ఎందుకు చేయకూడదు?" అని ఆయన అడుగుతుంటే, ప్రతిపక్షాలు "మీరు చేసేది అభివృద్ధి కాదు, 'లూటిఫికేషన్'" అని ఎదురుదాడి చేస్తున్నాయి. చివరకు పరిస్థితి ఎలా ఉందంటే, మూసీలో నీళ్లు పారడం సంగతి పక్కన పెడితే, మాటల యుద్ధం మాత్రం వరదలా పారుతోంది. ఏ రాజకీయ గొడవైనా చివరకు 'లీగల్ నోటీసుల' దగ్గర ఆగుతుంది. ప్రాజెక్టుపై ఆరోపణలు చేసిన బీఆర్ఎస్ నేతలకు ఏకంగా లీగల్ నోటీసులు రావడంతో.. ఇప్పుడు అసలు పోరాటం 'వాస్తవాల' మీద జరుగుతుందా లేక 'కోర్టు మెట్ల' మీద జరుగుతుందా అనే అనుమానం రాక మానదు. ఆరోపణలు చేయడం, నోటీసులు రావడం, మళ్లీ ప్రెస్ మీట్లు పెట్టడం.. ఇదంతా చూస్తుంటే హైదరాబాద్ అభివృద్ధి ఏమో కానీ, లాయర్ల ఆదాయం మాత్రం ఖచ్చితంగా పెరిగేలా ఉంది! అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డిగారు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వబోతున్నారు. ప్రభుత్వం తన వాదనను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఫెయిల్ అయ్యిందనే విమర్శలకు, ఈ ప్రజెంటేషన్ చెక్ పెడుతుందా? లేక ఆ ప్రజెంటేషన్‌ను చూసి ప్రతిపక్షాలు మరో రకమైన విమర్శలకు సిద్ధమవుతాయా? అన్నదే అసలైన సస్పెన్స్. నది కలుషితమైతే నీటిని శుద్ధి చేయొచ్చు. కానీ, రాజకీయాల్లో కలుషితమైన అభిప్రాయాలను శుద్ధి చేయడానికి ఏ ప్లాంట్ పనికొస్తుంది? కేవలం విగ్రహాలు, విమర్శల చుట్టూ తిరిగితే, మూసీ ప్రక్షాళన అనేది నగరానికి ఒక 'స్వప్నం'గానే మిగిలిపోయే ప్రమాదం ఉంది. ప్రభుత్వం చెప్పే 'గ్లోబల్ సిటీ' కల నెరవేరాలంటే, ప్రజలకు కావాల్సింది పవర్ పాయింట్ ప్రజెంటేషన్లు మాత్రమే కాదు.. పారదర్శకమైన పాలన, క్షేత్రస్థాయిలో భరోసా!

## మైనారిటీలకు కాంగ్రెస్ అండ: ఎమ్మెల్యే రాగమయి



**సత్తుపల్లి, మార్చి 11 పెన్ పవర్:** సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ తెలిపారు, మైనారిటీలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని అన్నారు. బుధవారం పట్టణంలోని మసీదులో రంజాన్ తోఫాను ముస్లింలకు రాష్ట్ర ప్రభుత్వం తరపున అందించారు. మైనారిటీల సంక్షేమానికి, మత సామరస్యానికి రేవంత్ రెడ్డి సర్కారు పెద్ద పీట వేసిందని స్పష్టం చేశారు. ముస్లిం పెద్దలు మట్టాకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గాదె చెన్నారావు తదితరులు పాల్గొన్నారు.

# ఆలయ బ్రహ్మోత్సవాలు... ప్రచార రథం ప్రారంభం

**మధిర, మార్చి 11 పెన్ పవర్:** ఖమ్మం యూపీహెచ్ కాలనీలోని స్వయంభూ శ్రీ అభయ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో 22వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 19 నుంచి 23 వరకు ఘనంగా నిర్వహించనున్నట్లు దేవస్థాన కమిటీ సభ్యులు తెలిపారు. ఈ బ్రహ్మోత్సవాల ప్రచార రథాన్ని కమిటీ ఛైర్మన్ అల్లిక అంజయ్య ప్రారంభించారు. అన్నదాన కార్యక్రమానికి విరాళాలు అందించి సహకరించాలని, బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని కమిటీ సభ్యులు కోరారు.

# రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

**పాలేరు, మార్చి 11 పెన్ పవర్:** ఖమ్మం జిల్లా, పాలేరు సమీపంలో నెలకొండపల్లి–కుసుమంచి రోడ్డులో జరిగిన ప్రమాదంలో గాయపడి, ఆస్పత్రికి తరలించిన కొరట్లగూడెం గ్రామానికి చెందిన యువకుడు రాత్రి మరణించాడు. ఇంటర్ చదువుతున్న అతడు, ప్రథమ చికిత్స నిమిత్తం ఖమ్మం ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మరణించినట్లు సమాచారం. ఈ వార్తతో కొరట్లగూడెం గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. విద్యార్థి సంఘాలు, గ్రామ ప్రజలు ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నారు. గత కొద్ది రోజుల క్రితం జరిగిన ఈ రోడ్డు ప్రమాదం, ఇప్పుడు ఆ యువకుడి మరణంతో మరింత విషాదకరంగా మారింది.

# రంజిత్ 29వ సారి రక్తదానం: తోటి మిత్రుల అభినందనలు



**ములుగు, మార్చి 11 పెన్ పవర్:** వరంగల్ జిల్లా బీజేపీ నాయకులు కనుకుంట్ల రంజిత్ బుధవారం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో ఎమర్జెన్సీలో ఉన్న ఒక పేషెంట్‌కు అత్యవసరంగా రక్తం అవసరం ఉందని తెలిసి స్వచ్ఛందంగా 29వ సారి రక్తదానం చేశారు. ఆయన ఉదారమైన రక్తదానం వల్లే ఆపదలో ఉన్నవారి ప్రాణాలు కాపాడబడుతున్నాయని తోటి మిత్రులు, శ్రేయోభిలాషులు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. సమాజానికి ఆదర్శంగా నిలిచిన ఆయన సేవా స్ఫూర్తి మరెందరికో ప్రేరణగా నిలవాలని వారు కోరుకున్నారు.

# ఇండ్లకు పట్టాలు ఇవ్వాలని ధర్నా

**మహబూబాబాద్, మార్చి 11 పెన్ పవర్:** గత ప్రభుత్వ హయాంలో 58 జీవో కింద ఇండ్ల పట్టాలకు దరఖాస్తు చేసుకున్న పేదలకు వెంటనే పట్టాలు ఇవ్వాలని మహబూబాబాద్ కలెక్టర్ కార్యాలయం ముందు బుధవారం సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. దరఖాస్తులను బీరువాలో పెట్టి కట్టగట్టి ఉంచారని, పట్టాలు ఇవ్వడం లేదని నాయకులు ఆరోపించారు. తక్షణమే పట్టాలు ఇవ్వాలని, లేకుంటే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

# అమెరికాలో గుండెపోటుతో హన్మకొండకు చెందిన మహిళ మృతి

**వర్ధన్నపేట, మార్చి 11 పెన్ పవర్:** హన్మకొండకు చెందిన శ్వేత అమెరికాలోని డాలస్‌లో గుండెపోటుతో మరణించారు. ఆమె నిట్ విశ్రాంత ఆచార్యులు కొత్త లక్ష్మారెడ్డి, వెంకటలక్ష్మి దంపతుల కుమార్తె. శ్వేత, తన భర్త వీరాటి సురేష్‌రెడ్డితో కలిసి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా పనిచేస్తున్నారు. ఆదివారం అర్ధరాత్రి శుభకార్యం నుంచి తిరిగి వచ్చిన తర్వాత నిద్రపోతున్న సమయంలో గుండెపోటుతో మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆమె మృతదేహాన్ని శనివారం హనుమకొండకు తరలించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

# రెవెన్యూ అధికారుల ఆకస్మిక తనిఖీలు: రికార్డుల పరిశీలన, వసతి గృహ సందర్శన



**మెదక్, మార్చి 11 పెన్ పవర్:** మెదక్ జిల్లా, శివంపేట్ మండల కేంద్రంలో రెవెన్యూ అధికారులు బుధవారం, మార్చి 11, 2026న అకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఎరువుల దుకాణాల్లో రికార్డులను పరిశీలించి, ఇందిరమ్మ గృహాల నిర్మాణ పనులను తనిఖీ చేశారు. అనంతరం గూడూరు గ్రామంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం వసతి గృహాన్ని సందర్శించి, విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కామలాద్రి, ఎంపీడీఓ వెంకట లక్ష్మమ్మ, ఆర్ఐ నిరంజన్, పంచాయతీ కార్యదర్శి రమాదేవి పాల్గొన్నారు.

# మార్లవాయి గ్రామస్తుల సమిష్టి కృషితో వధువుకు ఆర్థిక సహాయం



**ఆదిలాబాద్, మార్చి 11 పెన్ పవర్:** కొమరం భీమ్ జిల్లా, జైనూర్ మండలం, మార్లవాయి గ్రామంలో గ్రామస్తులు ఒకరికొకరు సహాయం చేసుకుంటూ, అనవసర ఖర్చులు తగ్గించి, వధువు కుటుంబానికి ఆర్థిక సహాయం అందించారు. వివాహాల్లో ఆడంబరాలకు బదులు ఉపయోగకరమైన సహాయం అందించాలని నిర్ణయించారు. ఈ మంచి నిర్ణయాన్ని ఇతర గ్రామాలు, కూడాలలో కూడా అమలు చేయాలని కోరారు.

## ఆదిలాబాద్ చైర్‌పర్సన్ తీరు బాధాకరం

**బోథ్, మార్చి 11 పెన్ పవర్:** ఆదిలాబాద్ మున్సిపల్ కౌన్సిల్ లో బీజేపీ కౌన్సిలర్లతో చైర్ పర్సన్ వ్యవహరించిన తీరు బాధాకరమని మాజీ కౌన్సిలర్ జోగు రవి అన్నారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ, పట్టణ సమస్యలపై చర్చించాలని తమ సభ్యులు కోరితే అజెండా పాస్ పాస్ అనుకుంటూ వెళ్లడం సమంజసం కాదన్నారు. చైర్పర్సన్ భర్త బండారి సతీష్ ఎమ్మెల్యేపై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని, ఎమ్మెల్యే గురించి మాట్లాడే స్థాయి ఆయనకు లేదని పేర్కొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ నిధులతో గ్రామాల అభివృద్ధి

**నిర్మల్, మార్చి 11 పెన్ పవర్:** నిర్మల్ రూరల్ మండలం తల్వేద, లంగ్డాపూర్, వెంగ్వాపేట్ గ్రామాల్లో బుధవారం బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి మహిళా సమైక్య భవనం, వర్కింగ్ షెడ్, అంగన్వాడి భవనం, ప్రభుత్వ పాఠశాల ప్రహరీ నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో నిర్మల్ నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు.

## ప్రజల భద్రత కోసమే తనిఖీలు..

**ఖానాపూర్, మార్చి 11 పెన్ పవర్:** జిల్లా ఎస్పీ జానకి షర్మిల ఆదేశాల మేరకు మామడ మండల కేంద్రంలో బుధవారం కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. ప్రజల భద్రత కోసమే తనిఖీలు చేపడుతున్నట్లు ఏఎస్పీ సాయికిరణ్ తెలిపారు. సరైన పత్రాలు లేని 65 బైక్‌లను స్వాధీనం చేసుకుని, పెండింగ్ చలాన్లు వసూలు చేశారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐ గోవర్ధన్ రెడ్డి, ఎస్సై అశోక్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులకు మాదకద్రవ్యాల అనర్థాలపై అవగాహన

**ముథోల్, మార్చి 11 పెన్ పవర్:** నిర్మల్ పట్టణంలోని మంజులాపూర్ సమీపంలో గల గౌతం మోడల్ స్కూల్ లో బుధవారం విద్యార్థులకు మాదకద్రవ్యాల అనర్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రూరల్ సీఐ కృష్ణ మాట్లాడుతూ, మాదకద్రవ్యాలను నిర్మూలించడంలో నేటి తరం విద్యార్థులే కీలక పాత్ర పోషించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, నిషేధిత డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాల వాడకం పట్ల విద్యార్థులు ఆకర్షితులు కావద్దని ఆయన విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై లింబాద్రి, ప్రిన్సిపాల్ జగతి రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పదో తరగతి విద్యార్థులకు పరీక్షా సామాగ్రి పంపిణీ

**మానకొండూరు, మార్చి 11 పెన్ పవర్:** రాజన్న సిరిసిల్ల జిల్లా మానకొండూర్ నియోజకవర్గం ఇల్లంతకుంట మండలం గాలిపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం, పదవ తరగతి విద్యార్థులకు పరీక్షలు రాయడానికి అవసరమైన ప్యాడ్స్, పెన్నులు, రబ్బర్, స్కేల్ వంటివి, అలాగే క్రీడాకారులకు జెర్సీలను సింగిరెడ్డి భరత్ రెడ్డి జ్ఞాపకార్థం ఆయన తండ్రి సింగిరెడ్డి తిరుపతిరెడ్డి అందజేశారు. ప్రధానోపాధ్యాయురాలు మేకల పావని చేతుల మీదుగా జరిగిన ఈ కార్యక్రమంలో, పరీక్షలంటే భయం వీడి ఇష్టంతో మంచి మార్కులు సాధించి పాఠశాల, తల్లిదండ్రులకు పేరు తేవాలని విద్యార్థులకు సూచించారు. పరీక్షా సామాగ్రి అందించిన తిరుపతిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, కమిటీ చైర్మన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## యువతి బలవన్మరణం

**చొప్పదండి, మార్చి 11 పెన్ పవర్:** గోదావరిఖనికి చెందిన రామగిరి సాయికుమార్, అతని అక్క శిరీష (31), అన్న శ్రవణ్ కుమార్ కరీంనగర్ తిరుమలనగర్ లోని అద్దె ఇంట్లో ఉంటున్నారు. పదేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్న శిరీష, ఏడు నెలల క్రితం తండ్రి మరణంతో మానసికంగా కుంగిపోయింది. సోమవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. సోదరుడు సాయికుమార్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## అనంతారం సీతారాముల దేవాలయంలో ధ్వజస్తంభ ప్రతిష్టాపన మహోత్సవాలు

**వేములవాడ, మార్చి 11 పెన్ పవర్:** రాజన్న సిరిసిల్ల జిల్లా మానకొండూర్ నియోజకవర్గం ఇల్లంతకుంట మండలం అనంతారం గ్రామంలోని సీతారాముల దేవాలయంలో ఈనెల 23 నుంచి 27 వరకు జరగనున్న ధ్వజస్తంభ ప్రతిష్టాపన మహోత్సవాలకు సంబంధించి బుధవారం పత్రిక ప్రతిష్ట కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ వొల్లాల రజిత వెంకటేశం, ఆలయ వేద పండితులు, గ్రామ పెద్దల సమక్షంలో పత్రికను ప్రతిష్టించి, గ్రామ ప్రజలందరినీ మహోత్సవాలకు హాజరై విజయవంతం చేయాలని ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు, ఉపసర్పంచులు, మార్కెట్ డైరెక్టర్లు, వార్డ్ మెంబర్లు, ప్రెస్ క్లబ్ జిల్లా ఉపాధ్యక్షులు బొల్లం పరుశురాం, మండల రిపోర్టర్ బొంగోని రాజు, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

## పేదింట పెళ్లికి బెంద్రం ఫౌండేషన్ చేయూత

**సిరిసిల్ల, మార్చి 11 పెన్ పవర్:** రాజన్న సిరిసిల్ల జిల్లా మానకొండూర్ నియోజకవర్గం ఇల్లంతకుంట మండలం కందికట్కూర్ గ్రామంలో బుధవారం పేద కుటుంబానికి చెందిన తాడురి రవి – మల్లవ్వల కుమార్తె అలేఖ్య – రాజుల వివాహానికి బెంద్రం తిరుపతిరెడ్డి ఫౌండేషన్ ద్వారా రూ. 10,000 విలువైన టేకు మంచాలను అందజేశారు. ఫౌండేషన్ వ్యవస్థాపకులు మాట్లాడుతూ, ఇల్లంతకుంట మండలంలోని పేద కుటుంబాల కుమార్తెల వివాహాలకు కళ్యాణ కానుకలు, సహాయాలు అందిస్తూనే ఉంటామని తెలిపారు. ఈ సేవా కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు, మాజీ సర్పంచ్ ముత్యం అమర్, రాచకొండ రోశాలు, ముత్యం రాములు తదితరులు పాల్గొన్నారు.

## యువకుడి అవయవ దానం: ఆరుగురి జీవితాల్లో వెలుగులు

**హుజూరాబాద్, మార్చి 11 పెన్ పవర్:** హుజూరాబాద్‌కు చెందిన 28 ఏళ్ల బొగ్గుల రాహుల్ అనే యువకుడు రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి బ్రెయిన్ డెడ్ అయిన ఘటనలో, అతని కుటుంబ సభ్యుల అంగీకారంతో అవయవ దానం చేశారు. ఈ నెల 7న జరిగిన ఈ ప్రమాదంలో, రాహుల్ గుండె, రెండు కిడ్నీలు, కాలేయం సేకరించి ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఆరుగురికి అమర్చారు. అలాగే, అతని రెండు కంటి కార్నియాలను చూపులేని వారికి అమర్చినట్లు నోడల్ అధికారి శ్రీభూషణ్ రాజు తెలిపారు. ఈ అవయవ దానం ద్వారా ఆరుగురి జీవితాల్లో కొత్త వెలుగులు నింపారు.

# డంపింగ్ యార్డ్ తరలించడానికి ప్రభుత్వం సిద్ధం



**కరీంనగర్, మార్చి 11 పెన్ పవర్:** కరీంనగర్ పట్టణ ప్రజలు డంపింగ్ యార్డు వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. చొప్పదండి సభలో మాట్లాడిన ముఖ్యమంత్రి, డంపింగ్ యార్డును శాశ్వతంగా తరలిస్తామని హామీ ఇచ్చారు. మంత్రి పొన్నం ప్రభాకర్ స్వయంగా డంపింగ్ యార్డును సందర్శించి, అక్కడి ప్రజల కష్టాలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, కమిషనర్ ప్రఫుల్ దేశాయి, మాజీ ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.


03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి


# ఉప్పుసత్యాగ్రహంలో ఆంధ్రుల పాత్ర

**హైదరాబాద్ పెన్ పవర్:** భారత దేశ స్వాతంత్ర్య సమర చరిత్రలో బ్రిటిషు పాలనకు వ్యతిరేకంగా జరిపిన శాసనోల్లంఘనలో భాగంగా, మహాత్మా గాంధీ నేతృత్వంలో భారత జాతీయ కాంగ్రెసు జరిపిన అహింసాయుత సత్యాగ్రహమే ఉప్పు సత్యాగ్రహం. అది మహాత్మా గాంధీచే ప్రారంభించ బడిన ఒక అహింసా ప్రచారోద్యమం. ఇది బ్రిటిష్ రాజ్ కు వ్యతిరేకంగా జరిగింది. ఉప్పుపై పన్ను చెల్లిం చేందుకు నిరాకరించి, మార్చి 12, 1930న చేప ట్టిన దండి యాత్రనే ఉప్పు సత్యాగ్రహంగా పేర్కొంటారు. సంపూర్ణ స్వరాజ్యం కోసం బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా చేపట్టిన ఉద్యమాల సారమే ఈ ఉప్పు సత్యాగ్రహం. ఈ యాత్ర సబర్మతి ఆశ్రమం నుంచి ఎనభై మందితో ప్రారంభమై గుజరాత్ లోని సముద్ర తీరంలో ఉన్న పల్లెటూరు దండి వరకూ సాగింది. కనుక దీనికి ఉప్పు సత్యాగ్రహ కార్యక్రమంగా పేర్కొంటారు. కోట్లమంది భారతీయులపై బ్రిటిష్ రాజ్ వేసే ఉప్పు పన్నుకు వ్యతిరేకించిన మౌన నిరసన కార్యక్రమం అది. దానిని దండి సత్యాగ్రహం అనీ, దండి యాత్ర అనీ, దండి మార్చ్ అనీ పిలుస్తారు. 1920 – 22 నాటి సహాయ నిరాకరణోద్యమం తరువాత ఈ మార్చ్ బ్రిటిష్ అధికారానికి అత్యంత ముఖ్యమైన వ్యవస్థీకృత సవాలు విసిరింది. 1930 జనవరి 26 న భారత జాతీయ కాంగ్రెస్ సంపూర్ణ స్వరాజ్య నినాదం ప్రకటించిన వెంటనే దండి సత్యాగ్రహం మొదలైంది. ఉప్పు పన్ను బ్రిటిష్ రాజ్ పన్ను ఆదాయంలో 8.2% వరకూ ఉంటుంది. పేద భారతీయులకు చాలా భారంగా ఉండే పన్ను ఇది. ఉప్పు తయారీనే నిరసనకు, సత్యాగ్రహానికి తాను ఎందుకు ఎంపిక చేసిందీ వివరిస్తూ గాంధీ... "గాలి, నీరూ... ఆ తరువాత బహుశా ఉప్పే జీవితానికి అత్యవసరం" అని అని పేర్కొన్నారు. ఉప్పు చట్టాలను ధిక్కరించడం ద్వారా గాంధీ శాసనోల్లంఘనను ప్రారంభిస్తారని ఫిబ్రవరి 5 న వార్తా పత్రికలు రాసాయి. ఉప్పు సత్యాగ్రహం మార్చి 12 న అహ్మదాబాదు లోని సబర్మతి ఆశ్రమంలో ప్రారంభమై ఏప్రిల్ 6 న దండిలో ముగుస్తుందని పత్రికలు పేర్కొన్నాయి. ఉప్పు పన్నును ధిక్కరిస్తూ మహాత్మా గాంధీ,1930

మార్చి 12 నుండి 1930 ఏప్రిల్ 6 వరకు, 384 కిలోమీటర్ల దూరం, వేలమంది సత్యాగ్రహులతో కలిసి పాదయాత్ర చేసి గుజరాత్ లోని దండి వద్ద ఉప్పు తయారు చేసారు. శాసనోల్లంఘన ఉద్యమంలో ఎక్కువ మంది పాల్గొనేలా స్ఫూర్తినిచ్చే బలమైన ప్రారంభ ఘటనగా దండి యాత్ర ఉపయోగ పడింది. మహాత్మా గాంధీ తన 79 మంది సత్యాగ్రహ వాలంటీర్లతో సబర్మతి ఆశ్రమంలో ఈ యాత్రను ప్రారంభించారు. ఈ సత్యాగ్రహం ప్రారంభానికి కొన్నిరోజులకు ముందే బ్రిటిష్ వారు గాంధీని మార్చి 5, 1930 న అరెస్టు చేశారు. ఈ సత్యాగ్రహం దాదాపు ఒక సంవత్సర కాలం నడిచింది. ఈ సత్యాగ్రహం మూలంగా దాదాపు 80,000 వేలకు పైగా భారతీయులు కారాగారాల పాలయ్యారు. లక్షల కొద్దీ భారతీయులు స్వాతంత్రోద్యమం పట్ల ఆకర్షితులయ్యారు. దండి మార్చిలో మహాత్ముడితో పాటు 78 మంది అనుచరులు పాల్గొన్నారు. ఆంధ్ర ప్రాంతం నుంచి దండి మార్చిలో గాంధీతో పాటు నడిచిన ఏకైక తెలుగు వ్యక్తి యెర్నేని సుబ్రహ్మణ్యం. తర్వాత కాలంలో ఆయన గాంధీ సిద్ధాంతాలతో కొమరవోలులో ఒక ఆశ్రమాన్ని స్థాపించారు. నెల్లూరులో ఉప్పు సత్యాగ్రహం నిర్వహించిన దండు నారాయణ రాజును నాటి ప్రభుత్వం అరెస్టు చేసి జైల్లో పెట్టడంతో ఆయన అక్కడే మరణించారు. ఉప్పు సత్యాగ్రహం సమయం లోనే 'కవిరాజు' త్రిపురనేని రామస్వామి చౌదరి... "వీర గంధము తెచ్చినారము వీరులెవ్వరొ తెల్పుడి" అనే గేయ కవితను రాశారు. మాక్సిం గోర్కీ రాసిన రష్యన్ నవల 'ది మదర్'ను 'అమ్మ' పేరుతో తెలుగులోకి అనువదించిన క్రొవ్విడి లింగరాజు ఈ ఉద్యమ సమయంలోనే దేశ ద్రోహం నేరంపై జైలుకెళ్లారు. బ్రహ్మ జోస్యుల సుబ్రహ్మణ్యం సీతానగర ఆశ్రమాన్ని స్థాపించారు. దీన్నే 'ఆంధ్రా దండి'గా పిలుస్తారు. ఉప్పు సత్యాగ్రహం సందర్భం లోనే కేంద్ర శాసన సభకు రామదాసు పంతులు, శాసన మండలి సభ్యత్వానికి స్వామి వెంకటాచలం రాజీనామాలు చేశారు. ఉప్పు చట్టాలను ఉల్లఘించి బులుసు సాంబమూర్తి, ఉన్నవ లక్ష్మీనారాయణ ( మాలపల్లి నవల రచయిత), ఖాసా సుబ్బారావు లాఠీ దెబ్బలు తిన్నారు. టంగుటూరి ప్రకాశం పంతులు మద్రాసులోని తన నివాసం వేదవనంలో సత్యాగ్రహ కేంద్రాలను ఏర్పాటు చేశారు. విశాఖ పట్నంలో తెన్నేటి విశ్వనాథం, మచిలీ పట్నంలో అయ్యదేవర కాళేశ్వరరావు, రాయలసీమ పరిధిలో కల్లూరి సుబ్బారావు ఉప్పు సత్యాగ్రహానికి నాయకత్వం వహించారు. నెల్లూరులోని మైపాడు బీచ్‌లో బెజవాడ గోపాలరెడ్డి ఉప్పు తయారు చేసి ప్రజలకు అమ్మారు. అలా లక్షలాది మంది తమ సొంత ఉప్పును తయారు చేసుకున్నారు.

# అధికారమే లక్ష్యంగా గవర్నర్ల మార్పు!

**హైదరాబాద్ పెన్ పవర్:** ఐదు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలకు ఎన్నికల నోటిఫికేషన్ ప్రకటించేందుకు భారత ఎన్నికల కమిషన్ సిద్ధమవుతున్న సమయంలో గత వారం అకస్మాత్తుగా తొమ్మిది రాష్ట్రాల్లో జరిగిన గవర్నర్ల మార్పు రాజకీయ వర్గాలలో విస్మయం కలిగించింది. ముఖ్యంగా ఎన్నికలకు సిద్ధమవుతున్న పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కేరళ గవర్నర్‌లను మార్చడం ప్రాధాన్యత సంతరింప చేసుకుంది. గతంలో కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రభుత్వాలు రాజ్‌భవన్‌లను 'రాజకీయ పునరావాస కేంద్రాలు'గా మార్చారని విమర్శలు చెలరేగగా, ప్రస్తుతం అవి బిజెపి 'వార్‌రూమ్'లుగా మారినట్లు ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. ప్రజాస్వామికంగా ఎన్నికైన రాష్ట్ర ప్రభుత్వాలకు అడుగడుగునా అడ్డుపడుతూ, అసెంబ్లీలు ఆమోదించిన బిల్లులను ఆమోదింపకుండా, మంత్రివర్గం ఆమోదించిన ప్రసంగాలను అసెంబ్లీలలో చదవకుండా 'రాజకీయ పాత్రలు' వహిస్తూ ఉండటంతో ఈ వివాదాలు సుప్రీంకోర్టు ముందుకు కూడా వెళ్లడం పరిపాటిగా మారింది. ఈ నేపథ్యంలో పశ్చిమబెంగాల్ గవర్నర్ ఆనంద బోస్ అర్ధాంతరంగా రాజీనామా చేయడం, ఆయన స్థానంలో తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవిని నియమించడం రాజకీయ వర్గాలలో కలకలం రేకెత్తిస్తున్నది. ఈ మార్పులు 'పరిపాలన సామర్థ్యం' కోసం కాకుండా, లోతయిన రాజకీయ ఎత్తుగడలతో భాగంగానే జరిగిన్నట్లు సర్వత్రా విశ్వసిస్తున్నారు. ఐపిఎస్ అధికారిగా పనిచేసి, నాగాలాండ్‌లో తిరుగుబాటు వర్గాలతో శాంతి ఒప్పందం కుదర్చడంలో విజయవంతమై ప్రధాని నరేంద్ర మోడీ దృష్టిని రవి ఆకర్షించారు. నిఘా, జాతీయ భద్రతా విభాగాలలో పనిచేసిన అనుభవం ఉండడంతో సున్నితమైన నాగాలాండ్ గవర్నర్‌గా నియమించారు. అయితే, అక్కడ బిజెపి భాగస్వామిగాగల సంకీర్ణ ప్రభుత్వం ఆయన తీరు నచ్చక ఆయనను బదిలీ చేయాలని అసెంబ్లీలో ఏకగ్రీవంగా తీర్మానం చేయడంతో ఆయనను తమిళనాడు గవర్నర్‌గా నియమించి 'పదవోన్నతి' కల్పించారు. తమిళనాడులో అసెంబ్లీ ఆమోదించిన సుమారు 20 బిల్లులను ఆమోదించకుండా తన వద్దే ఉంచుకోవడంతో అక్కడి ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించాల్సి వచ్చింది. గవర్నర్ చర్యను 'చట్టవ్యతిరేకం' అంటూ అత్యున్నత న్యాయస్థానం చివాట్లు పెట్టింది. ముఖ్యమంత్రి ఎంకెస్టాలిన్ ప్రతిపాదించిన ఓ మంత్రితో ప్రమాణ స్వీకారం చేయించేందుకు నిరాకరించడంతో రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించాల్సి వచ్చింది.

ఎన్నికైన ప్రభుత్వ నిర్ణయాలను అడ్డుకునే అధికారం గవర్నర్‌లకు లేదని ధర్మాసనం స్పష్టం చేయడంతో ఆయన చివరకు ప్రమాణస్వీకారం చేయించారు. ప్రస్తుతం ఎన్నికలు జరుగుతున్న ఐదు రాష్ట్రాలలో బిజెపి అధికారంలో ఉన్న అసోంలో మరోసారి గెలుస్తామని ధీమాతో ఉండగా, కేవలం పశ్చిమబెంగాల్‌లో మాత్రమే ఎట్లాగైనా అధికారంలోకి రావాలనే పట్టుదలతో ఉంది. ఉత్తరాదిన, ఈశాన్య రాష్ట్రాలలో దాదాపు అన్ని రాష్ట్రాలలో బిజెపి ప్రభంజనం వీస్తున్నా ఈ రాష్ట్రంలో మాత్రం అధికారంలోకి రాలేకపోతున్నది. గత ఎన్నికలలో అధికారంలోకి వచ్చేందుకు అన్ని అస్త్రాలు ప్రయోగించినా కాంగ్రెస్, సిపిఎంలను పక్కకు నెట్టి ప్రధాన ప్రతిపక్షంగా మాత్రమే చోటు సంపాదింపగలిగింది. అందుకనే, ఈ పర్యాయం లోక్‌భవన్ కేంద్రంగా అధికారంలోకి వచ్చేందుకు వ్యూహంలో భాగంగా అందుకు సమర్థుడని భావించి ఆర్ఎన్ రవిని ఇక్కడకు బదిలీ చేసినట్లు పలువురు భావిస్తున్నారు. గవర్నర్‌ల మార్పును ప్రకటించేందుకు కొన్ని గంటల ముందే బెంగాల్ గవర్నర్ ఆనంద్ బోస్ తన రాజీనామాను ప్రకటించారు. ఢిల్లీలో పెద్దలను కలిసేందుకు వెళ్లిన ఆయన అకస్మాత్తుగా ఈ నిర్ణయం ప్రకటించారు. అందుకు ఎటువంటి కారణాలు ప్రకటించలేదు. కేవలం 'వ్యక్తిగత, ఆరోగ్య' కారణాలు అంటూ పొడిపొడిగా చెప్పుకొచ్చారు. నిబంధనలకు విరుద్ధంగా మమతా ప్రభుత్వాన్ని ఎన్నికల సమయంలో ఇరకాటంలో పడవేయలేరనే ఆయనను అర్ధాంతరంగా బదిలీ చేసినట్లు పలువురు భావిస్తున్నారు. మే, 2025లో రాజ్‌భవన్‌లో ఓ తాత్కాలిక మహిళా ఉద్యోగిని తనను గవర్నర్ లైంగికంగా వేధించారని చేసిన ఆరోపణలు దేశవ్యాప్తంగా కలకలంరేపాయి. ఆ ఆరోపణలకు సంబంధించిన కేసు ఇంకా పోలీసులవద్దే ఉంది. అందుకనే మమతా ప్రభుత్వం పట్ల కఠినంగా వ్యవహరింపలేదని బిజెపి అధిష్టానం భావించి, ఆయనకు ఉద్వాసన పలికినట్లు తెలుస్తున్నది. అయితే, లోక్‌భవన్‌ను 'బిజెపి వార్‌రూమ్'గా మార్చితే తమిళనాడులో ఎంకె స్టాలిన్ సహనంతో, మర్యాదగా వ్యవహరించారు. న్యాయస్థానాలకు వెళ్లారు గాని గవర్నర్‌ను వీధులలో నిలదీసే ప్రయత్నం చేయలేదు. కానీ, మమతా రాజకీయ ప్రస్థానం వీధి పోరాటాల నుండి వచ్చింది. ఆమె ఇడీ, సిబిఐ కార్యాలయాలపై దాడులకు సైతం వెనకాడటం లేదు. చివరకు ఎన్నికల కమిషన్‌ను సుప్రీంకోర్టులో దోషిగా నిలబెట్టి, తానే స్వయంగా వాదించారు. స్టాలిన్‌తో వ్యవహరించినట్లు ఆమెతో వ్యవహరిస్తే ఆమె గాండ్రిస్తారు. ఇప్పటికే బిజెపి నేతలను 'బైటవారు', తాను 'బెంగాల్ కుమార్తె' అంటూ రాజకీయ ప్రజలలో గుర్తింపు పొందుతున్న ఆమెను ప్రజలకు మరింత దగ్గర చేసేందుకే రవి దోహదపడే ప్రమాదం కూడా లేకపోలేదు. ముఖ్యంగా ఎన్నికల ప్రకటన వెలువడగానే రాష్ట్ర ప్రభుత్వం విధానపరమైన నిర్ణయాలు తీసుకోలేదు. మొత్తం ప్రభుత్వ యంత్రాంగం ఎన్నికల కమిషన్ పర్యవేక్షణలో ఉంటుంది. పరోక్షంగా గవర్నర్ అజమాయిషీలో ఉంటుంది.

ఆ విధంగా మమతను ఓడించేందుకు లోక్‌భవన్ నుండి రవి ద్వారా పావులు కదిపేందుకు బిజెపి ఎత్తుగడగా కనిపిస్తున్నది. ఇప్పుడు బిజెపి ఎన్నికలలో విజయం కోసం ఓటర్లపై, బాలట్ బాక్స్ లపై కాకుండా ఎన్నికల కమిషన్, గవర్నర్లపై ఎక్కువగా ఆధారపడుతున్నట్లు విమర్శలు వస్తున్నాయి. ఎన్నికలు జరిగే రాష్ట్రాలలో ఎన్నికల కమిషన్ ఓటర్ల జాబితా ప్రక్షాళన పేరుతో చేపట్టిన ఎస్ఐఆర్‌ను సైతం ఈ దృష్టాంతంతోనే చాలామంది చూస్తున్నారు. అయితే, బిజెపికి క్షేత్రస్థాయిలో ప్రజలలో పట్టగలిగిన నాయకత్వం, ప్రజాకర్షణ కలిగిన నాయకత్వం లేకపోవడంతో కేంద్రం ఎన్ని ఎత్తుగడలు వేసినా అవి వికటించి, ప్రతికూలంగా మారుతున్నాయని విషయాన్ని మరచిపోతున్నారు. ఎస్ఐఆర్ పక్రియ ద్వారా లక్షల సంఖ్యలో ఓటర్లను తొలగించగా, బెంగాల్‌లో గత ఎన్నికలలో గెలిచినా అభ్యర్థికి వచ్చిన మెజారిటీ ఓట్లకు మించి ఎక్కువ ఓట్లను 35 నియోజకవర్గాలలో తొలగించారని చెబుతున్నారు. ఆ విధంగా ఆయా నియోజక వర్గాలలో ఫలితాలను తారుమారు చేయాలనే వ్యూహం కనిపిస్తుంది. అయితే, ఆ విధంగా ఓట్లు తొలగించిన 35 నియోజకవర్గాలలో 22 బిజెపి అభ్యర్థులు గెలుపొందిన నియోజక వర్గాలు కావడం గమనార్హం. అంటే ఎస్ఐఆర్ ప్రక్రియ బిజెపి అభ్యర్థులకు ప్రతికూలంగా మారే ప్రమాదం ఉంది. పైగా, గత అసెంబ్లీ ఎన్నికల తర్వాత బెంగాల్‌లో బిజెపి అంతర్గత కుమ్ములాటలతో బలహీనం అవుతూ వస్తున్నది. పలువురు కీలక నాయకులు పార్టీని విడిచిపెట్టారు లేదా క్రియాశీలకంగా పనిచేయడం లేదు. ఆ ఫలితంగానే 2024 లోక్‌సభ ఎన్నికలలో

ఆ పార్టీ ఎంపిల సంఖ్య 18 నుండి 12కు తగ్గింది. దశాబ్దాలుగా పార్టీకోసం పనిచేస్తున్న నాయకులకు, ఇటీవల పార్టీలో చేరిన నాయకులకు మధ్య సయోధ్య కనిపించడం లేదు. కేంద్ర నాయకత్వం ఎంతగా ప్రయత్నిస్తున్నా ఐకమత్యంగా వారితో పనిచేయించడం కనిపించడం లేదు. కేంద్రం నిధులు ఇవ్వకపోయినా పలు సంక్షేమ కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేస్తున్నట్లు మమతా ప్రజలకు దగ్గరవుతున్నారు. ముఖ్యంగా మహిళలో ఆమె తిరుగులేని నాయకురాలు. మమత 'స్థానిక– బయటివారు' ప్రచారంతో ఇతర రాష్ట్రాలలో మాదిరిగా ప్రధాని మోడీ, అమిత్ షా వంటి నేతల ప్రచారం ఈ రాష్ట్రంలో బిజెపికి ప్రతికూలంగా మారే ప్రమాదం ఉంది.

# ఎన్డీయేకు జై కొట్టిన జగన్

**విజయవాడ, మార్చి 11, పెన్ పవర్:**
జాతీయస్థాయిలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మరోసారి చర్చకు వచ్చింది. ఆ పార్టీ ఇప్పుడు సంక్లిష్ట పరిస్థితిని ఎదుర్కొంటోంది. జాతీయస్థాయిలో మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో లోక్సభ స్పీకర్ ఓం బిర్లాపై విపక్ష ఎంపీలు అవిశ్వాస తీర్మానం నోటీసు ఇచ్చారు. ఇండియా కూటమి అంతా ఈ తీర్మానానికి మద్దతు ప్రకటించింది. తృణమూల్ కాంగ్రెస్ సైతం తమ మద్దతు పై ప్రకటన చేసింది. దీనిపై పార్లమెంట్లో చర్చ జరగనుంది. ప్రభుత్వ సమాధానం తర్వాత ఓటింగ్ నిర్వహిస్తారు. అయితే ఇప్పుడు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అవిశ్వాసానికి మద్దతు ఇస్తుందా? వ్యతిరేకిస్తుందా అనేది హాట్ టాపిక్. ఒక విధంగా ఇది ఆ పార్టీకి సంక్లిష్ట సమస్య. అవిశ్వాసానికి మద్దతు ఇస్తే బిజెపి ఆగ్రహానికి గురికాక తప్పదు. ఒకవేళ వ్యతిరేకిస్తే మాత్రం జాతీయస్థాయిలో ఆ పార్టీకి స్నేహితులు అనేవారు కరువు అవుతారు.వైసీపీ నిర్ణయంపై హాట్ డిస్కషన్.. ఆంధ్రప్రదేశ్ కు సంబంధించి 21 మంది కూటమి ఎమ్మెల్యేలు ఉన్నారు. వీరంతా ఎన్డీఏ కు మద్దతుగా ఉంటారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి నలుగురు ఎంపీలు ఉన్నారు. కచ్చితంగా వీరు ఏదో ఒక నిర్ణయం తీసుకోవాల్సిన అనివార్య పరిస్థితి. పోనీ తెలంగాణలో కెసిఆర్ పార్టీకి ఎంపీలు ఉన్నారా అంటే లేరు. దీంతో ఆ పార్టీకి వచ్చిన ఇబ్బందులు ఏమీ లేవు. 17 మంది ఎంపీలకు గాను చెరి సగం ఎంపీలు కాంగ్రెస్ పార్టీతో పాటు బిజెపి పంచుకున్నాయి. ఎంఐఎం కు ఒక్క ఎంపీ ఉన్నారు. అయితే ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నిర్ణయం ఏంటి అనేది హాట్ టాపిక్.గతంలో ఉపరాష్ట్రపతి త పాటు స్పీకర్ ఎన్నికల



సమయంలో ఎన్డీఏ అభ్యర్థికి మద్దతు ఇచ్చింది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. తాజాగా జగన్మోహన్ రెడ్డి తన పాత కేసుల విషయంలో బెంగళూరు వేదికగా కీలక చర్చలు జరుపుతున్నట్లు వార్తలు వచ్చాయి. మద్యం కుంభకోణం, వివేకానంద రెడ్డి హత్య కేసు, జగన్ పై ఉన్న పాత కేసులు తెరపైకి వస్తున్న నేపథ్యంలో.. జగన్మోహన్ రెడ్డి కచ్చితంగా ఎన్డీఏకు మద్దతుగా నిలుస్తారన్న వారే అధికం. పార్టీ ఎంపీలతో ఇప్పటికే సమావేశం నిర్వహించారు జగన్మోహన్ రెడ్డి. సూత్రప్రాయంగా ఎన్డీఏకు మద్దతు ఇచ్చేందుకు ఒక నిర్ణయం తీసుకున్నట్లు ప్రచారం నడుస్తోంది. ఒకవైపు బిజెపి భాగస్వామిగా ఉన్న కూటమికి వ్యతిరేకంగా ఉంటూనే.. తెలుగుదేశం పార్టీ కీలక భాగస్వామిగా ఉన్న ఎన్డీఏకు జగన్మోహన్ రెడ్డి మద్దతు తెలపడం మాత్రం జాతీయస్థాయిలో హాట్ టాపిక్ అవుతోంది. ఇది ఆ పార్టీకి ఇబ్బందికరమని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు

# కేడర్ లో అసంతృప్తి..

**కాకినాడ, మార్చి 11, పెన్ పవర్:**
జనసేన పార్టీఆవిర్భావ దినోత్సవం అంటే ఆ పార్టీ కేడర్‌కు ఒక పండగ. అణచివేతను ఎదిరించి, ప్రశ్నించే గొంతుకగా పదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంలో, ఈసారి పిఠాపురం వేదికగా జరిగే వేడుకలు రాజకీయంగా పెను సంచలనం సృష్టిస్తాయని అందరూ భావించారు. కానీ, అనూహ్యంగా పార్టీ అధిష్టానం ఈ వేడుకలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించడం జనసైనికులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది.రాష్ట్ర రాజకీయాల్లో జనసేన గ్రాఫ్ పెరుగుతున్న తరుణంలో, ఈ నెల 14న పిఠాపురంలో జరగాల్సిన పార్టీ ఆవిర్భావ సభ రద్దు కావడం చర్చనీయాంశంగా మారింది. స్వయంగా అధినేత పవన్ కల్యాణ్ గతంలో ఇచ్చిన హామీ ప్రకారం.. ఈ సభ పార్టీ బలోపేతానికి ఒక దిక్సూచిలా మారుతుందని కేడర్ ఎంతో ఆశగా ఎదురుచూసింది. కానీ, ప్రస్తుత నిర్ణయం కార్యకర్తల ఉత్సాహంపై నీళ్లు చల్లిందనే చెప్పాలి.పార్టీ అధికారికంగా చెబుతున్న ప్రధాన కారణం సభ్యత్వ నమోదు. ఇప్పటివరకు దాదాపు 8.70 లక్షల మంది సభ్యత్వం తీసుకున్నారు. సభ్యత్వ నమోదు గడువు రేపటితో ముగియాల్సి ఉన్నా, లక్ష్యాన్ని చేరుకోవడానికి ఈ గడువును పొడిగించే ఆలోచనలో అధిష్టానం ఉంది. క్షేత్రస్థాయిలో పార్టీ బలాన్ని నిరూపించుకోవాలంటే గణాంకాలు ముఖ్యం కాబట్టి, సభ ఏర్పాట్ల కంటే

సభ్యత్వాలపైనే పూర్తి దృష్టి పెట్టాలని పవన్ భావిస్తున్నట్లు తెలుస్తోంది.అయితే సభ రద్దు వెనుక ఇతర బలమైన కారణాలున్నాయని సమాచారం. సభ్యత్వ నమోదుతో పాటు మరికొన్ని అంశాలు కూడా ఇందుకు దోహదం చేసినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం రాష్ట్రంలో ఎండలు మండుతున్నాయి. వేలాదిగా తరలివచ్చే కేడర్‌కు ఎండ దెబ్బ తగలకుండా చూడటం అధినేత బాధ్యతగా భావిస్తున్నారు. రాష్ట్రంలో జరిగిన కల్తీ పాలు, బాణాసంచా పేలుడు ఘటనలు పార్టీ వర్గాల్లో కొంత ఆవేదనను నింపాయి. ఇలాంటి సమయంలో భారీ వేడుకలు నిర్వహించడం సబబు కాదని పార్టీ భావించి ఉండవచ్చు. పిఠాపురం పవన్ కల్యాణ్ సొంత నియోజకవర్గం కావడంతో, అక్కడ ఎలాంటి అపశ్రుతులు జరగకూడదని, అత్యంత పకడ్బందీగా మరోసారి పెద్ద ఎత్తున కార్యక్రమం నిర్వహించవచ్చని పార్టీ వర్గాలు అంటున్నాయి.జనసేన పార్టీకి భావోద్వేగాలే బలం. పవన్ కల్యాణ్ పిలుపు కోసం ఎదురుచూసే లక్షలాది మంది యువత, పిఠాపురం వేదికగా ఆయన ఇచ్చే పొలిటికల్ స్పీచ్

కోసం సిద్ధమయ్యారు. పార్టీని బలోపేతం చేసే క్రమంలో ఇలాంటి భారీ బహిరంగ సభలు కార్యకర్తల్లో కొత్త జోష్ నింపుతాయి. ఇప్పుడు సభ రద్దు కావడంతో, క్షేత్రస్థాయిలో కేడర్ డీలా పడిపోయింది. పార్టీ బలోపేతం ముఖ్యమే కానీ కార్యకర్తల ఆత్మీయ కలయిక కూడా అంతే ముఖ్యమనేది సగటు జనసైనికుడి ఆవేదన.నిర్ణయం కఠినంగా ఉన్నా, పార్టీ దీర్ఘకాలిక ప్రయోజనాల దృష్ట్యా పవన్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు కనిపిస్తోంది. సభ రద్దుతో వచ్చిన అసంతృప్తిని పోగొట్టాలంటే, సభ్యత్వ నమోదులో రికార్డు సృష్టించడమే కాకుండా, త్వరలోనే మరో భారీ మేనిఫెస్టో సభ లేదా ప్లీనరీ లాంటి కార్యక్రమాన్ని ప్రకటించాల్సిన అవసరం ఉంది.

# లిక్కర్ స్కాంలో ఆస్తుల అటాచ్







**విజయవాడ, మార్చి 11, పెన్ పవర్:**
ఆంధ్రప్రదేశ్ లిక్కర్ స్కామ్ లో ఈడీ దూకుడు పెంచింది. మాజీ సీఎం జగన్ తరపున పనులు చక్కబెట్టారన్న ఆరోపణలున్న వారిని ఈడీ పిలిచి ప్రశ్నిస్తోంది. ఇప్పటికే వెయ్యి కోట్ల మనీలాండరింగ్ ను గుర్తించినట్లుగా చెప్పి నాలుగు వందల కోట్లకు పైగా ఆస్తులను అటాచ్ చేసింది. సిట్ దర్యాప్తుపై వైసీపీ తీవ్ర విమర్శలుచేసింది. అసలు మద్యం స్కామే లేదని అంతా సృష్టిస్తున్నారని ఆరోపించింది. కానీ ఈడీ దర్యాప్తుపై మాత్రం నోరు మెదపడం లేదు. ఎందుకు మౌనంగా ఉంటున్నారు? ఆంధ్రప్రదేశ్ మద్యం స్కాంలో జరిగిన సుమారు రూ. 4,000 కోట్ల కుంభకోణం కేసులో ఈడీ తన పట్టును బిగిస్తోంది. ఏకంగా రూ. 441.63 కోట్ల విలువైన ఆస్తులను అటాచ్ చేయడం రాష్ట్ర రాజకీయాల్లో కలకలం రేపింది. ఇందులో ప్రధాన నిందితుడు రాజ్ కేసిరెడ్డి, బూనేటి చాణక్య, వాసుదేవరెడ్డి వంటి వారి స్థిరాస్తులు, బ్యాంక్ నిల్వలు ఉన్నాయి. ఇప్పటివరకు దాదాపు రూ. 1,048 కోట్ల మేర ముడుపులు చేతులు మారినట్లు ఈడీ నిర్ధారించింది. మద్యం తయారీదారుల నుంచి బలవంతంగా నగదు, బంగారం వసూలు చేశారని, ఆ సొమ్మును షెల్ కంపెనీల ద్వారా మళ్లించారని దర్యాప్తు సంస్థ గట్టి ఆధారాలు సేకరించింది.గతంలో రాష్ట్ర ప్రభుత్వం నియమించిన సిట్ దర్యాప్తు చేపట్టినప్పుడు వైఎస్సార్సీపీ నేతలు తీవ్రంగా స్పందించాయి. అదంతా రాజకీయ కక్ష సాధింపు అని, టీడీపీ ప్రభుత్వం కావాలనే అబద్ధపు కేసులు సృష్టిస్తోందని ఆరోపించాయి. కానీ, ఇప్పుడు ఈడీ రంగంలోకి దిగి ఆస్తులను జప్తు చేస్తున్నా, నోటీసులు జారీ చేస్తున్నా వైఎస్సార్సీపీ అగ్రనాయకత్వం నుంచి ఆ స్థాయిలో ఖండనలు రావడం లేదు. సిట్‌ను విమర్శించినట్లుగా ఈడీని విమర్శించలేకపోవడం వెనుక పెద్ద రాజకీయ వ్యూహం , భయం దాగి ఉన్నాయన్న అభిప్రాయం వినిపిస్తోంది. కేంద్ర దర్యాప్తు సంస్థ అయిన ఈడీని నేరుగా టార్గెట్ చేస్తే అది ఢిల్లీ స్థాయిలో రివర్స్ అవుతుందనే ఆందోళన వైఎస్సార్సీపీలో కనిపిస్తోందని చెబుతున్నారు. అందుకే సిట్‌ను రాష్ట్ర ప్రభుత్వ విభాగంగా ముద్ర వేసి తిట్టగలిగిన వారు, ఈడీ దగ్గరకు వచ్చేసరికి మౌనంగా ఉండిపోతున్నారు. ఈడీ తన దర్యాప్తులో మనీ లాండరింగ్ ఆధారాలతో చర్యలు తీసుకోవడం వైఎస్సార్సీపీకి గట్టి ఎదురుదెబ్బ. కేవలం రాజకీయ ఆరోపణలైతే ప్రజల్లో సానుభూతి పొందవచ్చు, కానీ వందల కోట్ల ఆస్తులను జప్తు చేయడం, నగదు లావాదేవీలను సాక్ష్యాలతో సహా చూపడం వంటివి ప్రజల్లో పార్టీ ప్రతిష్టను దెబ్బతీస్తాయి. ఈ స్కామ్‌లో ఇప్పటికే జగన్ కు అత్యంత సన్నిహితులుగా

వ్యవహరించిన వారిని పిలిచి ప్రశ్నించారు ఈడీ అధికారులు. ఐదేళ్ల పాటు వైసీపీ హయాంలో పూర్తి స్థాయిలో చక్రం తిప్పిన మాజీ ఐఏఎస్ ధనుంజయ్ రెడ్డి, జగన్ వ్యక్తిగత పీఏ కృష్ణమోహన్ రెడ్డి వంటి వారిని పిలిపించి.. గత పదేళ్ల బ్యాంక్ స్టేట్‌మెంట్లు, పాన్ కార్డులు, కుటుంబ సభ్యుల పేరు మీద ఉన్న ఆస్తుల డాక్యుమెంట్లను తీసుకున్నారు. అలాగే జగన్‌కు మరో అత్యంత సన్నిహితుడిగా గుర్తింపు పొందిన విజయవాడ జిల్లా జైలులో ఉన్న ఏ1 నిందితుడు రాజ్ కేసిరెడ్డిని కోర్టు అనుమతితో విచారించి కీలక వాంగ్మూలాన్ని నమోదు చేశారు. ఆయన ఇచ్చిన సమాచారం ఆధారంగానే ప్రస్తుతం ఇతర అధికారులకు, రాజకీయ అనుచరులకు నోటీసులు వెళ్తున్నాయి. ఈ అంశంపై విమర్శలు గుప్పించడం కన్నా. ..సైలెంట్ గా ఉండటమే మంచిదని వైసీపీ భావిస్తున్నట్లుగా కనిపిస్తోంది.

# పార్టీ తోడు లేకుంటే మీరంతా ఎక్కడ.. చంద్రబాబు క్లాస్!

**విజయవాడ, మార్చి 11, పెన్ పవర్:** టీడీపీ అధినేత చంద్రబాబు. వివాదాస్పదంగా మారిన ఎమ్మెల్యేలకు తనదైన శైలిలో చెక్ చెప్పారు. అందరూ బుద్ధిగా ప్రవర్తించాలని లేకుంటే వేటు తప్పదని స్వీట్ గా హెచ్చరించారు. ప్రజలు కూటమి సర్కార్ పై నమ్మకముంచి గెలిపించారని.. లేదంటే మీరంతా ఎక్కడుండేవారు గుర్తుచేసుకోవాలన్నారు. ప్రధాని నరేంద్రమోడీ, తాను, పవన్ కల్యాణ్.. కలిసికట్టుగా సాగుతుంటే.. మీరు మాత్రం లేనిపోని వివాదాలతో కాలం గడుపుతున్నారని హెచ్చరించారు.చంద్రబాబు అసెంబ్లీ వేదికగానే ఎమ్మెల్యేలకు ఏకమొత్తంగా క్లాస్ ఇచ్చేశారు. ఎవరికివారు తామే బలవంతులం అనుకుంటున్నారని, అలా అయితే 2019లో ఎందుకు పరాజయం పాలయ్యారో ఆలోచించుకోవాలని చురకలు అంటించారు. తాను, పవన్ కళ్యాణ్, మోడీ ముగ్గురు కలిస్తేనే ప్రజలు విశ్వసించి ఓట్లేశారని, ఈ కూటమి సజావుగా సాగేందుకు నాయకులు కూడా కలిసి ఉండాలని తేల్చి చెప్పారు. అంతేకాదు, ఎవరైనా తమకు సొంత బలం ఉంటుందని అనుకుంటే తనకు ఎలాంటి అభ్యంతరం లేదన్నారు.కూటమిలో ఉన్న పవన్, మోడీ, తాను ప్రజలకు మరింత చేరువ అవుతున్నామని, క్షేత్రస్థాయిలో నాయకులు కీచులాడుకోవడం వస్తే అది వారికే నష్టమని వ్యాఖ్యానించారు. కలివిడిగా ఉంటేనే రాష్ట్రానికి మేలు జరుగుతుందన్నారు. ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకునే ప్రయత్నం చేయాలని అన్నారు. అలాకాదని అనుకుంటే అప్పుడు తెలుస్తుందని పరోక్షంగా హెచ్చరించారు. కూటమిగా ఉండాల్సిన అవసరం అందరికీ ఉంటుందని వ్యాఖ్యానించారు.నేతలు తమంత వారు లేరని భావిస్తున్న నేపథ్యంలో క్షేత్రస్థాయిలో వివాదాలు కూడా అదేవిధంగా కొనసాగుతున్నాయి. గతం నుంచి వివాదాలకు దిగుతున్న నేతలు కొందరు అయితే, కొత్తగా మరికొందరు వివాదాలకు కేంద్రంగా మారుతున్నారు. దీంతో పైస్థాయిలో కూటమి నాయకుల మధ్య ఐక్యత ఉన్నప్పటికీ, గ్రౌండ్ లెవెల్లో మాత్రం ఒకింత ఇబ్బందికర పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి.

# వివేకా హత్య కేసుపై సుప్రీంకోర్టులో విచారణ.. 4 వారాల్లోనే తీర్పు!



**విజయవాడ, మార్చి 11, పెన్ పవర్:** మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసుపై సుప్రీంకోర్టు కీలక నిర్ణయం వెలువరించింది. కేసు దర్యాప్తు ముగిసినట్లు సీబీఐ స్పష్టం చేయడంతో విచారణ వేగవంతం చేయాలని దిగువ కోర్టుకు సూచించింది. నాలుగు వారాల్లో అన్ని పిటిషన్లపై విచారణ పూర్తి చేయాలని స్పష్టం చేసింది. వివేకా కేసులో దర్యాప్తును మధ్యలోనే నిలిపివేశారని, హత్యతో మరికొందరికి సంబంధం ఉందని వివేకా కుమార్తె వైఎస్ సునీత గతంలో సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీనిపై సుప్రీంకోర్టు సూచన మేరకు నాంపల్లి సీబీఐ కోర్టు కేసు దర్యాప్తును తిరిగి ప్రారంభించాలని సీబీఐని ఆదేశించింది. దీనిపై సీబీఐ దర్యాప్తు జరిపినా కొత్తగా నిందితులుగా ఎవరినీ గుర్తించలేదని సుప్రీంకోర్టుకు నివేదించింది.సీబీఐ పిటిషన్ పై విచారణ జరిపిన సుప్రీంకోర్టు వివేకా కేసులో ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే ట్రయల్ కోర్టును ఆశ్రయించాలని సూచిస్తూ వివేకా కుమార్తె వైఎస్ సునీత వేసిన పిటిషన్లను పరిష్కరించింది. నిందితుల బెయిల్ పిటిషన్ల రద్దు చేయాలన్న సునీత వినతిని సర్వోన్నత న్యాయస్థానం తిరస్కరించింది. అంతేకాకుండా తాము లేవనెత్తిన అభ్యంతరాలపై దర్యాప్తు జరపలేదని సునీత అభ్యంతరంపై ట్రయల్ కోర్టునే ఆశ్రయించాలని సూచించింది. వివేకా హత్య కేసుకు సంబంధించి సెక్షన్ 207 కింద దాఖలైన అన్ని పిటిషన్లను నాలుగు వారాల్లో పరిష్కరించాలని ట్రయల్ కోర్టును సుప్రీం ధర్మాసనం ఆదేశించింది.కాగా, సీబీఐ నిర్ణయంతో ఈ విషయంలో వివేకా కుమార్తె సునీతకు ఎదురుదెబ్బ తగిలినట్లుగా భావిస్తున్నారు. కేసులో ఇప్పటికే గుర్తించిన నిందితులతోపాటు మరికొందరికి సంబంధం ఉందని సునీత అనుమానిస్తున్నారు. తన అనుమానాలను నివృత్తి చేయాలని కోరుతూ కోర్టుల్లో న్యాయపోరాటం చేస్తున్నారు. దీంతో హత్య కేసు ట్రైల్ కూడా ఆలస్యమవుతోందని అంటున్నారు. దర్యాప్తు పూర్తయిందని, నిందితులు అందరినీ అరెస్టు చేశామని సీబీఐ చెబుతూ వస్తోంది. అదే సమయంలో సునీత అభ్యంతరాలను అనుమానాలను పరిష్కరించేందుకు ట్రయల్ కోర్టు సూచనల మేరకు నిందితుడు సునీల్ యాదవ్ సోదరుడు కిరణ్ యాదవ్, మాజీ సీఎం జగన్ బంధువు అర్జున్ రెడ్డిని విచారించింది.ఈ విచారణలో కొత్త విషయాలు ఏవీ వెలుగు చూడలేదని సీబీఐ తాజాగా సుప్రీంకోర్టుకు నివేదించింది. దీంతో సునీత అనుమానాలు అపోహలుగానే మిగిలిపోయాయని అంటున్నారు. హత్యకు సంబంధించి ట్రయల్ కోర్టులో మూడో చార్జిషీటును కూడా సీబీఐ సమర్పించడంతో దర్యాప్తు పూర్తయిందని సుప్రీంకోర్టు నిర్ణయించిందని అంటున్నారు. ఇకపై ఎలాంటి దర్యాప్తు అవసరం లేదని భావించడమే కాకుండా, విచారణ వేగవంతం చేయాలని ఆదేశించింది. వివేకా హత్య జరిగి ఇప్పటికే ఆరేళ్లు దాటిపోయింది. ఇప్పటికే నిందితుల అరెస్టు జరగడం, చార్జిషీటులు దాఖలు కావడంతో బెయిలు రద్దు పిటిషన్లను కోర్టు కొట్టివేసింది. ఈ పరిస్థితుల్లో నాలుగు వారాల గడువులోగా 207 కింద దాఖలైన అన్ని పిటిషన్లను పరిష్కరించే పరిస్థితి కనిపిస్తుండటంతో త్వరలో వివేకా కేసుపై విచారణ ముగుస్తుందని అంచనా వేస్తున్నారు.

# ఏపీలో 'ఇంద్రధనస్సు'.. విశేషాలు ఇవే!




**విజయవాడ, మార్చి 11, పెన్ పవర్:** ఏపీలో ఇంద్ర ధనస్సు.. అంటే ప్రకృతి పరంగా ఆకాశంలో ఏర్పడే ఇంద్ర ధనస్సుకాదు.. ప్రభుత్వ పరంగా పేదలను ఆదుకునేందుకు తీసుకువచ్చిన కీలక పథకం. దీని కి సీఎం చంద్రబాబు వినూత్నంగా ఉండాలన్న ఉద్దేశంతో 'ఇంద్రధనస్సు'గా పేరు పెట్టారు. ఈ కార్యక్రమం కింద.. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న దివ్యాంగులకు.. ఎంపిక చేసిన ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పిస్తారు.తాజాగా జరుగుతున్న 6వ కలెక్టర్ల సదస్సులో సీఎం చంద్రబాబు స్వయంగా ఈ పథకాన్ని ప్రకటించారు. గత కొన్నాళ్లుగా దివ్యాంగుల నుంచి వస్తున్న అభ్యర్థన మేరకు.. ఈ ప్రతిపాదనపై నిర్ణయం తీసుకున్నట్టు వివరించారు. వాస్తవానికి ఇప్పటికే మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం అందుబాటులో ఉంది. దివ్యాంగు లైన మహిళలు ఈ సేవలు పొందుతున్నారు. అయితే..పురుషుల సమస్య ప్రభుత్వానికి విన్నవించారు. ఈ క్రమంలో దివ్యాంగులైన వారు ఎవరైనా.. ఉచితంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించేందుకు అవకాశం కల్పించారు.ఈ క్రమంలోనే వినూత్నంగా ఉండే ఉద్దేశంతో ఈ కార్యక్రమానికి.. ఇంద్రధనస్సు అని పేరు నిర్ధారించినట్టు.. సీఎం చంద్రబాబు ప్రకటించారు. రాష్ట్రంలో ఎంపిక చేసిన బస్సుల్లో దివ్యాంగులు. ఉచితంగా ఎక్కడ నుంచి ఎక్కడికైనా.. తమ ఆధార్ కార్డును చూపించి ప్రయాణించవచ్చని.. తెలిపారు. దీనికి సదరం సర్టిఫికెట్ కూడా ఇస్తున్నట్టు తెలిపారు. ప్రస్తుతం 1.5 కోట్ల మంది మహిళలు స్త్రీశక్తి పేరిట అమలు చేస్తున్న ఉచిత ఆర్టీసీ బస్సులను వినియోగించుకుంటున్నారని తెలిపారు.వీరితోపాటు.. విద్యార్థులు, ఇప్పుడు దివ్యాంగులకు కూడా ఉచిత ఆర్టీసీ సేవలను అందుబాటులోకి తీసుకు వస్తున్నామన్నారు. దివ్యాంగులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంలోనూ.. వారిని విదేశాలకు పంపించి .. చదివించడంలోనూ టీడీపీ కూటమి ప్రభుత్వం ముందుందని తెలిపారు. వృత్తులను కూడా ప్రోత్సహిస్తు న్నామని చెప్పారు. ట్రైసైకిళ్లతోపాటు.. ట్రైస్కూటీలను కూడా పంపిణీ చేయనున్నట్టు తెలిపారు. దివ్యాంగులకు అండగా ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతోందని వివరించారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

# అమెరికా దౌత్య మద్దతు కేంద్రంపై దాడిచేసిన ఇరాన్

**హైదరాబాద్ పెన్ పవర్:** ఫిబ్రవరి 28న ప్రారంభమైన ఇరాన్, అమెరికా-ఇజ్రాయెల్ మధ్య యుద్ధం నేటికీ 12వ రోజుకు చేరుకుంది. బుధవారం తెల్లవారుజామున ఇరాక్ రాజధాని బాగ్దాద్ అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలోని అమెరికా దౌత్య మద్దతు కేంద్రం (ఃఆూఅ)పై డ్రోన్ల దాడి జరిగింది. మొత్తం ఆరు డ్రోన్లు ఈ కేంద్రాన్ని లక్ష్యంగా చేసుకోగా, ఐదింటిని అమెరికా రక్షణ వ్యవస్థలు గాలిలోనే కూల్చివేశాయి. అయితే, ఒక డ్రోన్ మాత్రం కార్యాలయ ప్రాంగణాన్ని తాకడంతో స్వల్ప నష్టం వాటిల్లింది. ఈ దాడిలో ఎవరికీ గాయాలు కాలేదని ప్రాథమిక సమాచారం.బుధవారం సూర్యోదయానికి ముందే ఇరాన్ తన క్షిపణి ఛత్రాన్ని విప్పింది. ఇజ్రాయెల్‌లోని టెల్ అవీవ్, హైఫా నగరాలను లక్ష్యంగా చేసుకుని భారీగా క్షిపణులను ప్రయోగించింది. అలాగే, బహ్రెయిన్‌లోని అమెరికా ఐదో నావికా దళానికి చెందిన స్థావరంపై కూడా ఇరాన్ దాడులు చేసినట్లు అక్కడి మీడియా వెల్లడించింది. దీనికి ప్రతిగా అమెరికా, ఇజ్రాయెల్ దళాలు ఇరాన్ అంతటా భీకరమైన వైమానిక దాడులను కొనసాగిస్తున్నాయి.

## ప్రపంచ దేశాలకు ఆయిల్ షాక్..

## ఇరాన్ సంచలన హెచ్చరికలతో ఆందోళనలో అంతర్జాతీయ మార్కెట్



**హైదరాబాద్ పెన్ పవర్:** అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలకు ఇరాన్ అత్యంత ఘాటుగా స్పందించింది. ఆయిల్ సప్లైని అడ్డుకుంటే భారీ మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని ట్రంప్ హెచ్చరించగా, దానికి ప్రతిగా ఇరాన్ తన వ్యూహాత్మక అస్త్రాన్ని ప్రయోగించింది.అంతర్జాతీయ చమురు రవాణాలో అత్యంత కీలకమైన హోర్ముజ్ జలసంధిని మూసివేస్తామని, అక్కడి నుండి ఒక్క లీటర్ చమురును కూడా బయటకు వెళ్లనివ్వబోమని ఇరాన్ స్పష్టం చేసింది. ఈ పరిణామం అగ్రరాజ్యం అమెరికాకు మరియు ప్రపంచ ఇంధన రక్షణకు పెద్ద సవాలుగా మారింది.ఇజ్రాయెల్ మరియు అమెరికా తనపై దాడులను కొనసాగిస్తే, శత్రు దేశాల ఆర్థిక మూలాలపై దెబ్బకొడతామని ఇరాన్ నేరుగా హెచ్చరించింది. ముఖ్యంగా అమెరికా మిలిటరీ బేస్‌లు కలిగి ఉన్న యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (జంఇ), సౌదీ అరేబియా మరియు ఖతర్ వంటి దేశాలకు ఈ హెచ్చరికలు గట్టిగా వెళ్లాయి. ఆయా దేశాల నుండి ఎగుమతి అయ్యే ఆయిల్‌ను కదలనివ్వబోమని చెప్పడం ద్వారా మధ్యప్రాచ్యంలో యుద్ధ మేఘాలు మరింత ముదిరేలా ఇరాన్ తన వైఖరిని స్పష్టం చేసింది. ఇది కేవలం మాటల యుద్ధానికే పరిమితం కాకుండా, క్షేత్రస్థాయిలో ఉద్రిక్తతలను పెంచుతోంది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా చమురు ధరలు క్రమంగా పెరుగుతున్న తరుణంలో, ఇరాన్ చేసిన ఈ ప్రకటన అంతర్జాతీయ మార్కెట్‌ను కలవరపెడుతోంది. ఇప్పటికే రష్యా-ఉక్రెయిన్ యుద్ధం వల్ల దెబ్బతిన్న సప్లై చైన్, ఇప్పుడు హోర్ముజ్ జలసంధి మూతపడితే పూర్తిగా కుప్పకూలే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. పెట్రోల్, డీజిల్ ధరలు ఆకాశాన్ని తాకడం వల్ల ద్రవ్యోల్బణం పెరిగి, సామాన్యుడిపై భారంతో పాటు ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మందగించే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. మధ్యప్రాచ్యంలో నెలకొన్న ఈ అనిశ్చితిని గమనిస్తున్న ఇతర దేశాలు ఇరాన్ ప్రకటనతో తీవ్ర ఆందోళనకు గురవుతున్నాయి. ఇంధన దిగుమతులపై ఆధారపడే భారత్ వంటి దేశాలకు ఇది పెద్ద తలనొప్పిగా మారనుంది.

## ఇరాన్ కొత్త సుప్రీం లీడర్‌పై ట్రంప్ సంచలన వ్యాఖ్యలు..



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇరాన్ నూతన సుప్రీం లీడర్‌గా మొజ్తబా ఖమేనీ బాధ్యతలు చేపట్టడంపై అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ ఎంపిక ఇరాన్ భవిష్యత్తుకు ఏమాత్రం శ్రేయస్కరం కాదని, గతంలో ఎదుర్కొన్న క్లిష్ట పరిస్థితులే మళ్ళీ పునరావృతమయ్యే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. మొజ్తబా నియామకం వల్ల ఆ దేశంలో అస్థిరత పెరిగే అవకాశం ఉందని, ఇది పాత సమస్యలకే కొత్త రూపం ఇస్తుందని ట్రంప్ తన విశ్లేషణలో పేర్కొన్నారు. మొజ్తబా ఖమేనీ నాయకత్వాన్ని ఉద్దేశించి ట్రంప్ చేసిన వ్యాఖ్యలు పరోక్ష హెచ్చరికలను తలపిస్తున్నాయి. ప్రస్తుత సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ తరహాలోనే, మొజ్తబా కూడా తీవ్రమైన ముప్పులను ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన సూచించారు. ఇరాన్ అగ్రనేతలను లక్ష్యంగా చేసుకునే వ్యూహాలు కొనసాగుతాయనే అర్థం వచ్చేలా ట్రంప్ మాట్లాడటం అంతర్జాతీయ దౌత్య వర్గాల్లో కలకలం రేపుతోంది. ఇది కేవలం రాజకీయ విమర్శేనా లేక భవిష్యత్తు చర్యలకు సంకేతమా అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.అమెరికా గతంలోనే ఇరాన్ నాయకత్వంపై కఠినమైన వైఖరిని అవలంబించిన విషయం తెలిసిందే. ఇరాన్ సుప్రీం లీడర్‌గా ఎవరు బాధ్యతలు చేపట్టినా, వారు ఎక్కువ కాలం పదవిలో కొనసాగలేరని, వారిని అంతం చేసేందుకు వెనుకాడబోమని అమెరికా గతంలోనే హెచ్చరికలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో ట్రంప్ తాజా వ్యాఖ్యలు ఆ పాత హెచ్చరికలను మరోసారి గుర్తు చేస్తున్నాయి. ఇరాన్ అంతర్గత రాజకీయాల్లో అగ్రనేతల భద్రత ఇప్పుడు ప్రధాన ప్రశ్నగా మారింది. మొత్తానికి, మొజ్తబా ఖమేనీ ఎన్నిక ఇరాన్ మరియు అమెరికా మధ్య ఉద్రిక్తతలను మరింత పెంచేలా కనిపిస్తోంది.

## ఐదేండ్ల కనిష్టానికి చమురు నిల్వలు

**హైదరాబాద్ పెన్ పవర్:** పశ్చిమాసియాలో ముదురుతున్న యుద్ధ మేఘాలు ప్రపంచ ఇంధన మార్కెట్‌ను తీవ్ర కల్లోలంలోకి నెడుతున్నాయి. అమెరికా, ఇజ్రాయిల్, ఇరాన్ ఉద్రిక్తతల కారణంగా అంతర్జాతీయ చమురు నిల్వలు ఇప్పటికే ఐదేండ్ల కనిష్టానికి పడిపోయాయని సౌదీ అరామ్కో సీఈఓ అమీన్ నాసర్ తెలిపారు. ముఖ్యంగా ప్రపంచ చమురు, సహజ వాయువు రవాణాలో 20 శాతం వాటా కలిగిన కీలకమైన హోర్ముజ్ జలసంధి గుండా రవాణా నిలిచిపోవడం ఇలాగే కొనసాగితే.. ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై వినాశకరమైన ప్రభావం పడనుందని హెచ్చరించారు. ఇరాన్ ఈ జలసంధిని మూసివేయడం వల్ల ఇప్పటికే అంతర్జాతీయంగా సరఫరా గొలుసు దెబ్బతిన్నదని ఆయన పేర్కొన్నారు. దీని ప్రభావంతో ఖతార్ తన గ్యాస్ ఉత్పత్తిని నిలిపివేయగా, ఇరాక్ చమురు ఉత్పత్తి ఏకంగా 70 శాతం పడిపోయింది. ఈ పరిణామాల వల్ల అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ ధరలు బ్యారెల్‌కు 120 డాలర్ల వరకు ఎగిశాయి. రవాణా పునరుద్ధరణ జరగకపోతే ఇంధన కొరత తీవ్రమై గ్లోబల్ ఎకానమీ కుప్పకూలే ప్రమాదం ఉందని అమీన్ నాసర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఏడాది 2026లో ప్రపంచం మరో భారీ ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కోబోతోందని రిచ్ డాడ్ పూర్ డాడ్ పుస్తక రచయిత రాబర్ట్ కియోసాకి అంచనా వేశారు. 2008 నాటి లెమాన్ బ్రదర్స్ పతనం కంటే ఇది భయంకరంగా ఉండవచ్చని ఆయన ట్వీట్ చేశారు.

# ఇరాన్ సంక్షోభం, ఇంధన ధరలపై జి7 అత్యవసర సమావేశం

**హైదరాబాద్ పెన్ పవర్:** ఇరాన్ సంక్షోభం మరియు ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న ఇంధన ధరలపై చర్చించేందుకు ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ బుధవారం జి7 దేశాల నాయకులతో అత్యవసర సమావేశాన్ని నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని ఫ్రెంచ్ అధ్యక్ష కార్యాలయం వెల్లడించింది. ఇరాన్‌పై అమెరికా?ఇజ్రాయిల్ యుద్ధ పరిస్థితుల కారణంగా చమురు ధరలు వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో, దీనికి ఎలా స్పందించాలనే అంశంపై జి7 దేశాలు చర్చించనున్నాయి. మంగళవారం జరిగిన జి7 ఇంధన మంత్రుల సమావేశంలో వ్యూహాత్మక చమురు నిల్వలను విడుదల చేయాలా అనే అంశంపై ఏకాభిప్రాయం కుదరలేదు. అయితే పరిస్థితిని సమీక్షించి సూచనలు ఇవ్వాలని అంతర్జాతీయ ఇంధన సంస్థను కోరినట్లు సమాచారం. సోమవారం అంతర్జాతీయ బెంచ్‌మార్క్ చమురు ధరలు దాదాపు నాలుగు సంవత్సరాల గరిష్ట స్థాయికి చేరాయి. అయితే మధ్యప్రాచ్యంలోని యుద్ధ పరిస్థితులు త్వరలో ముగిసే అవకాశం ఉందని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించిన తర్వాత మంగళవారం ధరలు సుమారు 11 శాతం తగ్గాయి. ఇదిలా ఉండగా, ప్రపంచ ఇంధన సరఫరాకు కీలకమైన హోర్ముజ్ జలసంధి గుండా చమురు రవాణా నిరంతరంగా కొనసాగేందుకు అమెరికా అధికారులు పలు చర్యలను పరిశీలిస్తున్నారు.

వాణిజ్య నౌకలకు నౌకాదళ రక్షణ కల్పించడం, ట్యాంకర్లకు యుద్ధ ప్రమాద బీమా మద్దతు ఇవ్వడం వంటి చర్యలు ఇందులో భాగంగా ఉండవచ్చని సమాచారం. జి7 సమూహంలో అమెరికా, కెనడా, జపాన్, ఇటలీ, బ్రిటన్, జర్మనీ మరియు ఫ్రాన్స్ దేశాలు సభ్యులుగా ఉన్నాయి. ప్రస్తుతం ఈ సమూహానికి ఫ్రాన్స్ అధ్యక్ష పదవిని నిర్వహిస్తోంది.



# హరీష్ రాణా కారుణ్యమరణంపై సుప్రీంకోర్టు సంచలన తీర్పు



**హైదరాబాద్ పెన్ పవర్:** కారుణ్యమరణంపై సుప్రీంకోర్టు బుధవారం సంచలన తీర్పునిచ్చింది. సుమారు 13ఏళ్లుగా కోమాలో ఉన్న హరీష్ రాణా (32) కారుణ్యమరణానికి అనుమతించింది. అతని తల్లిదండ్రుల అభ్యర్థన మేరకు చికిత్స నిలిపివేయవచ్చని సుప్రీంకోర్టు వెల్లడించింది. పంజాబ్ యూనివర్శిటీలో ఇంజనీరింగ్ చదువుతున్న హరీష్ రాణా 2013లో హాస్టల్ నాలుగో అంతస్తు నుండి కిందపడటంతో తలకు తీవ్రగాయమైంది. శరీరం కదలలేని స్థితికి చేరుకుంది. అప్పటి నుండి కోమాలోనే ఉన్న ఆయనకు ఇంటిలోనే చికిత్సనందిస్తున్నారు. తన కుమారుని కారుణ్య మరణానికి అనుమతించాలంటూ 2024లో ఢిల్లీ హైకోర్టును కోరారు. ఢిల్లీ హైకోర్టు నిరాకరించడంతో సుప్రీంకోర్టును ఆశ్రయించారు. కారుణ్య మరణానికి అనుమతిస్తూ నేడు జస్టిస్ జె.బి.పార్థివాలా,
జస్టిస్ కె.వి.విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం తీర్పునిచ్చింది. రాణాను అతని నివాసం నుండి పాలియేటివ్ సెంటర్‌కు మార్చాలని ఎయిమ్స్ ఢిల్లీని ఆదేశించింది. లైఫ్ సపోర్ట్ ఉపసంహరణ 'ఒకే చర్య'గా ఉండకూడదని, నిర్మాణాత్మకమైన మరియు స్పష్టంగా వ్యక్తీకరించబడిన

ఉపసంహారణగా ఉండాలని ధర్మాసనం ఆదేశించింది. రోగికి అందించే లైఫ్ సపోర్ట్ మెరుగైన చికిత్సా ప్రయోజనాన్ని కలిగిస్తుందా లేదా అతని జీవితాన్ని,నొప్పిని, బాధను పొడిగించేందుకు మాత్రమే పనిచేస్తుందా, మరియు కృత్రిమంగా జీవితాన్ని పొడిగించడం అతనికి ప్రయోజనం చేకూరుస్తుందా అన్న అంశాలను ప రిగణనలోకి తీసుకుని లైఫ్ సపోర్ట్‌ను ఉపసంహరణను నిర్దేశించాలని జె.బి.పార్థివాలా పేర్కొన్నారు. జస్టిస్ విశ్వనాథన్ కూడా ప్రత్యేక అభిప్రాయంతో జస్టిస్ జె.బి.పార్థివాలాతో ఏకీభవించారు. ఇది కారుణ్యమరణం అంశంపై కామన్ కాజ్ కేసులో 2018లో రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన మార్గదర్శకాలను ఆచరణాత్మకంగా అమలు చేసిన మొదటి కేసు కానుంది.

# ఇండియా- అమెరికా వాణిజ్య ఒప్పందాన్ని రద్దు చేయాలి



**హైదరాబాద్ పెన్ పవర్:** రైతులు, వ్యవసాయ కార్మికులు, ప్రజల ప్రయోజనాలను దారుణంగా దెబ్బతీసే భారతదేశం ? అమెరికా వాణిజ్య ఒప్పందాన్ని రద్దు చేయాలని రైతు నేతలు డిమాండ్ చేశారు. పంజాబ్‌లోని బర్నాలాలో సోమవారం నిర్వహించిన మహా పంచాయత్‌లో వారు ప్రసంగించారు. భారతదేశం ? అమెరికా వాణిజ్య ఒప్పందాన్ని రద్దు చేయాలని, విద్యుత్ బిల్లు, విత్తన బిల్లు, నాలుగు కార్మిక కోడ్‌లు, విబి గ్రామ్ జి చట్టాన్ని ఉపసంహరించుకోవాలని, కనీస మద్దతు ధరకు చట్టపరమైన హామీ ఇవ్వాలని వక్తలు డిమాండ్ చేశారు. ఈ నెల 19న న్యూఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో నిర్వహించనున్న కిసాన్ మహా పంచాయత్ విజయవంతానికి దేశవ్యాప్తంగా రైతులను సమీకరిస్తున్నట్లు చెప్పారు. ఎంఎస్ స్వామినాధన్ సిఫార్సుల ఆధారంగా కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి)కి చట్టబద్ధమైన హామీ ఇవ్వాలని కేంద్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇండియా ? అమెరికా వాణిజ్య ఒప్పందం వ్యవసాయం, గ్రామీణ జీవనోపాధిపై చూపే హానికర ప్రభావం గురించి రైతులు అవగాహన పెంచుకోవాలని అన్నారు. ఈ ఒప్పందం పర్యవసానాలను రైతులందరికీ తెలియజేసి, ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. మహా పంచాయత్‌లో రైతు నేతలు బల్బీర్ సింగ్ రాజేవాలా, జోగేంద్ర సింగ్ ఉగ్రహాన్, హరింద్ర సింగ్ లక్కోవాలా, బుటా సింగ్, దల్లెవాల్ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు పాటియాలా జిల్లా సామానాలో రైతులు నిర్వహించిన ఆందోళనలోనూ నేతలు పాల్గొన్నారు.

# భారత్ గౌరవం, ధైర్యం కోల్పోయింది



**హైదరాబాద్ పెన్ పవర్:** అమెరికా, ఇజ్రాయిల్.. ఇరాన్‌పై జరిపిన దాడులను కేంద్రం ఖండించకపోవడంపై ప్రముఖ రచయిత అరుంధతి రాయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంలో భారత ప్రభుత్వం 'ధైర్యం లేకుండా, వెన్నెముక లేకుండా ప్రవర్తిస్తోంది' అని ఆమె వ్యాఖ్యానించారు. ఢిల్లీలో జరిగిన ఒక పుస్తక కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఒకప్పుడు పేద దేశమైనప్పటికీ.. భారత్‌కు గౌరవం, ఆత్మగౌరవం ఉండేదని అన్నారు. ఇప్పుడు ఆ గౌరవం, ధైర్యం తగ్గిపోయాయని ఆమె అభిప్రాయపడ్డారు. అమెరికా ఇతర దేశాల నాయకులను హత్య చేయడం, అపహరించడం వంటి చర్యలను భారత ప్రభుత్వం ఎందుకు ఖండించలేదని ఆమె ప్రశ్నించారు. ఇజ్రాయిల్ వెళ్లి ఆ దేశ ప్రధాని బెంజమిన్ నెతన్యాహును ప్రధాని మోడీ ఆలింగనం చేసుకోవడం గురించి కూడా ఆమె విమర్శలు చేశారు. అమెరికాతో కుదుర్చుకున్న వాణిజ్య ఒప్పందంతో భారత రైతులు, టెక్స్‌టైల్ రంగానికి నష్టం జరుగుతుందని అన్నారు. గాజాలో జరిగిన సంఘర్షణ సమయంలో భారత ప్రభుత్వం వేలాది మంది భారతీయ కార్మికులను ఇజ్రాయిల్‌కు పంపిందనీ, ఇప్పుడు ఇజ్రాయిల్‌లో బంకర్లలో ఆశ్రయం పొందే సమయంలో ఆ కార్మికులకు ఆ సదుపాయం ఇవ్వడం లేదని వార్తలు వస్తున్నాయని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. అమెరికా ? ఇజ్రాయిల్ ఇరాన్‌పై జరిపిన దాడి అకారణమనీ, అది గాజాలో జరుగుతున్న ఘర్షణల కొనసాగింపే అని ఆమె అన్నారు. ఈ యుద్ధం మరింత విస్తరించి ప్రపంచవ్యాప్తంగా పెద్ద సంక్షోభానికి దారి తీయొచ్చని కూడా హెచ్చరించారు. ఇరాన్‌పై దాడులు ప్రపంచాన్ని అణు యుద్ధం అంచుకు తీసుకెళ్లే ప్రమాదం ఉందని ఆమె అభిప్రాయపడ్డారు. దేశాల్లో మార్పులు అవసరమైతే అవి ప్రజల ద్వారానే రావాలని, బలవంతపు దాడుల ద్వారా కాకూడదని ఆమె తెలిపారు.

# 2028 డిసెంబర్ వరకు జల్‌జీవన్ మిషన్ పొడిగింపు



**హైదరాబాద్ పెన్ పవర్:** జల్‌జీవన్ మిషన్ (జెజెఎం)ను 2028 డిసెంబర్ వరకు పొడిగిస్తూ కేంద్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. ప్రధాని మోడీ అధ్యక్షతన కేంద్ర మంత్రివర్గ సమావేశం మంగళవారం జరిగింది. ఈ సమావేశంలో మౌలిక సదుపాయాల కల్పనకు రూ. 8.8 లక్షల కోట్లు కేటాయిస్తూ నిర్ణయం తీసుకుంది. ఇక జల్‌జీవన్ మిషన్ పొడిగింపు కోసం మరో రూ. 8.69 లక్షల కోట్లను కేటాయించింది. ముధురై ఎయిర్‌పోర్టును అంతర్జాతీయ విమానాశ్రయంగా ప్రకటించింది. పశ్చిమబెంగాల్ ? జార్ఖండ్ మధ్య రూ. 4,474 కోట్లతో 192 కిలోమీటర్ల మేర మల్టీ ట్రాకింగ్ ప్రాజెక్టుకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. రూ. 3,839.42 కోట్లతో మధ్యప్రదేశ్‌లోని ఢిల్లీ-ముంబయి ఎక్స్‌ప్రెస్ వే బద్నావర్-థాండియా-తిమర్వానీ మధ్య ఐదు లైన్ల రహదారి నిర్మాణానికి కేంద్రం ఆమోదం తెలిపింది. రూ. 3,631 కోట్లతో జెవార్ విమానాశ్రయం ? ఫరీదాబాద్ సెక్షన్‌ను కలిపే ఆరు లైన్ల ఎలివేటెడ్ రోడ్డు నిర్మాణానికి కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది.

# ఇరాన్ రాయబారితో ఫరూఖ్ అబ్దుల్లా భేటీ

**హైదరాబాద్ పెన్ పవర్:** భారత్‌లోని ఇరాన్ డిప్యూటీ రాయబారి మహమ్మద్ ఫథాలీతో జమ్మూకాశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి ఫరూఖ్ అబ్దుల్లా మంగళవారం భేటీ అయ్యారు. ఇరాన్ సుప్రీం లీడర్ అలీ ఖమేనీ మృతిపై సంతాపం వ్యక్తం చేశారు. న్యూఢిల్లీలోని ఇరాన్ రాయబార కార్యాలయంలో 30 నిమిషాలపాటు ఈ సమావేశం జరిగింది. ఇరాన్‌పై దాడులు త్వరలో ముగిసిపోతాయని, ఆ దేశ ప్రజలు త్వరలో బాధల నుంచి విముక్తి పొందుతారని అబ్దుల్లా ఆశాభావం వ్యక్తం చేశారు. ఇరాన్ ప్రజలకు అబ్దుల్లా సంఘీభావాన్ని తెలిపారు. కేవలం ఇరాన్ మాత్రమే కాకుండా మొత్తం ప్రపంచం కూడా అవాంఛనీయ సంక్షోభంలో చిక్కుకుందని చెప్పారు. రాయబార కార్యాలయంలో ఉన్న సందర్శకుల పుస్తకంలో 'ఇరాన్ ప్రజలతో నా ప్రార్థనలు, సంఘీభావం ఉన్నాయి' అని అబ్దల్లా రాసారు. అబ్దుల్లాతో పాటు రాయబార కార్యాలయాన్ని సందర్శించిన వారిలో జమ్మూకాశ్మీర్‌కు చెందిన రాజ్యసభ సభ్యులు చౌదరి మహమ్మద్ రంజాన్, సజ్జాద్ అహ్మద్ కిచ్లూ, గుర్విందర్ సింగ్ ఒబెరారు ఉన్నారు.

## ఎల్ఐసికి రూ.70,000 కోట్ల భారీ నష్టం!




అమెరికా, ఇజ్రాయిల్ దేశాలు సంయుక్తంగా ఇరాన్‌పై సాగిస్తోన్న మారణకాండ భారత స్టాక్ మార్కెట్లను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఈ ప్రభావం దిగ్గజ బీమా సంస్థ ఎల్ఐసికి గొడ్డలిపెట్టులా మారింది. ఆ సంస్థ పెట్టుబడులు వేల కోట్లలో ఆవిరైపోతున్నాయి. కేవలం పది రోజుల్లోనే ఎల్ఐసి తన స్టాక్ పోర్ట్‌ఫోలియోలో రూ.70,105 కోట్ల సంపదను కోల్పోయింది. ఫిబ్రవరి 27న రూ.14.88 లక్షల కోట్లుగా ఉన్న ఉన్న ఎల్ఐసి పెట్టుబడుల విలువ.. మార్చి 9 నాటికి 4.7 శాతం తగ్గి రూ.14.17 లక్షల కోట్లకు పరిమితమయ్యింది. ముఖ్యంగా బ్యాంకింగ్ రంగానికి చెందిన ఎస్‌బిఐ, ఐసిఐసిఐ, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకుల షేర్లు పతనం కావడంతో ఎల్ఐసికి సుమారు రూ.15,293 కోట్ల నష్టం వాటిల్లింది. అదే విధంగా ప్రముఖ నిర్మాణ సంస్థ లార్సెన్ అండ్ టర్బో షేర్ల పతనం వల్ల మరో రూ.7,609 కోట్ల సంపద ఆవిరయ్యింది.

## ఇరాన్‌పై యుద్ధంతో ఆర్థిక వ్యవస్థకు ప్రమాద ఘంటికలు




ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ సంయుక్తంగా చేస్తున్న యుద్ధం భారత ఆర్థిక వ్యవస్థకు ప్రమాద ఘంటికలు మోగిస్తోంది. ఇరాన్ చమురే క్షేత్రాలు లక్ష్యంగా అమెరికా, ఇజ్రాయిల్ చేస్తున్న దాడులతో సోమవారం అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరలు ఒక్కసారిగా భగ్గుమన్నాయి. బ్యారెల్ ధర 110 డాలర్లు దాటడం అంతర్జాతీయంగా కలకలం రేపింది. దాడులు ఇదే మాదిరి కొనసాగితే బ్యారెల్ ధర 200 డాలర్లు కూడా దాటే అవకాశం ఉందని ఇరాన్ పేర్కొనడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. నాలుగు రోజుల క్రితం 70 డాలర్లుగా ఉన్న చమురు ధర ఈ స్థాయికి ఎగబాకడంతో 1973 నాటి సంక్షోభాన్ని పరిశీలకులు గుర్తు చేస్తున్నారు. అప్పట్లో దాదాపుగా 300శాతం ధరలు పెరిగాయి. అంతర్జాతీయంగా చమురు ధరలు భగ్గుమన్న నేపథ్యంలో దేశంలో చాలినంత చమురు నిల్వలున్నాయని, సామాన్యులపై భారం పడకుండా చర్యలు తీసుకుంటున్నామని కేంద్ర ప్రభుత్వం చెబుతోంది. ఇప్పటికే గ్యాస్ సిలిండర్ ధరలు పెంచిన నేపథ్యంలో ఇతర పెట్రో ఉత్పత్తుల ధరలు కూడా ఎప్పుడైనా పెరిగే అవకాశం ఉందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. మరోవైపు యుద్ధ భయాలు, చమురు ధరల ప్రభావంతో సోమవారం స్టాక్ మార్కెట్లు భారీ నష్టాలను చవి చూశాయి. సెన్సెక్స్ ఇంట్రాడేలో 2,496 పాయింట్లు పతనం కాగా.. తుదకు 1,352.74 పాయింట్ల నష్టంతో 77,566.16కు క్షీణించింది. నిఫ్టీ 422.40 పాయింట్లు కోల్పోయి 24,028.05 వద్ద నిలిచింది. ఒక్క పూటలోనే ఇన్వెస్టర్ల సంపద దాదాపు రూ.13 లక్షల కోట్లు హరించుకుపోయింది. వరుస నష్టాలతో రిటైల్ మదుపర్లు బెంబేలెత్తుతున్నారు.

## అమెరికాలో కొత్త ఆయిల్ రిఫైనరీ, భాగస్వామి కానున్న రిలయన్స్ ఇండస్ట్రీస్




అమెరికా ఇంధన రంగంలో ఒక చారిత్రాత్మక అధ్యాయం మొదలైంది. గత 50 ఏళ్లలో ఎన్నడూ లేని విధంగా, అమెరికాలో మొట్టమొదటి కొత్త ఆయిల్ రిఫైనరీని నిర్మిస్తున్నట్లు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. టెక్సాస్‌లోని బ్రౌన్స్‌విల్లే పోర్ట్ వద్ద నిర్మించబోయే ఈ భారీ ప్రాజెక్టులో భారతీయ దిగ్గజ సంస్థ 'రిలయన్స్ ఇండస్ట్రీస్' భాగస్వామిగా ఉండటం విశేషం. ఈ ప్రాజెక్టు విలువ సుమారు 300 బిలియన్ డాలర్లు (భారత కరెన్సీలో దాదాపు రూ. 25 లక్షల కోట్లు). ఇది అమెరికా చరిత్రలోనే అతిపెద్ద డీల్ అని ట్రంప్ అభివర్ణించారు. తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ట్రూత్ సోషల్' వేదికగా ఈ విషయాన్ని ప్రకటిస్తూ.. "భారతదేశంలోని మా భాగస్వాములకు, అక్కడి అతిపెద్ద ప్రైవేట్ ఇంధన సంస్థ రిలయన్స్‌కు ఈ భారీ పెట్టుబడి పెట్టినందుకు ధన్యవాదాలు" అని పేర్కొన్నారు.'అమెరికా ఫస్ట్ రిఫైనింగ్' అనే సంస్థ ఈ ప్రాజెక్టును చేపట్టనుంది. ఇది ప్రపంచంలోనే అత్యంత స్వచ్ఛమైన రిఫైనరీగా నిలుస్తుందని ట్రంప్ ధీమా వ్యక్తం చేశారు. పశ్చిమాసియాలో (ఇరాన్ యుద్ధం నేపథ్యంలో) చమురు సరఫరాకు ఆటంకాలు కలుగుతున్న సమయంలో, ఈ కొత్త రిఫైనరీ అమెరికా ఇంధన భద్రతను బలోపేతం చేయడమే కాకుండా, వేలాది మందికి కొత్త ఉద్యోగాలను కల్పిస్తుందని ఆయన చెప్పారు.

## భారీ పతనం నుంచి కోలుకున్న స్టాక్ మార్కెట్లు

దేశీయ ఈక్విటీ మార్కెట్లు రెండు రోజుల భారీ పతనం తర్వాత మంగళవారం ట్రేడింగ్‌లో కోలుకున్నాయి. సెన్సెక్స్, నిఫ్టీ సూచీలు నష్టాల పుంజుకున్నాయి. గ్లోబల్ మార్కెట్లో సోమవారం 100 డాలర్లకు పైగా పెరిగిన ముడి చమురు ధరలు తగ్గడం, ప్రపంచ మార్కెట్లలో రికవరీ, పశ్చిమాసియాలో సంఘర్షణలు త్వరలో ముగుస్తాయనే ఆశలు, దీనిపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటన నేపథ్యంలో ఇన్వెస్టర్ల సెంటిమెంట్ బలపడింది. ఇరాన్‌తో అమెరికా-ఇజ్రాయెల్ వివాదం త్వరలో ముగుస్తుందని డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలు ముడి చమురు ధరలు తగ్గేందుకు దోహదపడ్డాయి. ఇది ప్రపంచ మార్కెట్లలో రిస్క్‌ని తగ్గించింది. దీని ప్రభావంతో యుఎస్ డాలర్ కూడా కొంత బలహీనపడింది. దీంతో మార్కెట్లు ముగిసే సమయానికి సెన్సెక్స్ 639.82 పాయింట్లు లాభపడి 78,205 వద్ద, నిఫ్టీ 233.55 పాయింట్లు పెరిగి 24,261 వద్ద ముగిశాయి. ప్రపంచ చమురు బెంచ్‌మార్క్ బ్రెంట్ ముడి చమురు మంగళవారం బ్యారెల్‌కు 5.18 శాతం తగ్గి 93.83కి చేరుకుంది. సెన్సెక్స్ ఇండెక్స్‌లో ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్, అల్ట్రాటెక్ సిమెంట్, ఆసియన్ పెయింట్స్, అదానీ పోర్ట్స్, మహీంద్రా అండ్ మహీంద్రా, టైటాన్ ఎక్కువ లాభాలను ఆర్జించాయి. అమెరికా డాలరుతో రూపాయి మారకం విలువ రూ. 91.94 వద్ద ఉంది.

# చైనా పెట్టుబడులకు తలుపులు తెరిచిన కేంద్రం




భారతదేశ విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల విధానంలో కేంద్ర ప్రభుత్వం ఓ వ్యూహాత్మక నిర్ణయం తీసుకుంది. ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలో మంగళవారం జరిగిన కేంద్ర క్యాబినెట్ సమావేశంలో, భారత్‌తో భూసరిహద్దును పంచుకునే దేశాల నుండి వచ్చే పెట్టుబడుల నిబంధనలను సరళతరం చేస్తూ కీలక నిర్ణయం తీసుకున్నారు. 2020లో గాల్వాన్ లోయ ఉద్రిక్తతల తర్వాత, భారతీయ కంపెనీలను విదేశీ శక్తులను ముఖ్యంగా చైనాను నిరోధించడానికి 'ప్రెస్ నోట్ 3' (ఖఔ3) నిబంధనను తీసుకువచ్చారు. దీని ప్రకారం చైనా, పాకిస్తాన్, బంగ్లాదేశ్, నేపాల్ వంటి పొరుగు దేశాల నుండి వచ్చే ప్రతి పైసా పెట్టుబడికి ప్రభుత్వ ముందస్తు అనుమతి తప్పనిసరి చేశారు. అయితే, తాజా సవరణతో ఈ కఠినమైన ఆంక్షలను సడలిస్తూ, కొన్ని రకాల పెట్టుబడులను, ముఖ్యంగా తక్కువ మొత్తంలో ఉండే పెట్టుబడులను 'ఆటోమేటిక్ రూట్' ద్వారా అనుమతించాలని కేంద్రం నిర్ణయించింది. దీనివల్ల ఇకపై కొన్ని నిర్దేశిత రంగాలలో, అలాగే పరిమితులకు లోబడి వచ్చే పెట్టుబడులకు ప్రభుత్వ అనుమతి కోసం వేచి చూడాల్సిన అవసరం ఉండదు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయం వెనుక దేశ ఆర్థిక, వ్యూహాత్మక కారణాలు ఉన్నాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం భారత్, చైనా మధ్య వాణిజ్య లోటు (ↄతీజీటవ ఆవటతిఇ౹తిబి) సుమారు 99 బిలియన్ డాలర్లకు చేరుకుంది. ఇది భారత ఆర్థిక వ్యవస్థకు ఒక పెద్ద సవాలుగా మారింది. కేవలం చైనా నుండి వస్తువులను దిగుమతి చేసుకోవడం కంటే, ఆ దేశ కంపెనీలే భారత్‌లోకి వచ్చి పెట్టుబడులు పెట్టి, ఇక్కడే తయారీ కేంద్రాలను ఏర్పాటు చేసేలా ప్రోత్సహించడం ద్వారా ఈ లోటును తగ్గించవచ్చని కేంద్రం భావిస్తోంది. దీనివల్ల దేశీయంగా భారీ ఎత్తున ఉపాధి అవకాశాలు పెరగడమే కాకుండా, గ్లోబల్ సప్లై చైన్‌లో భారత్ తన పట్టును బలపరుచుకోవడానికి వీలవుతుంది.

# రష్యా చమురు చెల్లింపులకు ఎస్‌బీఐ దూరం!




రష్యా నుంచి మన దేశీయ సంస్థలు చమురు దిగుమతి చేసుకోవడానికి అమెరికా 30 రోజుల పాటు మినహాయింపు ఇచ్చినా కూడా.. వాటికి సంబంధించిన చెల్లింపులను ప్రాసెస్ చేయడానికి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) నిరాకరిస్తోందని సమాచారం. మినహాయింపు కాలవ్యవధిపై అనిశ్చితి నెలకొనడమే ఇందుకు కారణమని సంబంధిత వర్గాలు తెలిపినట్లు వార్తాసంస్థ బ్లూమ్‌బర్గ్ తెలిపింది. ప్రపంచ దేశాల్లో కూడా ప్రాజెక్టులకు ఎస్‌బీఐ భారీ స్థాయిలో రుణాలు అందచేసింది. అమెరికా ఆంక్షలున్న చమురు సంబంధిత లావాదేవీల్లో పాలుపంచుకుంటే, రిస్క్ పెరగడంతో పాటు బ్యాంక్ ప్రతిష్ఠకు భంగం వాటిల్లుతుందన్నది ఎస్‌బీఐ భావనగా తెలుస్తోంది.

ఈ వార్తలపై స్పందించేందుకు ఎస్‌బీఐ నిరాకరించింది. గత అక్టోబరులో రష్యాలోని రెండు అతిపెద్ద ముడిచమురు ఉత్పత్తి సంస్థలపై అమెరికా ఆంక్షలు విధించినప్పటి నుంచి, ఆ దేశం నుంచి చేసుకునే చమురు దిగుమతులకు సంబంధించిన ఎటువంటి ఆర్థిక లావాదేవీలను ఎస్‌బీఐ ప్రోత్సహించడం లేదు. ఇప్పుడు అమెరికా ఆంక్షలు సడలించినా కూడా, రష్యా నుంచి భారత్ చమురు కొనుగోళ్లకు మద్దతుగా ఉన్న ఆర్థిక మార్గాలను పునరుద్ధరించడంలో ఎస్‌బీఐ ఆసక్తి కనబరచడం లేదు. గతేడాది చివర్లో రష్యా నుంచి చమురు కొనుగోళ్లకు కొన్ని భారత బ్యాంకులు ఆర్థిక సాయం చేయడానికి సిద్ధమైనట్లు సమాచారం. లావాదేవీలు బ్లాక్ లిస్ట్‌లో లేకుండా, నిబంధనలకు లోబడి ఉన్నంత వరకు.. వాటిని పరిశీలిస్తామని ఆ బ్యాంకులు తెలిపాయి.

# దేశీయంగా 25 శాతం ఐఫోన్‌లను తయారు చేస్తున్న యాపిల్



గ్లోబల్ టెక్ దిగ్గజం యాపిల్ భారత మార్కెట్లో తన స్మార్ట్‌ఫోన్ బ్రాండ్ ఐఫోన్ ఉత్పత్తిని గణనీయంగా పెంచింది. గతేడాది దేశంలో ఐఫోన్ ఉత్పత్తిని దాదాపు 53 శాతం పెంచి, 5.5 కోట్ల ఐఫోన్‌లను ఉత్పత్తి చేసింది, ఇది 2024లో 3.6 కోట్ల కంటే చాలా ఎక్కువ. యాపిల్ ప్రపంచవ్యాప్తంగా ఏటా 22-23 కోట్ల ఐఫోన్‌లను తయారు చేస్తుంది, అంటే మొత్తం తయారీలో నాల్గవ వంతు ఇప్పుడు మనదేశంలో ఉత్పత్తి చేస్తోంది. ఇది చైనాపై అమెరికా విధించిన టారిఫ్‌ను తప్పించుకునేందుకు యాపిల్ చేసిన ప్రయత్నాలను ప్రతిబింబిస్తుందని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. దీనికి ప్రధాన కారణం అమెరికా, చైనా మధ్య వాణిజ్య ఉద్రిక్తతలు, టారిఫ్ ప్రభావం.

ఈ టారిఫ్‌లు చైనా నుంచి యుఎస్‌కు ఉత్పత్తులను ఎగుమతి చేయడానికి కంపెనీలకు ఎక్కువ ఖర్చు అవుతోంది. ఈ అదనపు ఖర్చులను నివారించడానికి, యాపిల్‌తో పాటు కంపెనీ సరఫరాదారులు కొంత ఉత్పత్తిని ఇతర దేశాలకు, ముఖ్యంగా భారత్‌కు తరలిస్తున్నారు. ఈ క్రమంలోనే మనదేశంలో ఉత్పత్తి అనుసంధాన ప్రోత్సాహక(పీఎల్ఐ) పథకం లాంటి ప్రభుత్వ కార్యక్రమాల ద్వారా కంపెనీలను స్థానికంగా తయారు చేసేందుకు ప్రభుత్వం ప్రోత్సహించింది. చైనాతో పోలిస్తే బలహీన సరఫరా, అధిక లాజిస్టిక్స్ ఖర్చులు వంటి సవాళ్లను ఎదుర్కోవటానికి ఈ ప్రోత్సాహకాలు కంపెనీలకు సహాయపడ్డాయి.

## గ్లోబల్ ఆయిల్ సంక్షోభం.. చైనా ధీమాకు కారణం ఇదేనా?



ప్రపంచవ్యాప్తంగా చమురు ధరలు ఆకాశాన్ని తాకుతున్నా, అంతర్జాతీయ మార్కెట్లలో అనిశ్చితి నెలకొన్నా చైనా మాత్రం ఎంతో ప్రశాంతంగా కనిపిస్తోంది. ఇరాన్ నుండి దాదాపు 90 శాతం ముడి చమురును దిగుమతి చేసుకుంటున్నప్పటికీ, సరఫరాలో ఆటంకాలు ఎదురవుతాయన్న భయం ఆ దేశంలో అస్సలు కనిపించడం లేదు. ఇతర దేశాలు ఇంధన ధరల పెరుగుదలతో సతమతమవుతుంటే, చైనా మాత్రం తన వ్యూహాత్మక ప్రణాళికలతో ముందస్తుగానే రక్షణ కవచాన్ని ఏర్పాటు చేసుకుంది. ఈ ధీమా వెనుక ఉన్న ప్రధాన కారణం చైనా వద్ద ఉన్న భారీ చమురు నిల్వలు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కోవడానికి ఏకంగా 1.4 బిలియన్ బ్యారెళ్ల ముడి చమురును ఆ దేశం నిల్వ చేసి ఉంచుకుంది. ఒకవేళ అంతర్జాతీయంగా సరఫరా వ్యవస్థ పూర్తిగా దెబ్బతిన్నా, ఈ నిల్వలతో సుదీర్ఘ కాలం పాటు దేశ అవసరాలను తీర్చుకోవచ్చనేది చైనా నమ్మకం. ఈ స్థాయి నిల్వలు ఏ ఇతర దేశానికైనా ఒక గొప్ప ఇంధన భద్రతను కల్పిస్తాయి. మరోవైపు, చైనాలో మారుతున్న రవాణా ముఖచిత్రం కూడా చమురుపై ఆధారపడటాన్ని గణనీయంగా తగ్గించింది. దేశవ్యాప్తంగా ఎలక్ట్రిక్ వాహనాల (ఇఎ) వాడకం విపరీతంగా పెరగడం వల్ల పెట్రోల్, డీజిల్ అవసరం క్రమంగా తగ్గుతూ వస్తోంది. పర్యావరణ హితమైన ఇంధన వనరుల వైపు మొగ్గు చూపడం వల్ల, గ్లోబల్ మార్కెట్‌లో చమురు ధరలు పెరిగినా దేశీయ ఆర్థిక వ్యవస్థపై దాని ప్రభావం తక్కువగా ఉండేలా చైనా జాగ్రత్త పడింది. చివరగా, భౌగోళిక రాజకీయ పరిస్థితులు మారినా చైనాకు ప్రత్యామ్నాయ మార్గాలు అందుబాటులో ఉన్నాయి. ఒకవేళ గల్ఫ్ దేశాల నుంచి సరఫరా నిలిచిపోయే పరిస్థితి వస్తే, రష్యా వంటి మిత్ర దేశాల నుండి దిగుమతులను పెంచుకునే వెసులుబాటు చైనాకు ఉంది. ఇలా బహుముఖ వ్యూహాలతో ఇంధన సంక్షోభాన్ని ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్న చైనా, ప్రస్తుత క్లిష్ట పరిస్థితుల్లోనూ ఆందోళన చెందకుండా తన ఆర్థిక ప్రగతిని కొనసాగిస్తోంది.

## ట్రంప్ వ్యాఖ్యలకు ఇరాన్ దీటుగా కౌంటర్..

### 'యుద్ధం ఎప్పుడు ముగియాలో నిర్ణయించేది మేమే

అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల యుద్ధం ముగింపు గురించి చేసిన వ్యాఖ్యలపై ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ తీవ్రంగా స్పందించింది. ప్రాంతీయ శాంతి మరియు యుద్ధం నిలిపివేత అనేది కేవలం అమెరికా ప్రకటనలతో సాధ్యం కాదని, అది తమ చేతుల్లోనే ఉందని ఇరాన్ సైనిక వర్గాలు స్పష్టం చేశాయి. ట్రంప్ తన రాజకీయ ప్రయోజనాల కోసం వాస్తవాలను వక్రీకరిస్తున్నారని, ఆయన మాటల్లో నిజం లేదని ఇరాన్ ఉన్నతాధికారులు కొట్టిపారేశారు. పశ్చిమ ఆసియా ప్రాంత భవిష్యత్తును నిర్ణయించే అధికారం కేవలం స్థానిక సాయుధ బలగాలకు మాత్రమే ఉంటుందని ఎఖీఉఅ గట్టిగా వాదించింది. అమెరికా సైనికులు ఈ ప్రాంతంలో యుద్ధాన్ని ముగించలేరని, దానికి అవసరమైన క్షేత్రస్థాయి బలం వారికి లేదని ఇరాన్ అభిప్రాయపడింది. బలగాల మోహరింపు మరియు వ్యూహరచనలో తాము పూర్తి ఆధిపత్యం కలిగి ఉన్నామని, ఈ విషయంలో విదేశీ శక్తుల జోక్యాన్ని సహించేది లేదని హెచ్చరించింది. ప్రస్తుతం తాము పూర్తి శక్తి సామర్థ్యాలతో యుద్ధ రంగంలో ఉన్నామని, శత్రువుల ఆటలు సాగనివ్వబోమని ఇరాన్ సైన్యం పేర్కొంది. తమపై అమెరికా పైచేయి సాధించిందని ట్రంప్ చెబుతున్న మాటలు కేవలం అబద్ధాలని, ప్రపంచాన్ని నమ్మించడానికి ఆయన ఇటువంటి తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడింది. క్షేత్రస్థాయిలో తాము సాధించిన విజయాలు మరియు తమ పోరాట పటిమను చూసి భయపడే ఇలాంటి ప్రకటనలు చేస్తున్నారని ధ్వజమెత్తింది. మొత్తానికి, ట్రంప్ వ్యాఖ్యలు మధ్యప్రాచ్యంలో కొత్త రాజకీయ దుమారాన్ని రేపాయి. ఇరాన్ వైఖరి చూస్తుంటే తమ ప్రాంతంపై పట్టు సాధించేందుకు అమెరికా చేసే ఏ ప్రయత్నాన్నైనా తిప్పికొట్టడానికి సిద్ధంగా ఉన్నట్లు కనిపిస్తోంది.

# పిత్త దోషాలకు పవర్‌ఫుల్ రెమిడి



వాములో ఎన్నో అద్భుతమైన ఔషధ గుణాలు దాగున్నాయి.. ఇది వాస్తవానికి మన వంటింటిలో సర్వసాధారణంగా కనిపించే ఒక మసాలా దినుసు.. వాము, అనేక ఆరోగ్య ప్రయోజనాలకు నిలయం. దీనిని రోజూ తీసుకోవడం వల్ల శరీరంలో జరిగే మార్పులు ఆశ్చర్యకరంగా ఉంటాయి. వాములో ఎన్నో అద్భుతమైన ఔషధ గుణాలు దాగున్నాయి.. ఇది వాస్తవానికి మన వంటింటిలో సర్వసాధారణంగా కనిపించే ఒక మసాలా దినుసు.. వాము, అనేక ఆరోగ్య ప్రయోజనాలకు నిలయం. దీనిని రోజూ తీసుకోవడం వల్ల శరీరంలో జరిగే మార్పులు ఆశ్చర్యకరంగా ఉంటాయి. ఆయుర్వేద శాస్త్రం ప్రకారం.. వాము "వాతపిత నాశకారి". అంటే ఇది శరీరంలోని వాత, పిత్త దోషాలను సమతుల్యం చేస్తుంది. వాతం అంటే గ్యాస్ సమస్యలు, పిత్తం అంటే ఎసిడిటీ.. ఈ రెండు సమస్యలను వాము సమర్ధవంతంగా తగ్గించగలదు. ఈ సమస్యలు ఉన్నవారు వాము నీటిని తీసుకోవడం ఉత్తమం.. ఇది.. జీర్ణక్రియను మెరుగుపరచడం, గ్యాస్, ఎసిడిటీ, కడుపు ఉబ్బరాన్ని తగ్గించడంలో అద్భుతంగా పనిచేస్తుంది. రోజూ ఉదయం ఖాళీ కడుపుతో తాగితే జలుబు, దగ్గు, బరువు తగ్గడం, రోగనిరోధక శక్తి పెంచడంలో సహాయపడుతుంది. ఇది మెరుగైన జీవక్రియ, గుండె ఆరోగ్యం, డెటాక్సిఫికేషన్‌కు కూడా దోహదపడుతుందని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు.శరీరంలో వాతం (గ్యాస్) అధికమైనప్పుడు, అది కడుపులో అసౌకర్యాన్ని కలిగిస్తుంది. ఈ గ్యాస్ శరీరంలోని బలహీనమైన అవయవాలపై ప్రభావం చూపుతుంది, నొప్పిని కలిగిస్తుంది. ముఖ్యంగా, దెబ్బతిన్న లేదా నొప్పి ఉన్న భాగాలలో గ్యాస్ పేరుకుపోయి నొప్పిని తీవ్రతరం చేస్తుంది. వాము గ్యాస్‌ను తగ్గించడం ద్వారా ఈ రకమైన నొప్పుల నుండి ఉపశమనాన్ని అందిస్తుంది.

ఎసిడిటీ (పిత్త దోషం) కూడా అనేక ఆరోగ్య సమస్యలకు మూలం. గొంతులో మంట, కడుపు నొప్పి, అజీర్ణం, నులిపురుగులు, మధుమేహం, అధిక రక్తపోటు వంటి 80% అనారోగ్యాలు ఎసిడిటీతో ముడిపడి ఉన్నాయని ఆయుర్వేదం చెబుతుంది. వాము ఎసిడిటీని తగ్గించడం ద్వారా ఈ సమస్యలన్నింటినీ నియంత్రించడంలో సహాయపడుతుంది. అసిడిటీ తగ్గినప్పుడు, హార్ట్ ఎటాక్, అధిక రక్తపోటు వంటి తీవ్రమైన సమస్యల ప్రమాదం కూడా తగ్గుతుంది. వామును నీటిలో, పాలలో, కొద్దిగా ఉప్పుతో కలిపి, కూరలలో, మజ్జిగలో ? ఇలా అనేక విధాలుగా ఆహారంలో భాగం చేసుకోవచ్చు. అయితే, అత్యంత ప్రభావవంతమైన పద్ధతి రాత్రిపూట వాము నీటిని తయారుచేసి ఉదయాన్నే తాగడం.. ఒక గ్లాసు నీటిలో ఒక టేబుల్ స్పూన్ వాము వేసి రాత్రంతా నానబెట్టాలి. ఉదయాన్నే నిద్రలేవగానే, బ్రష్ చేయకుండానే, ఆ నీటిని తాగి, నానబెట్టిన వాము గింజలను నమిలి మింగాలి. బరువు తగ్గుదల: ఈ పద్ధతిని క్రమం తప్పకుండా పాటిస్తే, అనవసరమైన పొట్ట కొవ్వు (బెల్లీ ఫ్యాట్), బరువు తగ్గుతుంది. వాము ఒక సమర్థవంతమైన కొవ్వు కరిగించే ఏజెంట్‌గా పనిచేస్తుంది.జీర్ణ సమస్యలు: గ్యాస్, ఎసిడిటీ, మలబద్ధకం వంటి సమస్యలకు వాము దివ్యౌషధం. కడుపు నొప్పికి, రాత్రి నానబెట్టిన వాము నీటిని కొద్దిగా వేడి చేసి, చిటికెడు నల్ల ఉప్పు కలిపి తాగడం ఉపశమనాన్ని ఇస్తుంది.మధుమేహ నియంత్రణ: ఉదయాన్నే వాము నీటిని గోరువెచ్చగా తాగడం వల్ల మధుమేహం నియంత్రణలో ఉంటుంది.శిశువులకు జీర్ణక్రియ: తల్లిపాలు సరిపోనప్పుడు శిశువులకు ఆవు లేదా గేదెపాలు ఇస్తారు. ఈ పాలను జీర్ణం చేసుకోవడానికి వాము చాలా సహాయపడుతుంది. వామును ఒక సన్నని వస్త్రంలో చుట్టి, పాలలో వేసి మరిగించి, ఆ పాలను వడపోసి పసిపిల్లలకు పల్చగా ఇవ్వడం వల్ల గ్యాస్ సమస్యలు లేకుండా పాలు సులభంగా జీర్ణం అవుతాయి. నులిపురుగులు: వాములోని వగరు, చేదు గుణాలు కడుపులోని నులిపురుగులను, హానికరమైన సూక్ష్మక్రిములను నాశనం చేస్తాయి. కడుపు నొప్పి వచ్చినప్పుడు, వేడి అన్నంలో కొద్దిగా నూనె, రెండు స్పూన్ల వాము కలిపి తీసుకోవడం వల్ల జీర్ణవ్యవస్థ మెరుగుపడి, కడుపు నొప్పి తగ్గుతుంది. ఇది కేవలం అవగాహన కోసం మాత్రమే.. ఏదైనా సమస్యలుంటే ఆరోగ్య నిపుణులను సంప్రదించడం ఉత్తమం..


# కొబ్బరి నీళ్లు.. తాగేముందు ఈ నిజాలు తెలుసుకోండి





వేసవి తాపం నుండి ఉపశమనం పొందడానికి మనందరికీ గుర్తొచ్చే మొదటి ఆప్షన్ కొబ్బరి నీళ్లు. అయితే అమృతం లాంటి ఈ సహజ పానీయం అందరికీ ఆరోగ్యకరం కాదన్న విషయం మీకు తెలుసా? ముఖ్యంగా ఉదయాన్నే ఖాళీ కడుపుతో కొబ్బరి నీళ్లు తాగడం వల్ల కొంతమందికి లేనిపోని ఆరోగ్య సమస్యలు ఎదురయ్యే ప్రమాదం ఉంది. ఎండలు ముదురుతున్న వేళ డీహైడ్రేషన్‌ను నివారించడానికి మనందరికీ గుర్తొచ్చే మొదటి డ్రింక్ కొబ్బరి నీళ్లు. ప్రకృతి ప్రసాదించిన ఈ సహజ పానీయం శరీరానికి తక్షణ శక్తిని ఇస్తుంది. అయితే ఆరోగ్యం కోసం ఉదయాన్నే ఖాళీ కడుపుతో కొబ్బరి నీళ్లు తాగే అలవాటు ఉన్నవారు కొన్ని జాగ్రత్తలు పాటించాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. కొబ్బరి నీళ్లలో పొటాషియం, మెగ్నీషియం, సోడియం, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరాన్ని హైడ్రేట్ చేయడమే కాకుండా జీవక్రియను మెరుగుపరుస్తాయి. బరువు తగ్గాలనుకునే వారికి ఇది ఒక అద్భుతమైన డీటాక్స్ డ్రింక్. ఇందులో కేలరీలు తక్కువగా ఉండటం వల్ల ఎక్కువసేపు కడుపు నిండిన అనుభూతిని కలిగిస్తుంది. కొబ్బరి నీళ్లు అందరికీ మేలు చేస్తాయనుకోవడం పొరపాటని కొన్ని ఆరోగ్య సమస్యలు ఉన్నవారు వీటిని తీసుకునేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు. కొబ్బరి నీళ్లలో పొటాషియం అధికంగా ఉంటుంది. ఇది రక్తపోటును మరింత తగ్గించే అవకాశం ఉంది. కాబట్టి, లో-బీపీ ఉన్నవారు ఖాళీ కడుపుతో వీటిని తాగితే తలతిరుగుడు లేదా బలహీనత వంటి సమస్యలు ఎదుర్కోవచ్చు.కొబ్బరి నీళ్లలో సహజ చక్కెరలు ఉంటాయి. ఖాళీ కడుపుతో తాగినప్పుడు శరీరం వీటిని వేగంగా గ్రహిస్తుంది, దీనివల్ల రక్తంలో చక్కెర స్థాయిలు పెరిగే అవకాశం ఉంది. షుగర్ ఉన్నవారు డాక్టర్ సలహా మేరకే వీటిని తీసుకోవాలి.కిడ్నీ సంబంధిత సమస్యలు ఉన్నవారికి కొబ్బరి నీళ్లలోని అదనపు పొటాషియం హానికరం కావచ్చు. పొటాషియం స్థాయిలు పెరిగితే కిడ్నీలపై భారం పడుతుంది.జీర్ణవ్యవస్థ బలహీనంగా ఉన్నవారు ఖాళీ కడుపుతో కొబ్బరి నీళ్లు తాగితే గ్యాస్, కడుపు నొప్పి లేదా విరేచనాలు వంటి సమస్యలు రావచ్చు. డాక్టర్ రాజ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కొబ్బరి నీళ్లను ఎప్పుడూ తాజాగా ఉన్నప్పుడే తాగాలి. మరీ చల్లగా ఉన్నవి
తీసుకోకపోవడమే మంచిది. రోజుకు ఒక గ్లాసు కొబ్బరి నీళ్లు సరిపోతాయి. ఏదైనా అనారోగ్య సమస్యతో మందులు వాడుతున్న వారు, తమ ఆహారంలో కొబ్బరి నీళ్లను చేర్చుకునే ముందు వైద్యుడిని సంప్రదించడం ఉత్తమం.

# మెట్లు ఎక్కితే కలిగే లాభాలు..



ప్రతి ఏటా కొత్త ఏడాది రాగానే మనం వేసుకునే మొదటి తీర్మానం 'ఆరోగ్యంగా ఉండాలి'. కానీ మార్చి నెల వచ్చేసరికి ఆ జిమ్ మెంబర్‌షిప్‌లు, డైట్ చార్టులు అన్నీ అటకెక్కిపోతాయి. ఆఫీసులో 9-10 గంటల పని, ప్రయాణాలు, ఇంటి పనుల మధ్య వ్యాయామం కోసం సమయం కేటాయించడం చాలా మందికి అసాధ్యంగా మారుతోంది. అయితే, ఫిట్‌నెస్ అంటే కేవలం జిమ్‌కు వెళ్లి గంటల తరబడి చెమటలు చిందించడమే కాదు. కేవలం రెండు నిమిషాల వ్యాయామంతో కూడా అద్భుతాలు చేయవచ్చని పరిశోధనలు చెబుతున్నాయి. ఆరోగ్యం కోసం మనం చేసే తీర్మానాలు ఎందుకు విఫలమవుతాయో తెలుసా? మన జీవనశైలిని పరిగణనలోకి తీసుకోకుండా అసాధ్యమైన లక్ష్యాలను పెట్టుకోవడమే అందుకు ప్రధాన కారణం. నిజానికి ఫిట్‌గా ఉండటానికి ఏసీ గదుల్లో గంటల తరబడి వర్కవుట్లు చేయక్కర్లేదు. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) ప్రకారం, శారీరక శ్రమ లేకపోవడం వల్ల మరణించే అవకాశం 20-30% ఎక్కువగా ఉంటుంది. కానీ మన చుట్టూనే ఉండి, మనం రోజూ చూసే ఒక చిన్న పని మన ప్రాణాలను కాపాడుతుందని నిపుణులు చెబుతున్నారు. ఎంతో ఖరీదైన జిమ్ పరికరాలు చేయలేని మ్యాజిక్ ను ఆ చిన్న పని చేస్తుంది. అదేంటో తెలిస్తే ఆశ్చర్యపోతారు.

హార్వర్డ్ నివేదిక ప్రకారం, రోజుకు కేవలం రెండు నిమిషాల తీవ్రమైన శారీరక శ్రమ కూడా శరీరానికి ఎంతో మేలు చేస్తుంది. వారానికి కేవలం 15 నిమిషాల వ్యాయామం మరణాల ముప్పును 18% తగ్గిస్తుంది. అదేవిధంగా వారానికి 19 నిమిషాలు కేటాయిస్తే గుండె జబ్బుల ముప్పు 40% తగ్గుతుందని అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. "ప్రతి చిన్న శారీరక శ్రమ శరీరానికి లెక్కలోకి వస్తుంది" అని కెనడాలోని మెక్‌మాస్టర్ విశ్వవిద్యాలయ నిపుణులు చెబుతున్నారు. వ్యాయామం కోసం ప్రత్యేకంగా సమయం లేని వారికి మెట్లెక్కడం ఒక వరమనే చెప్పాలి. రోజుకు రెండు మూడు సార్లు మెట్లు ఎక్కడం వల్ల జీవితంలో ఊహించని మార్పులు వస్తాయి. మెట్లెక్కడం వల్ల శరీరం గురుత్వాకర్షణ శక్తికి వ్యతిరేకంగా పనిచేయాల్సి ఉంటుంది. దీనివల్ల వేగంగా నడవడం కంటే కూడా మెట్లెక్కడం ద్వారా రక్త ప్రసరణ మెరుగుపడి, ఆక్సిజన్ వినియోగం పెరుగుతుంది.

గుండె ఆరోగ్యం- మెట్లెక్కడం వల్ల విశ్రాంతి సమయంలో ఉండే గుండె వేగం తగ్గుతుంది, ఇది ఆరోగ్యకరమైన గుండెకు సంకేతం. కండరాల దృఢత్వం- ఇది ప్రధానంగా శరీర కింది భాగంలోని కండరాలను బలోపేతం చేస్తుంది. కింది భాగం బలంగా ఉండటం అనేది దీర్ఘాయువుకు ఒక సూచిక. జ్ఞాపకశక్తి- మెట్లెక్కడం వల్ల మెదడుకు రక్తప్రసరణ పెరిగి జ్ఞాపకశక్తి మెరుగుపడుతుందని కొన్ని నివేదికలు సూచిస్తున్నాయి. బరువు నియంత్రణ- గర్భిణీ స్త్రీలలో రక్తపోటు, మధుమేహం వంటి సమస్యలను తగ్గించడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుంది. జిమ్ మెంబర్‌షిప్ వృథా అయిందని బాధపడటం మానేసి, మన రోజువారీ పనుల్లోనే వ్యాయామాన్ని వెతుక్కోవాలి. డాక్టర్లు వద్దని చెబితే తప్ప, సాధ్యమైనంత వరకు లిఫ్టులు, ఎస్కలేటర్లను పక్కన పెట్టండి. రోజుకు కనీసం రెండు మూడు అంతస్తులు మెట్లు ఎక్కడం అలవాటు చేసుకోండి. ఇది మీ ఆరోగ్యాన్ని కాపాడటమే కాకుండా మీ ఆయుష్షును పెంచుతుంది.

## కొంప ముంచుతున్న వేడి నీటి స్నానం



ప్రతి ఒక్కరూ ప్రతిరోజూ తప్పకుండా స్నానం చేయాలి. అయితే స్నానం చేసేందుకు కొందరు చల్లటి లేదా గోరువెచ్చని నీటితో స్నానం చేస్తారు. మరికొందరు శీతాకాలంలోనే కాదు వేసవిలో కూడా వేడి నీటితో స్నానం చేస్తుంటారు. వేడి నీటితో స్నానం చేయడం వల్ల శరీరం విశ్రాంతి పొందుతుంది ప్రతిరోజూ స్నానం చేయడం వల్ల శరీరం పరిశుభ్రంగా ఉంటుంది. ఆరోగ్యంగా ఉండటానికి ఇది చాలా మంచి అలవాటు. కాబట్టి ప్రతి ఒక్కరూ ప్రతిరోజూ తప్పకుండా స్నానం చేయాలి. అయితే స్నానం చేసేందుకు కొందరు చల్లటి లేదా గోరువెచ్చని నీటితో స్నానం చేస్తారు. మరికొందరు శీతాకాలంలోనే కాదు వేసవిలో కూడా వేడి నీటితో స్నానం చేస్తుంటారు. వేడి నీటితో స్నానం చేయడం వల్ల శరీరం విశ్రాంతి పొందుతుంది. కండరాల ఒత్తిడి నుంచి ఉపశమనం లభిస్తుంది. కానీ నిపుణులు.. అధిక వేడి నీటితో స్నానం చేయడం అంత మంచిది కాదని అంటున్నారు. ఇది చర్మం, జుట్టు ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతుంది. వేడి నీటి స్నానం చర్మంలోని సహజ తేమ, రక్షిత నూనెలను కోల్పోయేలా చేస్తుంది. ఇది చర్మాన్ని పొడిబారి, దురద, చికాకు వంటి సమస్యలను కలిగిస్తుంది. వేడి నీళ్లు చర్మానికి మాత్రమే కాకుండా జుట్టు, తలకు కూడా హానికరం. ఇది తల నుంచి సహజ నూనెలను తొలగిస్తుంది. ఇది జుట్టు పొడిబారడానికి కారణమవుతుంది. చుండ్రు సమస్యను తీవ్రతరం చేస్తుంది. ఇది జుట్టు కుదుళ్లను కూడా దెబ్బతీస్తుంది. జుట్టు రాలే సమస్యను పెంచుతుంది. వేడి నీటిలో స్నానం చేయడం వల్ల శరీరంలోని రక్త నాళాలు వ్యాకోచిస్తాయి. దీనివల్ల రక్తపోటు అకస్మాత్తుగా పడిపోతుంది. తలతిరుగుతుంది. అలసట వస్తుంది. వేడి నీటి ఆవిరితో ప్రత్యక్ష సంబంధం కలిగి ఉండటం వల్ల ఇది కళ్ళ సహజ తేమను తగ్గిస్తుంది. దీనివల్ల అవి ఎర్రగా, దురదగా మారుతాయి.ఉష్ణోగ్రత అసమతుల్యతవేడి నీటి అలవాట్లు శరీరం దాని సహజ ఉష్ణోగ్రతను కాపాడుకునే సామర్థ్యాన్ని ప్రభావితం చేస్తాయి. ఇది చల్లని వాతావరణాన్ని తట్టుకునే సామర్థ్యాన్ని తగ్గిస్తుంది. కాబట్టి ఎల్లప్పుడూ స్నానానికి గోరువెచ్చని నీటిని వాడటం మంచిది. ఇది చర్మం పొడిబారకుండా, దాని సహజ నూనెలను నిలుపుకోకుండా చేస్తుంది. ఇది జుట్టుకు ఎటువంటి హాని కలిగించదు.

## ఉదయాన్నే పెరుగులో దీన్ని కలిపి తింటే ఆ సమస్యలన్నీ చిటికెలో మాయం



నేటి ఉరుకుల పరుగుల జీవితం, మారిన ఆహారపు అలవాట్లు, శారీరక శ్రమ తగ్గడం వల్ల వయసుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ జీర్ణ సంబంధిత సమస్యలను ఎదుర్కొంటున్నారు. గ్యాస్, అసిడిటీ, మలబద్ధకం వంటి సమస్యలు కేవలం శారీరక ఇబ్బందినే కాకుండా రోజంతా నీరసంగా, చిరాకుగా ఉండేలా చేస్తున్నాయి. అయితే వీటన్నింటికీ మన వంటింట్లోనే ఒక అద్భుతమైన పరిష్కారం ఉంది. పెరుగు చేసే మేలు: పెరుగు ఒక సహజ సిద్ధమైన ప్రోబయోటిక్. ఇందులో ఉండే మంచి బ్యాక్టీరియా ప్రేగులను ఆరోగ్యంగా ఉంచుతుంది. ఇది జీర్ణవ్యవస్థను బలపరిచి, ఆహారం త్వరగా అరిగేలా చేస్తుంది. ప్రేగులలో మంచి బ్యాక్టీరియా సంఖ్యను పెంచడం ద్వారా మలబద్ధకం సమస్యను తగ్గిస్తుంది. కేవలం ఈ మిశ్రమమే కాకుండా రోజుకు 8-10 గ్లాసుల నీరు త్రాగడం, ఫైబర్ అధికంగా ఉండే పండ్లు, ఆకుకూరలు తీసుకోవడం, ప్రతిరోజూ 20-30 నిమిషాల నడక అలవాటు చేసుకోవడం వల్ల మీ జీర్ణవ్యవస్థ ఎల్లప్పుడూ ఆరోగ్యంగా ఉంటుంది. బెల్లం - సహజ నిర్విషీకరణి: బెల్లం కేవలం తీపి పదార్థమే కాదు, ఇది శరీరంలోని వ్యర్థాలను బయటకు పంపడంలో కీలక పాత్ర పోషిస్తుంది. ఇది జీర్ణ ఎంజైమ్లను సక్రియం చేసి, జీర్ణక్రియను వేగవంతం చేస్తుంది. పేగులను శుభ్రపరిచి, మలాన్ని మృదువుగా మార్చడం ద్వారా ఉదయం కడుపు సాఫీగా అయ్యేలా చేస్తుంది. ఈ రెండింటిని కలిపి క్రమం తప్పకుండా 5-7 రోజుల పాటు ఈ మిశ్రమాన్ని తీసుకోవడం వల్ల దీర్ఘకాలిక మలబద్ధకం నుండి ఉపశమనం లభిస్తుంది. శరీరంలోని, కడుపులోని వ్యర్థాలను సహజంగా బయటకు పంపుతుంది. కడుపు శుభ్రంగా ఉంటే, ఆ ప్రభావం చర్మంపై కనిపిస్తుంది. మొటిమలు, మచ్చలు తగ్గి ముఖం కాంతివంతంగా మారుతుంది. పెరుగులోని ప్రోబయోటిక్స్ శరీర రోగనిరోధక శక్తిని పటిష్టం చేస్తాయి. ఎలా తీసుకోవాలి?: ఒక గిన్నె తాజా పెరుగు తీసుకుని, అందులో 1-2 టీస్పూన్ల తురిమిన బెల్లాన్ని కలపాలి. దీన్ని ఉదయం ఖాళీ కడుపుతో లేదా రాత్రి భోజనం తర్వాత తీసుకోవచ్చు. అయితే షుగర్ ఉన్నవారు బెల్లం పరిమాణంపై జాగ్రత్త వహించాలి. రాత్రిపూట పెరుగు తీసుకునేటప్పుడు జలుబు చేయకుండా జాగ్రత్త పడాలి. తీవ్రమైన విరేచనాలు ఉన్నప్పుడు పెరుగు వినియోగాన్ని తగ్గించాలి.

## పక్షులను గుర్తించే అలవాటు యవ్వనంగా ఉంచుతుందా?

ప్రశాంతమైన ఉదయం వేళ.. చేతిలో బైనాక్యులర్స్ పట్టుకుని పక్షుల కోసం వెతకడం ఒక అందమైన వ్యాపకం. పక్షుల కిలకిలరావాలు, స్వచ్ఛమైన గాలి మనసుకి ఎంతో ప్రశాంతతను ఇస్తాయి. అయితే, బర్డ్ వాచింగ్ అంటే కేవలం కాలక్షేపం మాత్రమే కాదు, అదొక అద్భుతమైన మెదడు వ్యాయామం అని తాజా పరిశోధనలు వెల్లడిస్తున్నాయి. పక్షులను గుర్తించే నైపుణ్యం మీ మెదడును యవ్వనంగా ఉంచుతుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఆకాశంలో ఎగిరే పక్షులను చూస్తూ గంటల కొద్దీ సమయం గడిపే వారిని చూస్తే మీకు ఏమనిపిస్తుంది? వారు సమయాన్ని వృథా చేస్తున్నారని అనుకుంటున్నారా? అయితే మీరు పొరబడినట్లే. ఒక అరుదైన పక్షిని గుర్తించడానికి వారు చేసే ప్రయత్నం, దాని రంగులను, ఆకారాన్ని గమనించే తీరు వారి మెదడులో విప్లవాత్మక మార్పులు తెస్తోంది. పక్షులను గుర్తుపట్టే నైపుణ్యం ఉన్నవారి మెదడు, ఇతరుల కంటే నెమ్మదిగా ముసలితనానికి చేరుకుంటుందని ఒక కొత్త అధ్యయనం బాంబు పేల్చింది. కెనడాలోని యార్క్ విశ్వవిద్యాలయానికి చెందిన పరిశోధకుడు ఎరిక్ వింగ్, పక్షులను గుర్తించడంలో నిపుణులైన వారు, ఇప్పుడే ఆ వ్యాపకాన్ని మొదలుపెట్టిన వారిపై ఒక అధ్యయనం చేశారు. ఈ రెండు బృందాలకు పక్షుల చిత్రాలను చూపిస్తూ వారి మెదడును స్కాన్ చేశారు. పక్షుల మధ్య ఉన్న అతి సూక్ష్మమైన తేడాలను పక్షుల ప్రేమికులు సులభంగా పసిగట్టారు. ముఖ్యంగా వారి స్థానిక ప్రాంతాల్లో ఉండే పక్షులను గుర్తించడంలో వారు అద్భుతమైన ప్రతిభ కనబరిచారు. ఈ పరిశోధనలో తేలిన అత్యంత ఆసక్తికరమైన విషయం ఏమిటంటే.. పక్షులను గుర్తించే నిపుణుల మెదడులో దృశ్యమాన ప్రాసెసింగ్ , ఏకాగ్రత, వర్కింగ్ మెమరీకి సంబంధించిన భాగాలు చాలా బలంగా, సంక్లిష్టంగా ఉన్నట్లు గుర్తించారు. సాధారణంగా వయసు పెరిగే కొద్దీ మెదడు యొక్క సంక్లిష్టత సహజంగానే తగ్గుతుంది. అయితే, అనుభవజ్ఞులైన బర్డ్ వాచర్స్ లో ఈ మార్పు చాలా తక్కువగా ఉండటం శాస్త్రవేత్తలను ఆశ్చర్యపరిచింది.

## కావాలనే గిల్‌ని తప్పించి సూర్యకు కెప్టెన్సీ..
# గంభీర్- అగార్కర్ నిర్ణయం భేష్



**హైదరాబాద్ పెన్ పవర్:** ప్లేయర్స్ మంచి ప్రదర్శన చేస్తే మ్యాచ్ లోనైనా టోర్నమెంట్ లోనైనా ఉంటారు. మరి వారిని నడిపించే సారథిగా కూడా అదే స్థాయిలో ఉండాలి. ఆ ఆటగాళ్లను ఎంపిక చేసే సెలక్టరుకి కాస్త పరిజ్ఞానం ఉండాలి. ఈ మూడు అంశాలు కుదిరితే 'కప్ గెలవడం' విజయవంతం అవుతుంది. హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్,- చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ ద్వయానికి కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ జత కలవడంతో టీ20 ప్రపంచ కప్ ని భారత జట్టు కైవసం చేసుకుంది. ఈ మెగా టోర్నీకి ముందు అగార్కర్--- గంభీర్ తీసుకున్న కఠిన నిర్ణయాలతోనే ఇది సాధ్యమైందని చెప్పాలి.

రోహిత్ శర్మ టీ20లకి వీడ్కోలు చెప్పడంతో హార్దిక్ కి సారథ్య బాధ్యతలు ఇస్తారని అందరూ భావించారు. కానీ సూర్యకుమార్ ని గంభీర్-- అగార్కర్ కెప్టెన్ గా ఎంపిక చేశారు. ప్రపంచ కప్ ముందు జరిగిన ద్వైపాక్షిక సిరీస్ లలో శుభ్ మన్ గిల్ ని సూర్యకు డిప్యూటీగా మేనేజ్మెంట్ ఎంపిక చేసింది. భవిష్యత్తులో గిల్ కే సారథ్యం అప్పగిస్తారనే ప్రచారం జోరుగా సాగింది. గిల్ వరుసగా విఫలం కావడంతో.. సూర్య కివీస్ తో జరిగిన సిరీస్ లో మాత్రమే కాస్త ఫర్వాలేదనిపించడంతో.. అతడిపై నమ్మకం ఉంచిన అగార్కర్---గంభీర్ కెప్టెన్ గా కొనసాగించారు. దీంతో సూర్య దూకుడుగా ఆడగలడని భావించిన బీసీసీఐ సెలక్షన్ కమిటీ.. గిల్ పై వేటు వేసింది. తమకు ఆడే విధానమే ముఖ్యం.. ఫామ్ తాత్కాలికమని ఇతర సభ్యులకూ హెచ్చరిక పంపినట్లు అయింది. దాదాపు 2 ఏళ్లు జాతీయ జట్టుకు దూరమైన ఇషాన్ దేశవాళీలో అదరగొట్టడంతో.. జాతీయ జట్టులో అతడికి మళ్లీ ఛాన్స్ కల్పించడం.. ఈ ప్రపంచకప్ లోనూ దూకుడుగా ఆడిన విషయం అందరికి తెలిసిందే. అందుకే, ఈ కప్ గెలిచిన అనంతరం రాహుల్ ద్రవిడ్, వీవీఎస్ లక్ష్మన్, అజిత అగార్కర్ కి ఈ ట్రోఫీని అంకితం చేస్తున్నట్లు గౌతమ్ గంభీర్ వెల్లడించాడు. చీఫ్ సెలక్టర్ గా అజిత్ అగార్కర్ పదవీ కాలం ఈ ఏడాది జూన్ తో ముగుస్తుంది. ఇప్పటికే అతడి పదవీకాలాన్ని బీసీసీఐ పొడిగించింది. కానీ 2027లో వన్డే ప్రపంచ కప్, వరల్డ్ టెస్టు ఛాంపియన్షిప్ ఫైనల్, 2028లో ఒలింపిక్స్ పాటు అదే ఏడాది టీ20 ప్రపంచ కప్ ఉండటంతో.. అజిత్ పదవి కాలాన్ని మరికొంతకాలం పొడిగిస్తారనే ప్రచారం జరుగుతుంది. అలాగే గంభీర్ పదవీకాలం కూడా వచ్చే ఏడాది వన్డే వరల్డ్ కప్ వరకు మాత్రమే ఉంది. వీరిద్దరిని మరికొంతకాలం ఉపయోగించుకుంటే మరిన్ని టైటిళ్లను టీమిండియా కైవసం చేసుకుంటుందని అభిమానులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే సూర్య కుమార్ తన లక్ష్యాలేంటో క్లియర్ గా చెప్పేశాడు. ప్లేయర్ గా, కోచ్ గా ఇప్పటికే టీ20 ప్రపంచ కప్ ను గెలిచిన గంభీర్.. వన్డే ప్రపంచ కప్ నూ సాధిస్తే మరో అరుదైన రికార్డును తన ఖాతాలో పడటం ఖాయం. మరే ఇతర ప్రధాన కోచ్ కూడా ఇలాంటి చరిత్రను నమోదు చేయలేదు. ధోనీ నాయకత్వంలో గెలిచిన 2011 వన్డే వరల్డ్ కప్ జట్టులోనూ గంభీర్ సభ్యుడే ఉన్నాడు.

# టీమిండియా నెక్స్ట్ టీ20 కెప్టెన్‌గా సంజు శాంసన్..



**హైదరాబాద్ పెన్ పవర్:** టీ20 వరల్డ్ కప్ గెలిచిన తర్వాత భారత జట్టు సంబరాల్లో మునిగిపోయింది. ఇప్పటి వరకు మూడు సార్లు టీ20 ప్రపంచ కప్ కైవసం చేసుకున్న తొలి జట్టుగా ఇండియ నిలవగా.. సొంతగడ్డపై ట్రోఫీ నెగ్గిన మొదటి జట్టుగా రికార్డు నెలకొల్పింది. 2024 ప్రపంచకప్ ట్రోఫీ కైవసం చేసుకున్న తర్వాత రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ లాంటి స్టార్లు రిటైర్‌మెంట్ ఇవ్వగా,, యువ జట్టు ఎలా ఆడుతుందోనని అనుమానాలు వ్యక్తం అయ్యాయి. కానీ అవన్నీ ఫటాపంచల్ చేస్తూ 2026 విశ్వవిజేతగా అవతరించింది. రోహిత్ శర్మ నుంచి టీ20 పగ్గాలు తీసుకున్న సూర్యకుమార్ యాదవ్ ఇప్పటి వరకు ఒక్క సిరీస్ కూడా ఓడిపోని సారథిగా నిలిచాడు. ఆసియా కప్, టీ20 ప్రపంచకప్ గెలిపించిన కెప్టెన్‌గా కొనసాగుతున్నాడు. కాగా భారత జట్టు భవిష్యత్ కెప్టెన్ గురించి ఇప్పటి నుంచి సోషల్ మీడియాలో తెగ చర్చలు స్టార్ట్ అయ్యాయి. ప్రస్తుతం సూర్యకి 35 ఏళ్లు కాగా.. 2028 లాస్ ఏంజిల్స్ ఒలింపిక్స్, వచ్చే వరల్డ్ కప్ (2028) నాటికి అతడికి 37 ఏళ్లు వస్తాయి. కాబట్టి, టీమ్‌లో ఉన్నప్పటికీ.. కెప్టెన్‌గా మాత్రం కొనసాగుతాడా లేదా అనేది డౌటే.

ప్రస్తుతం ఉన్న జట్టులో కెప్టెన్సీ రేసులో చాలామంది ఆటగాళ్ల పేర్లు వినిపిస్తున్నాయి. మొదటి వరుసలో మాత్రం సంజూ శాంసన్ పేరు ఉంది. వరల్డ్ కప్ లో చివరి మూడు మ్యాచ్ లలో చేసిన?అద్భుత ప్రదర్శన చేసి భారత్ విశ్వవిజేతగా నిలవడంలో కీలక పాత్ర పోషించాడు. ఐపీఎల్‌లో రాజస్థాన్ రాయల్స్ టీమ్‌కు కెప్టెన్‌గా పని చేసిన అనుభవం అతడికి ఉంది. జట్టులోని సీనియర్ ప్లేయర్ కావడంతో సూర్యకు సరైన వారసుడిగా సంజూనే అని పలువురు మాజీలు విశ్లేషిస్తున్నారు. కొత్త కెప్టెన్సీపై టీమిండియా మాజీ క్రికెటర్ మొహమ్మద్ కైఫ్ మాట్లాడుతూ.. టీ20 జట్టు సారథిగా సంజూ శాంసన్ మంచి ఎంపిక అన్నారు. సంజూకు కెప్టెన్ ఉండాల్సిన అన్ని లక్షణాలు ఉన్నాయి.. క్లిష్ట సమయాల్లో కూడా ఎలాంటి టెన్షన్ లేకుండా నిర్ణయాలు తీసుకునే సత్తా అతడికి ఉందన్నారు. సూర్యకుమార్ తరువాత కొత్త కెప్టెన్ ఎవరు అని ఇప్పుడే చెప్పడం చాలా కష్టం.. సంజూ మాత్రం ముందు వరుసలో ఉంటాడని పేర్కొన్నాడు. కెప్టెన్ ప్రపంచాన్ని చూసిన వ్యక్తి అయి ఉండాలని.. బౌలింగ్‌లో మార్పులు.. సరైన ఆటగాళ్లను తుది జట్టులో ఆడించడం.. ఫామ్‌లో లేని వాళ్లకు సపోర్టు చేయడం ఆటలో భాగమని కెప్టెన్‌గా తెలిసిన వ్యక్తి ఉండాలన్నాడు. శాంసన్ కచ్చితంగా కెప్టెన్సీ రేసులో ఉంటాడని నేను భావిస్తున్నాను అని కైఫ్ పేర్కొన్నారు. సూర్యకుమార్ రిటైర్‌మెంట్ ప్రకటిస్తే.. ఆ స్థానాన్ని భర్తీ చేయగలడు వ్యక్తి సంజునే.. ఐపీఎల్‌లో చాలా మ్యాచ్‌లకు కెప్టెన్‌గా వ్యవహరించాడు. రాజస్థాన్ రాయల్స్‌ను 2022 ఫైనల్‌కు తీసుకెళ్లాడు. అతడి వయస్సు కేవలం 31 ఏళ్లు మాత్రమే.. కాబట్టి, టీమిండియా తదుపరి కెప్టెన్ కావొచ్చని చెప్పుకొచ్చాడు. ప్రస్తుతం జట్టులో ఉన్న వారిలో హార్దిక్ పాండ్యాకు కెప్టెన్సీ బాధ్యతలు ఇచ్చి.. తీసేశారు. వైస్ కెప్టెన్‌గా ఉన్న అక్షర్ పటేల్‌కు కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించే ఛాన్స్ లు చాలా తక్కువగా ఉన్నాయి. మిగిలిన వారందరితో పోల్చితే, సంజూనే ది బెస్ట్ ఆప్షన్‌గా కనిపిస్తున్నాడని ఇతర మాజీ ఆటగాళ్లు వెల్లడిస్తున్నారు.

# చెన్నైలోకి సంజు శాంసన్ ఎంట్రీ.. ధోనీ ఆడటంపై అనుమానాలు.. సీఈవో ఏమన్నారంటే!



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపిఎల్) 2026 19వ సీజన్ మార్చి 28వ తేదీ నుంచి ప్రారంభం కానుంది. ఈ క్యాష్ రిచ్ లీగ్ కోసం ఇప్పటికే అన్ని ఫ్రాంచైజీలు తమ ప్రాక్టీస్ క్యాంపులను ప్రారంభించాయి. దీంతో గత సీజన్ లో పేలవ ప్రదర్శనతో టోర్నీని ముగించిన చెన్నై సూపర్ కింగ్స్ ఈసారి జట్టులో భారీ మార్పులు చేసింది. దీంతో టీమ్ లోకి కొత్తగా సంజు శాంసన్ తో పాటు యువ ఆటగాళ్లకు అధిక ప్రాధాన్యత ఇస్తుంది. అయితే జట్టులోకి సంజు ఎంట్రీ ఇవ్వడంతో.. వయసు కారణంగా ఎంఎస్ ధోనీ అన్ని మ్యాచ్‌లలో ఆడగలరా అన్న సందేహాలు అభిమానుల్లో నెలకొన్నాయి.. ఆయన బెంచ్ కే పరిమితం అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయనే ప్రచారం సోషల్ మీడియాలో జోరుగా సాగుతుంది. మహేంద్ర సింగ్ ధోనీ ఆడటంపై చెన్నై సూపర్ కింగ్స్ సీఈఓ కాశీ విశ్వనాథన్ మాట్లాడుతూ.. ఐపీఎల్ 2026 సీజన్‌లో దాదాపు అన్ని మ్యాచ్‌లలో ధోనీ ఆడే అవకాశం ఉందని తెలిపారు. ఆయన జట్టులో ఏ పొజిషన్ లో ఆడతారన్నది టీమ్ మేనేజ్‌మెంట్ తీసుకునే నిర్ణయంపై ఆధారపడి ఉందన్నారు. జట్టు కోచింగ్ సిబ్బంది నిర్ణయం మేరకు ఆయన బ్యాట్స్‌మన్‌గా ఆడతారా, వికెట్ కీపర్-బ్యాటర్‌గా ఆడతారా లేదా ఇంపాక్ట్ ప్లేయర్‌గా వస్తారా అన్నది త్వరలోనే నిర్ణయిస్తామని వెల్లడించారు.

**చెన్నైలోనే సీఎస్కే హోమ్ మ్యాచ్‌లు:** ఈ ఏడాది జరగనున్న ఐపీఎల్ షెడ్యూల్ త్వరలో ప్రకటించే అవకాశం ఉందని సీఎస్కే సీఈఓ కాశీ విశ్వనాథన్ తెలిపారు. దేశంలో ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కావడంతో షెడ్యూల్ ప్రకటన కొంత ఆలస్యమైంది. మా హోమ్ మ్యాచ్‌లు అన్నీ తమిళనాడులోనే జరుగుతాయి.. షెడ్యూల్‌ను దీజజ× ప్రకటించేందుకు మేము వేచి చూస్తున్నామని చెప్పారు. ఇక టీమిండియా వరుసగా రెండోసారి టీ20 వరల్డ్ కప్ గెలవడం పట్ల కూడా ఆయన ఆనందం వ్యక్తం చేశారు. ముఖ్యంగా సీఎస్కే ఆటగాళ్లు సంజు శాంసన్, శివమ్ దూబే టోర్నీలో అద్భుతమైన ప్రదర్శన చేశారని పేర్కొన్నారు. చెన్నై సూపర్ కింగ్స్ జట్టు ప్రాక్టీస్ క్యాంప్ సజావుగా సాగుతుంది. ఇప్పటి వరకు ఎలాంటి సమస్యలు లేవని కాశీ విశ్వనాథన్ వెల్లడించారు.



స్టైలిష్ కో-ఆర్డ్ ఫోటోషూట్‌లో కావ్య థాపర్ గ్లామర్‌ను ప్రసరిస్తుంది

# స్టన్నింగ్ డార్క్ లుక్‌లో శ్రుతి హాసన్ గ్లామర్ షో



జిన్నీ వెడ్స్ సన్నీ 2ని ప్రమోట్ చేస్తున్నప్పుడు మేధా శంకర్ గ్రీన్ లెహంగాలో స్టన్స్ చేసింది

టాలీవుడ్ బ్యూటీ శ్రుతి హాసన్ ప్రస్తుతం సోషల్ మీడియాలో సెంటర్ ఆఫ్ అట్రాక్షన్‌గా నిలిచింది. ఒకపక్క తన మధురమైన గొంతుతో మ్యూజిక్ లవర్స్‌ను మైమరపిస్తూనే, మరోపక్క అదిరిపోయే ఫోటోషూట్లతో కుర్రకారు గుండెల్లో సెగలు రేపుతోంది. రీసెంట్‌గా ఆమె షేర్ చేసిన బ్లాక్ అవుట్‌ఫిట్ ఫోటోలు ఇప్పుడు ఇంటర్నెట్‌ను షేక్ చేస్తున్నాయి. ఆ డార్క్ అండ్ బోల్డ్ లుక్‌లో శ్రుతి స్టైల్ చూస్తే ఎవరైనా ఫిదా అవ్వాల్సిందే. అసలు శ్రుతి కొత్త ప్రాజెక్ట్స్ గురించి, ఆ ఫోటోల స్పెషాలిటీ ఏంటో ఇప్పుడు చూద్దాం.

**'పవళమల్లి'తో మాయ చేస్తున్న శ్రుతి.. మ్యూజిక్ మ్యాజిక్:**
శ్రుతి హాసన్‌కు నటనతో పాటు సంగీతం అంటే ఎంత ప్రాణమో మనకు తెలిసిందే. రీసెంట్‌గా ఆమె మహేష్ వారణాసి మూవీలో 'సంచారి' అనే పాటతో మెప్పించగా, ఇప్పుడు 'పవళ మల్లి' అనే మరో బ్యూటిఫుల్ సాంగ్‌తో మన ముందుకు వచ్చింది. యంగ్ కంపోజర్ సాయి అభ్యంకర్ సంగీత దర్శకత్వంలో రూపొందిన ఈ పాటలో శ్రుతి తన గంభీరమైన గొంతుతో ప్రాణం పోసింది. ఈ పాట వింటుంటే తెలియని హాయి కలుగుతోందని నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు. కేవలం నటిగానే కాకుండా, ఒక సింగర్‌గా కూడా తనకంటూ ఒక ప్రత్యేకమైన బ్రాండ్‌ను క్రియేట్ చేసుకుంటోంది శ్రుతి.



**బ్లాక్ డ్రెస్.. రెడ్ బ్యాక్‌గ్రౌండ్.. అదిరిపోయిన ఫోటోషూట్:**
పాటలతో పాటు శ్రుతి లేటెస్ట్ ఫోటోషూట్ ఇప్పుడు వైరల్‌గా మారింది. స్టైలిష్ బ్లాక్ క్రాప్ టాప్, లాంగ్ స్కర్ట్‌తో పాటు ఎంబ్రాయిడరీ చేసిన జాకెట్‌ను ధరించి ఆమె ఇచ్చిన పోజులు అదిరిపోయాయి. డార్క్ కలర్ థీమ్‌లో ఉన్న ఈ ఫోటోలకు రెడ్ బ్యాక్‌గ్రౌండ్ తోడవ్వడంతో అవి మరింత అందంగా కనిపిస్తున్నాయి. మినిమల్ యాక్సెసరీస్, సింపుల్ హెయిర్ స్టైల్‌తో శ్రుతి తన బాడీ లాంగ్వేజ్‌తోనే ఒక పవర్‌ఫుల్ వైబ్‌ను క్రియేట్ చేసింది. ముఖ్యంగా ఆమె కళ్లల్లో ఇంటెన్సిటీ ఫోటోలకు హైలైట్‌గా నిలిచింది.**లైన్ లో క్రేజీ ప్రాజెక్టులు.. సలార్ 2 కోసం వెయిటింగ్:**
శ్రుతి కెరీర్ ప్రస్తుతం మూడు సినిమాలు, ఆరు పాటలు అన్నట్లుగా సాగుతోంది. తెలుగులో 'ఆకాశంలో ఒక తార', తమిళంలో 'ట్రైన్' వంటి వెరైటీ సినిమాల్లో ఆమె నటిస్తోంది. అయితే అందరి కళ్లు మాత్రం ప్రభాస్ సరసన ఆమె నటించబోతున్న 'సలార్ పార్ట్ 2' మీదనే ఉన్నాయి. ఇక ప్రస్తుతం ఈ సినిమా ప్రీ-ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. ఇలా అటు సినిమాలతో, ఇటు ఫ్యాషన్ ఇంకా మ్యూజిక్ తో శ్రు తి హాసన్ ఎప్పుడూ వార్తల్లో నిలుస్తూ తన క్రేజ్‌ను డబుల్ చేసుకుంటోంది.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965